శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము

వివరణ



శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

6వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-6

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

ధర్మగుబ్ధర్మకృద్ధర్మీ సదసత్క్షరమక్షరం |
అవిజ్ఞాతా సహస్రాంశుర్విధాతా కృతలక్షణః || (51)

476. ధర్మగుప్

ధర్మమును రక్షించువాడు

ఓం ధర్మగుపే నమః

ధర్మం గోపయతి రక్షతి ఇతి ధర్మగుప్. ధర్మమును కాపాడువాడు ధర్మగుప్. ఇందుకు శ్రీ శంకరులు గీత(4.8)నుండి చెప్పిన ఆధారము. **ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.** ధర్మసంస్థాపన కొఱకు నేను యుగయుగమున అవతరింతును – అని శ్రీకృష్ణభగవానుడు బోధించెను.

కామం దత్వాప్యర్థకామౌ వివర్త్య విషయాంతరాత్
తాభ్యాం హితస్య ధర్మస్య రక్షణాత్ ధర్మగుప్ స్మృతః
అర్ధ కామములను కోరేవారికి వాటిని ఇచ్చి, క్రమంగా వారి బుద్ధిని మరల్చి, వారికి హితమైన ధర్మమునందు ప్రవేశపెట్టి ధర్మాన్ని కాపాడేవాడు. ధర్మమును రక్షించినందున ధర్మగుప్ అని స్మరింపబడును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సృష్టి ఆదినుండి అంతమువరకు ధర్మమార్గమున జీవులను క్రమబద్ధముగా పరిరక్షించువాడు. చెట్టునుండి వచ్చిన విత్తనము మరల చెట్టుకు జన్మనిచ్చును. ఇలా జీవరాశి పరిరక్షించబడుచున్నది. ఇందుకు స్మృతినుండి ఉదాహరణ –
త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపా అదాభ్యః అతో ధర్మాణి ధారయన్ (యజుర్వేదము 34.43)

ధర్మచక్రము రచయిత – ధర్మముననుసరించువారిని రక్షించి, భగవంతుడు ధర్మమును వీడినవారిని శిక్షించును. లోకములో ధర్మము క్షీణించినపుడు ఉత్పాతములు సంభవించును. ఈ నామస్తోత్రమువలన మనము సకల సంకల్ప వ్యవహారములలో ధర్మమార్గానువర్తనమును అలవాటు చేసుకొనవలయును.

477. ధర్మకృత్

- తన భక్తులు ధర్మమును ఆచరించుటకు చేయూతనిచ్చువాడు.
- తానే స్వయముగా ధర్మమును అనుష్ఠించువాడు.

ఓం ధర్మకృతే నమః

సర్వం జనం ధార్మికయన్ లీలానుగ్రహ లక్షణమ్
ధర్మం కరోతి యస్మాద్ధి తస్మాద్ధర్మకృదుచ్యతే

లోకంలో ప్రజలందరినీ ధార్మికులుగా చెయ్యడానికి ధర్మాన్ని ముందుగా తాను ఆచరిస్తూ, ఇతరులచేత కూడా ఆచరింపజేయువాడు. శ్రీనివాసుని అనుగ్రహమువలననే ధర్మమార్గానుచరణ సాధ్యమవుతుంది. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన వివరణ –

ధర్మం సామాన్యం అమలమ్ అనాది నిధనమ్ విభుమ్
దుర్లభం యత్ప్రబుద్ధానామ్ తత్ప్రసాదయితా వినా

గొప్ప జ్ఞానులకు కూడా శ్రీమహావిష్ణువు అనుగ్రహము లేకుండా నిర్మల, అనాదినిధనమైన ధర్మమునాచరించుట సాధ్యము కాదు. ఆ కరుణామయుడు మాత్రమే మనపై దయదలచి, మనను ధర్మమార్గమున నడిపించును.

శ్రీదేవుడు ధర్మాధర్మములకు అతీతుడైనా గాని లోకుల మేలుగోరి తాను స్వయముగా ధర్మమునునుష్ఠించి అందరికిని దారిచూపును. **ధర్మ మర్యాదా స్థాపనార్థమ్ ధర్మమేవ కరోతి ఇతి ధర్మకృత్** – అని శ్రీ శంకరులు చెప్పారు.

శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించిన నమ్మాళ్వార్ రచన (5.6.4) – **<u>సైవార్గళై</u> <u>చ్చెవేనుమ్</u> యానె**.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – జీవితములో ధర్మము ప్రాముఖ్యత గురించి – క్రితం జన్మల కర్మఫలితంగా జీవాత్మ శరీరములో బందీయైనది. ఆత్మవిమోచన కొఱకు దేవుడు ధర్మము అనే సాధనమును ప్రసాదించినాడు.

గీత 3.22,23,24 – ఓ అర్జున! ఈ ముల్లోకములయందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో ఏదియును నేను పొందనిదియును లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను. ఏలనన ఓ పార్థా! ఎప్పుడైనను నేను సావధానుడనై కర్మలయందు ప్రవర్తించకున్నచో

లోకమునకు గొప్ప హాని సంభవించును. ఎందుకనగా మనుష్యులందరును అన్నివిధముల నా మార్గమునే అనుసరింతురు. నేను కర్మలను ఆచరించుట మానినచో ఈ లోకములన్నియును నశించును. అంతేగాదు. లోకములందు అల్లకల్లోలములు (సాంకర్యములు) చెలరేగును. ప్రజానష్టము వాటిల్లును. అందులకు నేనే కారకుడనయ్యెదను.

478. ధర్మీ

ధర్మమే ఉపకరణముగా గలవాడు. ధర్మస్వరూపుడు.

ఓం ధర్మిణే నమః

ధర్మః అస్య అస్తి ఇతి ధర్మీ – ధర్మముగలవాడు గనుక ఆయన ధర్మి.

రామో విగ్రహవాన్ ధర్మః – శ్రీరాముడు ధర్మము మూర్తీభవించిన స్వరూపము.

భగవంతుడు ధర్మమును రక్షించువాడు. తన భక్తులను రక్షించుటకు ధర్మమే సాధనముగా గలవాడు.

సాధారణోపకరణం ధర్మో యస్యాస్తి కేవలం

స వై ధర్మీతి విజ్ఞేయం షడర్ణో ధర్మదో మనుః

లోకంలో ప్రసిద్ధమైన ధర్మాన్ని జగద్రక్షణ కోసం సాధనముగా గ్రహించువాడు. ఈ నామము షడక్షరి. ధర్మప్రదము. ఓం ధర్మిణే నమః

ధర్మచక్రము రచయిత – ధర్మము అనంతము. అనాదిగానున్నది. భగవానుడు ఆద్యంత రహితుడు. ధర్మస్వరూపుడు. ధర్మమును అనుసరించువారు శాశ్వత కీర్తిమంతులగుదురు. ధర్మమును త్యజించినవారు నశింతురు. భక్తులకు ధర్మమును నేర్పుటకు, వారిని ధర్మమార్గమున నడిపించుటకు శ్రీహరి సదా అవకాశమును కలుగజేయును. కనుకనే భీష్మపితామహుని అంత్యకాలమున ఆయనవద్ద ధర్మమును గ్రహించమని యుధిష్ఠిరునకాదేశించెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సూర్యచంద్రాదులు ధర్మము తప్పక తమ గతులననుసరించెదరు. ఇటువంటి విషయములలో మనము గ్రహింపవలసినది – భగవానుడు ధర్మమును సదా అమలు చేయును.

తరువాతి నాలుగు నామములు – **సత్, అసత్, క్షరమ్, అక్షరమ్**

ఈ పుణ్య నామములను శ్రీ శంకరులు, శ్రీభట్టులు వేరు వేరు క్రమములలో వ్యాఖ్యానించిరి.

శ్రీ శంకరులు : **సత్ – అసత్ – క్షరమ్ – అక్షరమ్**

శ్రీ భట్టులు : **సత్ – అక్షరమ్ – అసత్ – క్షరమ్**

ఇద్దరు భాష్యకారులు ఈ నామములను ఒకే విధముగా గ్రహించినప్పటికీ, వారు అవలంబించిన పద్ధతిలో కొంత వ్యత్యాసమున్నది. శ్రీ భట్టులు 'సత్' నామమునకు 'అక్షరమ్' అన్నపదమును విశేషణముగాను,

'అసత్' నామమునకు 'క్షరమ్' అన్న పదమును విశేషణముగాను పరిగణించారు. శ్రీ శంకరులు మాత్రము వీటిని వేరువేరు నామములుగా గ్రహించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య	**శ్రీ భట్టుల వ్యాఖ్య**
సత్	సత్
అసత్	సత్ అక్షరమ్
క్షరమ్	అసత్
అక్షరమ్	అసత్ క్షరమ్

'సత్', 'అసత్' అనే నామాలు సామాన్య వ్యవహారంలో పరస్పర వ్యతిరేక అర్థాలుగల ఒక జంటగాను, అలాగే 'క్షరమ్' అక్షరమ్' అనేవి అలాంటి మరొక జంటగానూ చూడవచ్చును.

479. సత్

- ప్రశంసింపదగిన, ఉత్తమమైనవాడు.
- శాశ్వతమైనవాడు.
- మంచి, ఉత్తమ కార్యముల రూపము గలవాడు.

ఓం సతే నమః

నిరుపాధిక సద్భావాత్ నిత్య సాద్గుణ్య యోగతః
సచ్ఛబ్దేనోచ్యతే విష్ణుః వేదవేదాంతపారగైః
సహజమైన సత్తుగలవాడు, సద్గుణాలను ఆభరణంగా ధరించాడు. అందుచేత శ్రీమన్నారాయణుడు వేదవేదాంతపారంగతులచేత 'సత్' అనిచెప్పబడుతున్నాడు. నిస్సంశయంగా, నిరవధికముగా సకల కళ్యాణ శుభలక్షణ గుణోపేతుడు గనుక శ్రీమన్నారాయణుడు 'సత్'. అంతే గాక ఆయన ఆద్యంతరహితుడైన నిత్యసత్యస్వరూపుడు, శాశ్వతుడు – అని శ్రీభట్టులు వివరించారు.

అద్వైతపరమైన వ్యాఖ్యానములలో **'సత్'** అనగా 'నిజము' అనే అర్థము గైకొనబడినది. రెండు విధములైన సత్యములను శ్రీరాధాకృష్ణశాస్త్రి వివరించారు.
పారమార్థిక సత్యము – భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలో కూడా మారనిది. శాశ్వతమైనది.
వ్యావహారిక సత్యము – భౌతిక ప్రపంచమువంటిది. పారమార్థిక సత్యములోనుండి ఉద్భవించి మరల అందులోనే ప్రళయకాలమున లీనమగునది.
భగవంతుడు నిత్యసత్యము. పారమార్థిక సత్యము. ఓం సతే నమః

భగవద్గీత 17వ అధ్యాయము శ్రద్ధాత్రయవిభాగ యోగము (17 - 23, 24, 25, 26, 27)లో **'ఓం తత్ సత్'** అనే పదాలను శ్రీకృష్ణభగవానుడు వివరించెను.

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా

తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదాన తపః క్రియా
ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్

తదిత్య నభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః
దాన క్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః

సద్భావే సాధుభావే చ సదిత్యే తత్ప్రయుజ్యతే
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే

యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే
కర్మచైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే

ఓం, తత్, సత్ – అను మూడు విధములగు పేర్లు సచ్చిదానంద ఘన పరబ్రహ్మకు నిర్దేశించబడినవి. ఆ పరమాత్మనుండియే సృష్ట్యాదియందు బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములు ఏర్పడుట జరిగినది. కనుక వేదమంత్రములను పఠించువారు శాస్త్రవిహితములయిన యజ్ఞ, దాన, తపశ్చర్యలను సర్వదా **'ఓమ్'** అను పరమాత్మ నామమున ప్రారంభింతురు. మోక్షకాంక్ష గలవారు స్వలాభాపేక్ష లేశమాత్రమైనను లేకుండ లోకహితార్థమై యజ్ఞ, దాన, తపశ్చర్యలను 'ఇదియంతయు పరమాత్మదే' అను భావముతో **'తత్'** అను నామమును ఉచ్చరించుచు చేయుదురు. ఓ పార్థ! **'సత్'** అను పరమాత్మ నామము సత్యభావమునందును, శ్రేష్ఠ భావమునందును – అనగా పరమాత్ముడు నిత్యుడు, శ్రేష్ఠుడు అను భావమునందును ప్రయోగించబడుచు నుండును. ఉత్తమ కర్మాచరణమునందును **'సత్'** అను శబ్దము ప్రయుక్తమగుచుండును. యజ్ఞ దాన తపః క్రియలయందలి నిష్ఠ, ఆస్తిక భావమును **'సత్'** అనియందురు. పరమాత్మనుద్దేశించి చేయబడు నిశ్చయాత్మక కర్మలను కూడ **'సత్'** అనియందురు.

480. అక్షరమ్

అక్షరమ్ సత్

సత్ అక్షరమ్

- నిశ్చయముగా ఎన్నటికిని తరగని, చెరగని సత్యము.
- మంచివారిని, మంచిని ఎన్నడూ విడనాడనివాడు.

ఓం అక్షరాయ నమః

ఓం అక్షర సతే నమః

క్షరము అనగా క్షీణించునది. అక్షరము అనగా ఎన్నడును క్షీణించనిది. **అపక్షయ వినాశాది వర్జితోऽక్షర ఉచ్యతే** – తరుగుట, విరుగుట మొదలైన వికారములు లేనివాడు, నాశన రహితుడు, సత్యము, నిత్యము ఐనవాడు, ఆది, అనాది అయినవాడు, జన్మ మృత్యు జరాదులు లేనివాడు. సృష్టి జరుగకముందు ఉన్నవాడు, ఇప్పుడు ఉన్నవాడు, ఇకముందుకూడా ఉండేవాడు, సృష్టి స్థితి లయాదులకు కారణభూతుడు. అతడే పరబ్రహ్మ. అక్షరము.

శ్రీ భట్టులు తమ వ్యాఖ్యానములో **'సత్'** అనే (479వ) నామమునకు **'అక్షరమ్'** అనే (480వ) నామమును విశేషణముగా గ్రహించారు. కనుక ఈ ఏకనామము **'సత్ అక్షరమ్'** లేదా **'అక్షరమ్ సత్'** అగును. అనగా అక్షరమైన సత్. ఏ విధమైన క్షీణత లేని సకల కళ్యాణ శాశ్వత సచ్చిదానందమూర్తి. ఆయన స్వరూపము, స్వభావము, కళ్యాణ గుణములు అక్షరములు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణమునుండి, ఛాందోగ్యోపనిత్తునుండి ప్రమాణములను ఉదాహరించారు.

అపక్షయ వినాశాభ్యామ్ పరిణామర్ధి జన్మభిః
వర్జితః శక్యతే వక్తుమ్ సదాస్తీతి కేవలమ్ – విష్ణుపురాణము (1.2.11)
తరుగుట, నశించుట, మార్పు చెందుట, పెరుగుట, జన్మించుట వంటి దశ లక్షణములు ఆయనకు వర్తించవు. 'ఎప్పుడూ ఉండేదే' అనే భావంతోనే పరబ్రహ్మను గురించి ప్రస్తావించడం సాధ్యం.

సదేవ సోమ్య! ఇదమగ్ర ఆసీత్ – ఛాందోగ్యోపనిషత్తు 6.2.1 – నాయనా! ఈ ఉండడం అనేది మొదట్లోనూ ఉండేది. అన్నింటికంటే అధిక స్థానంలో ఉన్నది **'సత్'** మాత్రమే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'క్షరమ్' అనగా 'సంచరించుట' అన్న అర్థంలో – నిశ్చలంగా, నిలకడగా ఉండేది అక్షరము. సత్పురుషులకు, సన్మార్గమునకు, సత్కార్యమునకు ఎన్నడూ దూరము కానిది **'సత్-అక్షరమ్'**.

481. అసత్

- ఇప్పుడు లేనిది. కాని పూర్వము ఉన్నది. భవిష్యత్తులో ఉండేది.
- పాపకర్ములకు దుఃఖహేతువైన బంధనములు కలుగజేయువాడు.
- ధర్మమును వీడినవారికి లేనివాడు.

ఓం అసతే నమః

తపామ్యహమ్ వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ

అమృతం చైవ మృత్యుశ్చ సద సచ్చాహ మర్జున – భగవద్గీత 9.19

సత్ – అసత్ – ఈ రెండూ తానేనని శ్రీకృష్ణుడు తెలియజేసినాడు. ఈ శ్లోకమునకు శ్రీమద్రామానుజుల వ్యాఖ్య:

సత్ యద్ వర్తతే – ప్రస్తుతమున్నది సత్యము.

అసత్ యద్ అతీతమ్ చ అనాగతమ్ చ – గడచిన కాలంలోనూ, రాబోయే కాలంలోనూ ఉన్నది అసత్.

అన్ని కాలాలలోనూ ఉన్న భగవానుడు సత్-అసత్.

గీత (17.26)లోనే 'శత్' శబ్దమును 'సాధుభావము'లో వాడుదురని చెప్పడమైనది. కనుక అసాధువులైనవారికి దేవుడు 'అసత్'. అనగా పాపకర్ములను శిక్షించువాడు.

ధర్మము పాటించనివారికి భగవంతుడు తలపురాడు. కానరాడు. కాపాడరాడు. వారికి ఆయన 'అసత్'.

482. అసత్ క్షరమ్

క్షరమ్

- అసత్తునకు క్షరస్వభావము (దూరముగానుండు లక్షణము) కలవాడు.
- పరిణామశీలమైన, తుదకు లయించు భౌతికజగత్తు రూపముకూడ అయినవాడు.

ఓం అసత్ క్షరాయ నమః

ఓం అసత్ క్షరాయ నమః

ఓం క్షరాయ నమః

'క్షరము' అనగా అశాశ్వతమైనది. దూరముగా పోవునది. ('క్షర' ధాతువునకు 'ప్రవహించుట' అన్న భావము కలదు). దుర్మార్గములోనరించువారికి దూరమగువాడు, అందనివాడు గనుక భగవంతుడు క్షరుడు అని ఈ నామ వివరణలో శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – జగత్తులో భౌతికమైనవి క్షరములు. అంతటా అంతర్యామిగానున్నది అక్షరము. క్షరమైనదాని ఉనికికి , చైతన్యమునకు, చలనమునకు కారణమైనది అక్షరము. భగవానుడు క్షరము, అక్షరము కూడ. మనము నడచేటప్పుడు ఒక్కో అడుగు సమయంలో ఒకో కాలు కదులుతూ ఉంటుంది. మరో కాలు భూమిపై ఆని స్థిరంగా ఉంటుంది. అలాగే జగత్తులో కదిలేవి (చైతన్యము, మార్పు కలిగినవి)గానూ, కదలనివిగానూ ఉంటాయి. అలాంటి చైతన్యమునకు అంతఃకారణముగానూ భగవంతుడు క్షరుడు, అక్షరుడు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఇందుకు శ్రుతులనుండి అనేక సూక్తులను ఉదాహరించారు.

తదేజతి తన్నైజతి తద్దూరే తదంతికే

తదంతరస్య సర్వస్య తదు సర్వస్య బాహ్యతః – ఈశావాస్యోపనిషత్తు

భగవంతుడు క్షరుడు, అక్షరుడు కూడ అని వివరిస్తూ శ్రీ చిన్మయానంద చెప్పిన చక్కని ఉదాహరణ – సముద్రంలో అలలు ఎగసిపడుతూ, మళ్ళీ వెంటనే నశిస్తాయి. కాని నశించని సముద్రంలో ఆ అలలు కూడా ఒక భాగమే.

483. అవిజ్ఞాతా

తెలియనివాడు.

- తన భక్తుల తప్పుల నెఱుగనివాడు.
- అందరిని కాపాడువాడు.
- కల్పితమైన జ్ఞానము (భ్రమ) లేనివాడు.

ఓం అవిజ్ఞాత్రే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తనను శరణుజొచ్చినవారి దోషములను పూర్తిగా విస్మరించును. భక్తుల తప్పులు ఆయనకు తెలియవు.

ప్రపన్న కృత పాపానాం కించదప్యవిచారణాత్

అవిజ్ఞాతేతి కథితః బుద్ధైః సద్గుణసాగరైః

(ప్రపన్నులు బుద్ధిపూర్వకంగా పాపాలు చేసినప్పటికీ ఏమాత్రమూ పట్టించుకోనివాడు) ఆశ్రితుల అపరాధముల నెఱుగనివాడు. **ఉచ్యమానోऽపి పరుషమ్ నోత్తరమ్ ప్రతిద్యతే** – అయోధ్యకాండము 1.10 – శ్రీరాముడు తనపట్ల పరుషముగా మాటలాడినవారికి ఏమియును జవాబు ఇచ్చెడివాడు కాదు.

ఇందుకు వివరణగా శ్రీ భట్టులు తమ తండ్రి శ్రీ కూరత్తాళ్వాన్ రచనను ప్రస్తావించారు –

సర్వజ్ఞతామ్ ఏవమ్ ఉపాలభామహే

త్వమ్ హి అజ్ఞాన ఏవ ఆశ్రిత దోషజోషణః

భగవంతుడా! నీవు సర్వజ్ఞుడవందురు. కాని మేము అందుకు అంగీకరించము. నీ భక్తుల దోషములు నీకేమియును తెలియవు.

శ్రీ వి.వి. రామానుజన్ పెరియాళ్వారువారి సన్నుతిని స్మరించారు – **ఎన్నడియార్ అదు శెయ్యార్ సెయిదారేల్ నన్రు సెయిదార్ ఎంబార్** (4.9.2) – నా భక్తుడు ఈ పాపము చేసియుండడు. ఒకపరి అలా చేసియుండినా అది సత్కార్యమే.

అపిచేత్సు దురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ స మంతవ్యః సమ్యగ్ వ్యవసితో హి సః
మిక్కిలి దురాచారుడైనను అనన్య భక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన యదార్ధముగా అతడు నిశ్చయబుద్ధి గలవాడు. అనగా పరమాత్ముని సేవించుటతో సమానమైనది మరియొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమును "అవి-జ్ఞాతా" అని పరిగణించి వ్యాఖ్యాణించారు. 'అవ్' అనే ధాతువునకు 'రక్షించుట' అని భావము. 'అవిజ్ఞాతా' అనగా కాపాడుట తెలిసినవాడు. అందరిని కాపాడువాడు. అందరిలోనూ అంతర్యామియై తనను శరణుజొచ్చినవారిని రక్షించువాడు అవిజ్ఞాత. ఇందుకు ప్రమాణమైన వైదిక మంత్రము. **అవిర్వే నామ దేవతార్తేనాస్తే పరివృతః** – అధర్వణ వేదము 10.8.31.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఆత్మని కర్తృత్వాది కల్పవిజ్ఞానమ్ కల్పితమ్ ఇతి జీవో విజ్ఞాతా. తద్విలక్షణో అవిజ్ఞాతా** – అంతా తానే చేస్తున్నానన్న మిధ్యాభావము కలిగిన జీవుడు విజ్ఞాత. అటువంటి మిధ్యాజ్ఞానము లేనివాడు అవిజ్ఞాత.

484. సహస్రాంశుః

- వేయి కిరణములు గలవాడు (అనంత జ్ఞానమూర్తి).
- అనంత కిరణుడైన సూర్యనారాయణ మూర్తి.
- తన జ్ఞానమును, తేజస్సును ఎల్లెడల వెదజల్లువాడు.

ఓం సహస్రాంశవే నమః

అంశవో బుద్ధయః ప్రోక్తా సహస్రం సంతి యస్య తే
సహస్రాంశురితి ఖ్యాతో హ్యష్టార్ణో దీపదోమనుః
అంశ అంటే బుద్ధి. అటువంటి అంశలు ఇతనికి అపారంగా ఉన్నాయి. కనుక ఆయన సహస్రాంశువు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. జ్ఞానప్రదము. ఓం సహస్రాంశవే నమః

సహస్ర-అంశు – అనగా వేయి కిరణములు. శ్రీ భట్టులు 'సహస్ర' అనగా 'అపరిమితములైన' అనియు, 'అంశువు' అనగా 'జ్ఞానము' అనియు భావములను గ్రహించారు. అనంత జ్ఞాన స్వరూపుడైన శ్రీమన్నారాయణుడు సహస్రాంశువు. **మిక్క జ్ఞాన మూర్తియాయ వేద విళక్కినాయ్** – అని నమ్మాళ్వార్ చెప్పారు (4.7.10). భగవానుడు శుద్ధ సత్వ జ్ఞానముతో ప్రకాశించువాడు. వేదములను ప్రసాదించినవాడు. వేదములద్వారా మనకు తెలియవచ్చువాడు.

అనంత కిరణమూర్తియైనందున శ్రీనివాసుడు సహస్రాంశువని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. **యేన సూర్యస్తపతి తేజసేద్ధః** – అతని తేజస్సువలన సూర్యుడు ప్రకాశించును – అని తైత్తరీయ బ్రాహ్మణము (3.12.9)లో చెప్పబడినది. శ్రీ శంకరులు గీత (15.12)నుండి కూడ ఉదాహరించారు –

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేऽఖిలమ్
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్
సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నాతేజస్సేయని యెఱుంగుము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **అంత జ్ఞాన అనంత ప్రభశ్చ విష్ణుః అత సహస్రాంశః** – అనంత జ్ఞానముతో, అనంత తేజముతో ప్రకాశించు శ్రీమహావిష్ణువు సహస్రాంశువు.

485. విధాతా

- అన్నింటిని, అందరిని నియంత్రించు అధిపతి. విధించువాడు.
- విశ్వమును ధరించు (భరించు)వాడు.
- బ్రహ్మను కన్న తండ్రి.

ఓం విధాత్రే నమః

ఈ నామము ఇంతకు ముందు 44వ నామముగా కూడ చెప్పబడినది.

5వ శ్లోకము. 44వ నామము. విధాతా – **అనాది నిధనో ధాతా విధాతా ధాతురుత్తమః**

51వ శ్లోకము. 485వ నామము. విధాతా – **అవిజ్ఞాతా సహస్రాంశుః విధాతా కృతలక్షణః**

44వ నామము. **విధాతా** –

శ్రీ భట్టులు – బ్రహ్మను సృష్టించినవాడు.

శ్రీ శంకరులు – విధి విధానములసేర్పరచి, తగు ఫలముల నొసగువాడు.

485వ నామము. **విధాతా** –

శ్రీ భట్టులు – యముడు మొదలైన దేవతలను కూడా తన అధీనములో కలిగినవాడు. వారికి విధులనేర్పరచువాడు.
శ్రీ శంకరులు – విశ్వభారము వహించు దిగ్గజములకు, ఆదిశేషునకు ఆధారమైనవాడు .

ఇంతకు ముందు నామమైన 'అవిజ్ఞాతా' వ్యాఖ్యాన భావమునుండి 'విధాతా' నామ వ్యాఖ్యను శ్రీ భట్టులు కొనసాగించారు. 'విధా' అనగా భాగము చేయుట, పేరు పరచుట. 'అవిజ్ఞాతా' అనగా భక్తుల దోషములను తెలియని (పట్టించుకొనని)వాడు. అలాగైతే, యమునివంటివారు తమ కర్తవ్యానుసారము విష్ణుభక్తుని అతని పాపముల కారణముగా దండింపవలసివచ్చినచో ఏమగును? భగవానుడు 'విధాత' గనుక, అందరు దేవతలూ శ్రీహరి ఆజ్ఞానువర్తులు గనుక, యముడు గాని, మరొక దేవత గాని విష్ణుభక్తులను శిక్షింపజాలరు. మరియు తమ భటులకు కూడ విష్ణుభక్తులజోలికి పోవలదని చెబుతారు.

తిరుమళిసాయి ఆళ్వార్. తిరువంతాడి(68). యముడు తన బంటులతో రహస్యంగా ఇలా చెప్పాడు – శ్రీమన్నారాయణునే తదేక ధ్యానముతో పూజించే భక్తుల జోలికి పోకుండా మీరు వారిని గౌరవ భక్తులతో ఆదరించండి.

పరిహర మధుసూదన ప్రపన్నాన్ ప్రభురహం అన్యనృణాం న వైష్ణవానామ్ – శ్రీ విష్ణుపురాణము (3.7.14). వైష్ణవులకు తక్క మిగిలిన నరులకు తాను ప్రభువునని యముడు చెప్పెను.

ఈ విధాతా నామమునే మరొక విధంగా అర్ధము చేసికొనవచ్చును.
'ధా' – **ధారయ పోషణాయో ర్దానే చ** – ధరించుట, పోషించుట, ప్రసాదించుట.
'వి' – అనేక విధములుగా.
బహు విధములుగా ధరించి, భరించి, పోషించువాడు 'విధాత' అని శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య. బిడ్డను తల్లి తన గర్భములో పోషించును. తల్లినికూడ కాపాడువాడు జనార్దనుడే. **స న బంధుర్జనితా స విధాతా ధామాని వేద భువనాని విశ్వా** – యజుర్వేదము 32.10

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరొక భావమును కూడా చెప్పారు. **వేదే మనుష్యస్య కృతే కర్తవ్యానామ్ విధాన కర్తృత్వేన విధాతా. విధానస్య కర్తా విధాతా. కర్తవ్య కర్మణామ్ విధాతృత్వేన విస్ ధాతా, వ్యధదాత్ ఇతి** – వేద విధులు నిర్వహించుటకు కర్తవ్యములనేర్పరచినవాడు విధాత.

శ్రీ శంకరుల భాష్యము – ఆదిశేషుడు, దిగ్గజములు, కులసానువులు – ఇవి జగమును ధరించును. వారిని కూడా ధారణ చేయువాడు విధాత.

486. కృతలక్షణః

లక్షణములను (గుణములను) ఏర్పరచినవాడు – అన్న సామాన్య భావమునకు భాష్యకారులు తమ రీతులలో వివరణలు ఇచ్చారు.

శ్రీ భట్టులు:

- సాధువులకు, భాగవతులకు ఉండవలసిన లక్షణములను తెలియబరచినవాడు.

శ్రీ శంకరులు:

- విశిష్టమైన శ్రీవత్స చిహ్నము కలవాడు. దివ్యలక్షణమూర్తి.
- వేదములను (లక్షణ గ్రంధములను) ఇచ్చినవాడు.
- వివిధ భేద లక్షణములతో నానా జీవజాలమును సృష్టించినవాడు.

ఓం కృతలక్షణాయ నమః

'లక్షణము' అనగా గుర్తు, ధర్మము, గుణము. 'కృతలక్షణుడు' అనగా లక్షణములను ఏర్పరచినవాడు. ఈ నామమును వివిధ భాష్యకారులు తమ తమ విశిష్టానుభవములతో స్మరించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

అవిజ్ఞాతా సంహస్రాంశుః విధాతా కృతలక్షణః

అవిజ్ఞాతా – తన భక్తుల తప్పిదముల నెఱుగనివాడు.

సహస్రాంశుః – అపరిమితమైన జ్ఞానము కలవాడు.

విధాతా – అందరు దేవతలకు కూడా శ్రీమహావిష్ణువే ప్రభువైనందున యమాది దేవతలు విష్ణుభక్తులను శిక్షింపజాలరు.

కృతలక్షణః – భగవంతుడు ఎవరి దోషములనెఱుగడు? ఎవరు విష్ణుభక్తులు? అన్న ప్రశ్నలకు – అటువంటి సాధు సజ్జనుల లక్షణములేవో శ్రీహరియే చెప్పినాడు.

మిత్రభావేన సంప్రాప్తం (యుద్ధకాండ 18.3) – నావద్దకు మిత్రునిగా వచ్చినవాడు.

సంయగ్ వ్యవసితో హి సః (గీత 9.30) – ఎంతటి పాపి అయినప్పటికి ఏకాగ్రచిత్తంతో నన్ను సేవించేవాడిని (**మా మనన్య భాక్**) సాధువుగానే భావించాలి.

చక్రాంకితః ప్రవేష్టవ్యాః (హరివంశము 2.24) – తమ శరీరముపై శ్రీచక్రముద్రలు ధరించినవారు.

సౌశీల్యవతి తన మాంగల్య చిహ్నములను కాపాడుకొనునట్లే విష్ణుభక్తుడు ఈ ముద్రలను ధరించవలెను (విష్ణుతత్వము).

శ్రీ భట్టులు చెప్పిన పై లక్షణములకు అదనముగా శ్రీ వి.వి. రామానుజన్ చెప్పిన లక్షణము – **మఱందుమ్ పుఱామ్ తొళామాందర్** (నాన్గామ్ తిరువంతాడి 68) – అన్యదేవతలను అర్చించనివాడు.

ధర్మచక్రము రచయిత గీతలో 12.13 నుండి 12.20 వరకు చెప్పిన భగవంతుని ప్రియమైన భక్తుల లక్షణములను చెప్పారు – **"అద్వేష్టా సర్వభూతానామ్ .....''** నుండి **"...... ....భక్తాస్తేఽతీవ మా ప్రియా''** వరకు.

- సర్వప్రాణులపట్ల ద్వేషము లేనివాడు. స్నేహము, దయ గలవాడు.
- అహంకార మమకారములను విడచినవాడు.
- సుఖ దుఃఖములను సమముగా చూచెడివాడు.
- నిత్య సంతృప్తి, ఆత్మ నిగ్రహము, దృఢనిశ్చయము గల యోగి.
- మనసును, బుద్ధిని భగవంతున కర్పించినవాడు.
- తనవలన లోకము, లోకమువలన తాను భయపడరు.
- కోపం, భయం, ఆవేశాలకు వశం కానివాడు.
- అపేక్షలు లేనివాడు. శుచి, కార్యదక్షుడు.
- పక్షపాతము, వ్యధ లేనివాడు.
- ఆడంబర కర్మలను పరిత్యజించినవాడు.
- సంతోషం, ద్వేషం లేకుండా దుఃఖం, కోరికలు, శుభాశుభాలు పరిత్యాగము చేసినవాడు.
- శత్రువులు, మిత్రుల పట్ల, మానావమానాల పట్ల, దూషణ భూషణల పట్ల సమభావం కలిగినవాడు.
- దేనిమీదా అసక్తి లేనివాడు. కొద్దిపాటి దొరికినా సంతృప్తుడు.
- మౌనంగా ఉండేవాడు. దృఢ నిశ్చయం గలవాడు.
- స్థిరనివాసం లేనివాడు.

శ్రద్ధతో నన్నే పరమగతిగా నమ్మి అమృతంలాంటి ఈ ధర్మాన్ని నేను చెప్పినట్లు పాటించే నా భక్తులు నాకు చాలా యిష్టులు (భక్తియోగము).

చక్రాది ధారణం పుంసాం పరసంబంధ వేదనం
పతివ్రతా నిమిత్తం హి వలయాది విభూషణమ్ – విష్ణుతంత్రము.
వలయాదులు సుమంగళీ చిహ్నాలు. అలాగే చక్రాదులు భగవత్సంబంధ సూచకాలు.

కృతం హి లాంఛనం యేన ఉపాదేయేషు జంతుషు
పరమాత్మా హృషీకేశః స తు స్యాత్ కృతలక్షణః
ఇంద్రియాలకు ప్రేరకుడైన పరమాత్మ తాను సృష్టించిన ప్రాణులకు స్వయంగానే గుర్తులను తెలిపినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'లక్షణములు' అనగా వేదాంతశాస్త్రములని అర్థము గలదు. **వేదాః శాస్త్రాణి విజ్ఞానమేతత్ సర్వం జనార్దనాత్** – సల వేదశాస్త్రములు జనార్దనునినుండియే కలిగినవి గనుక ఆయన కృతలక్షణుడు.

వక్షస్థలమున శ్రీవత్స చిహ్నము గలవాడు కృతలక్షణుడు.

శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితం

శంఖచక్రధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్

తాను సృజించిన నానా జీవజాలమునకు వివిధములైన బాహ్య, అంతర లక్షణములనేర్పరచినవాడు కృతలక్షణుడు.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడు. ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము సంపూర్ణముగా గలవాడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – సత్-చిత్-ఆనంద స్వరూపుడు. శేషశాయి. గరుడవాహనుడు. మేఘశ్యాముడు. పీతాంబరుడు. శంఖచక్రాద్యాయుధ ధారి. ఇటువంటి విశిష్టమైన లక్షణములు గలవాడు కృతలక్షణుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః |
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః || (52)

487. గభస్తినేమిః

- దీప్తిమంతమైన చక్రాయుధమును ధరించినవాడు.
- తన కాంతితో అంతటను వెలుగు నింపువాడు.
- కిరణ్మయ చక్ర మధ్యమున భాసిల్లు సూర్యనారాయణ మూర్తి.

ఓం గభస్తినేమయే నమః

జ్యోతిర్విశిష్ట నేమ్యాయత్ లక్షితమ్ చక్రముత్తమమ్
గభస్తినేమిర్యస్యాస్తి నవార్ణః పాపనాశనః
మహాప్రకాశవంతమైన అంచులతో కూడిన, ఉత్తమమైన చక్రాయుధమును ధరించినవాడు. ఈ నవార్ణ మంత్రము పాపనాశనము. ఓం గభస్తినేమయే నమః.

శ్రీ భట్టుల వ్యాఖ్య – గభస్తిః **దీప్యతే జ్యోతిర్మయమ్, నేమి లక్షితమ్ చక్రమ్ యస్య ఇతి గభస్తినేమిః** – శ్రీహరి చక్రము భాస్వర సహస్రము. జ్యోతిర్మయము. సుదర్శన చక్ర ముద్రలు ధరించినవారిని యముడు, యమదూతలు బాధింపరు **'విధాతా'**, **'కృతలక్షణః'** నామములకు శ్రీ భట్టులు చెప్పిన నామ వివరణలను అనుసరించుతూ, '**గభస్తినేమి**'యే తన శరణాగతులను సర్వదా రక్షించును.

ధర్మచక్రము రచయిత – శ్రీమన్నారాయణుని దివ్య చక్రాయుధమే అందరిని ధర్మమార్గమున నడిపించు ధర్మచక్రము. అనంతమైన కాలస్వరూపుని చక్రము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య – భాసే-దీప్త్యో- ప్రకాశించునది; నీ-ప్రాపణే-దారి చూపునది; నేమి-చక్రము అంచు. గభస్తి నేమి – తన ప్రకాశముతో అందరికి వెలుగునిచ్చి, దారి చూపువాడు. బృహద్భానువైన శ్రీమన్నారాయణుడే సూర్యునకు కూడా వెలుగునిచ్చువాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **గభస్తి-చక్రస్య మధ్యే సూర్యాత్మనా స్థిత ఇతి గభస్తినేమిః** – గభస్తి చక్రము, అనగా కిరణచక్రము మధ్య విలసిల్లు సూర్యనారాయణమూర్తి. ఇందు శ్రీ రాదాకృష్ణశాస్త్రి చెప్పిన శ్రుతి ప్రమాణము (తైత్తరీయారణ్యకము 10.14)

ఆదిత్యో వా ఏష ఏతన్మండలమ్
య ఏష ఏతస్మిన్ మండలేర్చి దీప్యతే
య ఏష ఏతన్మండలేర్చిషి పురుషః

ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణః

488. సత్త్వస్థః

- భక్తుల హృదయములందు వసించువాడు.
- సత్త్వగుణమూర్తియై ప్రకాశించువాడు.
- సకల చరాచరములందు స్థితుడైనవాడు.

ఓం సత్త్వస్థాయ నమః

'సత్త్వ' అనగా మనసు (హృదయము), సాత్త్విక గుణము, వస్తువు (ఉనికి గది) అనే మూడు అర్థాలున్నాయి. ఈ మూడు భావములలో పై మూడు వ్యాఖ్యలను చెప్పారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీనివాసుడు భక్తుల హృదయములలో వసించును. అట్టి కాంతిమయ శంఖచక్రగదాధారి ఉన్న చోట అజ్ఞానాంధకారములకు తావు లేదు. నారాయణుని పాదపద్మములను మనసున నిలుపుకొనిన వారికి యముని భయము ఉండజాలదు.

స్ఫటిక మణి శిలామలః క్వ విష్ణుః
మనసి నృణాం క్వ మత్సరాది దోషః – విష్ణుపురాణము 3.7.22
స్ఫటికమణివలె నిర్మలంగా ఉండే విష్ణువు ఉండేచోట మత్సరాది దోషములు ఎలా ఉంటాయి?

కింకరా దండపాశౌ వా న యమో న చ యాతనః
సమర్థః తస్య యస్యాత్మా కేశవాలంబనః సదా – విష్ణుపురాణము 2.2.28
కేశవుని ఆలంబనముగా చేసికొన్న ఆత్మకు యమదండము, యమకింకరుల యాతన ఉండవు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్త్వమ్ గుణమ్ ప్రకాశకమ్ ప్రాధాన్యేన అధితిష్ఠతి ఇతి** – సత్త్వగుణప్రధానుడై ప్రకాశించువాడు సత్త్వస్థుడు.

సత్త్వగుణ ప్రధానమైన జీవనము – బ్రహ్మముహూర్తములో మేల్కొనుట, జప ధ్యానముల సాధన, సకల జనహితమునకై శ్రమించుట, ఒరులకు హాని చేయకుండుట వంటివి – గడుపవలెనని ఈ నామము మనకు బోధించుచున్నదని ధర్మచక్రము రచయిత వివరించారు.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – సత్త్వములందు, అనగా సకల భూతములందు స్థితుడైనందున విశ్వాత్మకుడే సత్త్వస్థుడు.

489. సింహః

- (తన భక్తులను కష్టపెట్టువారిని) శిక్షించువాడు.
- శ్రీనృసింహమూర్తి.
- అనంత శక్తిసంపన్నుడు.

ఓం సింహాయ నమః

ఇంతకుముందు ఈ నామము 202వ నామముగా స్తుతింపబడెను.

22వ శ్లోకము. 202వ నామము. సింహః – **అమృత్యుః సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః**

52వ శ్లోకము. 489వ నామము. సింహః – **గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః**

శ్రీ భట్టులు చెప్పిన అర్థములు –

202వ నామము. సింహః – శ్రీనారసింహమూర్తి.

489వ నామము. సింహః – తన భక్తులను పీడించువారిని శిక్షించువాడు.

శ్రీ శంకరులు చెప్పిన అర్థములు –

202వ నామము. సింహః – స్మరణ మాత్రమున పాపములను నాశనము చేయువాడు.

489వ నామము. సింహః – అసమాన శక్తియుతుడు. శ్రీనారసింహమూర్తి.

శ్రీ హరి తన భక్తరక్షణాతత్పరుడనే భావపరంపరను శ్రీ భట్టులు ఈ నామవివరణలో కూడా కొనసాగించారు.

హరిభక్తాయ విజ్ఞాయ దండే ప్రయతమానసాన్
హినస్తి చ యమాదీప్యః స సింహ పరికీర్తితః

విష్ణుభక్తులు అని తెలియక వారిని దండించే యమాది దేవతలనుకూడా హింసించే (శిక్షించే)వాడు.

నరకే పచ్యమానస్తు యమేన పరిభాషితః

కిం త్వయానార్చితః దేవః కేశవః క్లేశనాశయః – విష్ణుధర్మము

నరకంలో బాధపడుతున్నవారిని చూచి యమధర్మరాజు – నువ్వు ఇంతకుముందు కేశవుని ఎందుకు పూజించలేదు? – అని అడుగుతాడు.

శ్రీ శంకరులు ఈ నామమునకు – సింహమువలె శక్తిగలవాడు – అని వ్యాఖ్యానము చెప్పిరి. శ్రీ నృసింహమూర్తి నామమునకు సంక్షిప్తరూపముగా 'సింహ' నామమును స్మరించవచ్చునని కూడ శ్రీ శంకరులు అదనపు భావమును తెలియజేశారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – లేళ్ళవలె చిందులువేయు అసురులను, అసుర ప్రభావమును పారద్రోలు శ్రీహరి సింహము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సిచ్-క్షరణే-వెదజల్లుట, అంకురింపజేయుట. అందరికిని కర్మఫలములను పంచువాడు సింహము. సింహ-శక్తివంతమైనది. సమయము వచ్చినపుడు అందరి ప్రాణములను హరించువాడు సింహము. కల్పాంతమున సమస్తమును తనలో లీనము చేసికొనువాడు.

490. భూతమహేశ్వరః

- సకల భూతములకును అధిపతి.
- సకల భూతములను శాసించు పాలకులకు అధిపతి.
- నిజమైన మహేశ్వరుడు.

ఓం భూత మహేశ్వరాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భూతములకు ప్రభువులైన బ్రహ్మ, యమాదులకు కూడా ప్రభువైనందున శ్రీమహావిష్ణువు భూతమహేశ్వరుడు.

భూతేశ్వరాణాం స బ్రహ్మ యమాదీనాం నియన్త్రణాత్

కారణం జగతాం యశ్చ పశ్యాద్భూత మహేశ్వరః

ఇందుకు శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధములనుండి పెక్కు ప్రమాణములను చెప్పారు – తిరువైమొళి 5.2.8, 8.9.8, 8.1.1

శ్రీ శంకరుల వ్యాఖ్య – సకల భూతములకు పరమప్రభువు. 'భూత' అనగా 'నిజమైన'. నిజమైన మహేశ్వరుడు భూతమహేశ్వరుడు.

అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్

పరంభావమజానంతో మమ భూత మహేశ్వరమ్ – గీత 9.11

సమస్తప్రాణికోటికి ప్రభువైన నా పరమాత్మ తత్త్వము తెలియని మూఢులు మానవరూపంలో ఉన్న నన్ను మామూలు మనిషిగా భావించి అవమానిస్తున్నారు.

'భూతమహేశ్వరః' నామమునకు శ్రీ సత్యదేవో వాసిష్ఠ శృతులనుండి పెక్కు ప్రమాణములు చూపారు –

భవాసవౌ మృడతమ్ మాభి యాతమ్ భూతపతీ పశుపతీ నమోవామ్ – అధర్వణ వేదము 21.2.1

య ఈశే అస్య ద్విపదశ్చతుష్పదః కస్మై దేవాయ హవిషా విదేమ – యజుర్వేదము 23.3

యో భూతానామ్ అధిపతిర్యస్మిన్ లోకే అధిస్పృష్టాః

య ఈశే మహతో మహాన్స్ తేన గృష్ణామి త్వామహమ్ – యజుర్వేదము 20.32

హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేకాऽసీత్ – ఋగ్వేదము 1.121.1

491. ఆదిదేవః

- అందరికిని, దేవతలకు కూడ కారణమైన ప్రకాశమూర్తి.
- సృష్టికి ఆదియైన దేవుడు.
- ప్రళయకాలమున ముల్లోకములను కబళించి, సృష్టి సమయమున వెలికి తీయువాడు.

ఓం ఆదిదేవాయ నమః

ఇదే మహత్తర నామము ఇంతకుముందు 336వ నామముగా కీర్తింపబడినది.

36వ శ్లోకము. 336వ నామము. ఆదిదేవః – **వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః**

52వ శ్లోకము. 491వ నామము. ఆదిదేవః – **ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః**

శ్రీ శంకరుల వ్యాఖ్య

(336) ఆదిదేవః – అన్నింటికిని మూలకారణమైనవాడు.

(491) ఆదిదేవః – సర్వభూతములకును కారణమైన దేవుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య

(336) ఆదిదేవః – సంపూర్ణ లీలానాటక వినోది.

(491) ఆదిదేవః – అందరు దేవతలకు కారణంగా వెలిగే దేవుడు.

491వ నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య –

ఆదిః ద్యోతమానశ్చ ఆదిదేవః – ఆది-కారణము; దేవ-వెలిగేవాడు; శ్రీహరియే సకల దేవతలకు మూలము. శ్రీహరి ప్రకాశమే అందరికీ అందే వెలుగు. ఉదాహరణకు – **భీషాऽస్మాత్ వాతః పవతే** (ఆయన భయమువలన గాలి వీచును) అని తైత్తరీయోపనిషత్తు ఆనందవల్లి 8.1లో చెప్పబడినది.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

సర్వ భూతాని అధీయన్తే అనేన ఇతి ఆదిః

ఆదిశ్చ అసౌ దేవశ్చ ఇతి ఆదిదేవః

సకల భూతములకును మూలమైనందున ఆది. మరియు దివ్యత్వమున దేవుడు. కనుక ఆదిదేవుడు.

శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడ 'ఆది', 'దేవ' అనే రెండు పదములు శ్రీదేవుని రెండు గుణములను సూచించుచున్నట్లుగా వ్యాఖ్యానించారు. కాని శ్రీ చిన్మయానంద 'దేవ' పదమునకు విశేషణముగా 'ఆది' పదమును పరిగణించారు. ప్రప్రథముడైన దేవుడు గనుక శ్రీమహావిష్ణువు ఆదిదేవుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ –

ఆది – **అదత్తే, గ్రసతి జగత్ ప్రళయకాలే స ఆదిః** – ప్రళయకాలమున జగత్తును కబళించువాడు.

దేవ – **దత్తే, విసృజతి చ బహిః సర్గ కాలే స దేవః** – సృష్టి సమయమున జగత్తును మరల వెలువరచును. కనుక శ్రీమన్నారాయణుడు ఆదిదేవుడు.

ధర్మచక్రము రచయిత – భగవంతుడు ప్రకృతి ధర్మములకు లోబడి ప్రవర్తింపనవసరము లేదు. ప్రకృతిలో అంతటికిని మరొక కారణము లేదా మూలము ఉంటుంది. కాని శ్రీమహావిష్ణువునకు వేరు కారణము, మూలము ఉండజాలవు. అలాగే అచ్యుతునకు ఆదిమధ్యాంతములు లేవు. ఆయన తత్వము దేవతలకు కూడా అవగతము కాదు. ఆదిదేవుని ధ్యానించిన కొలది మనము భగవంతునకు దగ్గర కావచ్చును.

492. మహాదేవః

గొప్పగా క్రీడించువాడు.

ఓం మహాదేవాయ నమః

బ్రహ్మాదిభిః క్రీడతి యో మహాదేవ స్స ఉచ్యతే – బ్రహ్మాదులతోకూడ క్రీడించేవాడు మహాదేవుడు.

'దివ్' అనే ధాతువునకు 'క్రీడాయాం' అన్న అర్థములో వినియోగమున్నది. శ్రీమన్నారాయణునకు బ్రహ్మాది దేవతలు కూడా క్రీడామాత్రులే అని 'మహాదేవః' నామమును శ్రీ భట్టులు వివరించారు.

శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించిన నమ్మాళ్వార్ రచన. తిరువైమొళి 3.10.7 – **ఇంబుఱుమ్ ఇవ్విళై యాట్టుడైయాన్**. ఈ పాశురమునకు శ్రీ వేదాంత దేశికుల వ్యాఖ్య – ఇక్కడ 'ఇంబుమ్' లేదా 'లీల' ఏమనగా భగవంతుడు తనను చేరుకొనుటకు ఆలంబనగా మనకు అనేక సదుపాయ మార్గోపకరణములను ప్రసాదించును. మనకు అందుబాటులోనుండే అర్చారూపములు, యుక్తాయుక్తములను గ్రహించగల విచక్షణ, నిత్య కర్మ ధ్యాన యోగములను నిర్వర్తించగల శక్తి చైతన్యములు – ఇవన్నీ శ్రీమహాదేవుడు మనకు ప్రసాదించిన దివ్యానుగ్రహములు. అయినా వీటన్నింటినీ ఉపేక్షించి జనులు పెడదారిబట్టుట ఆ దేవునకు వినోదకారకము. ఇక్కడ కూడ శ్రీమహాదేవుని లీల, క్రీడ గోచరమగుచున్నవి. అంతేగాక తాను సృజించిన బ్రహ్మాదులతో సృష్ట్యాది కార్యక్రమములను క్రీడామాత్రముగ నిర్వహింపజేయు లీలానాటకసూత్రధారి గనుకనే శ్రీహరి మహాదేవుడు. ఆదిదేవుడు. దేవేశుడు (శ్రీ పి. బి. అణ్ణాంగార్ రచననుండి).

శ్రీ చిన్మయానంద వివరణ – తక్కిన సకలదేవతలును శ్రీమహావిష్ణువునుండి ఉద్భవించిరి కనుక శ్రీహరియే మహాదేవుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'మహ' అన్న పదమును పూజార్హత విషయములో భావింపదగును. అన్ని ఇంద్రియములకంటెను ఆత్మ ప్రధానము. సూర్యుడు ఉదయించినపుడు తక్కిన చుక్కలు వెలవెలపోవును. అలాగే అన్యదేవతల ఆరాధనను మాని శ్రీమహాదేవుని పూజింపనగును.

బలభద్రుడు, సుభద్ర, జగన్నాధుడు. వికీపీడియాలోని చిత్రం.

493. దేవేశః

దేవతలకు కూడ పాలకుడు.

ఓం దేవేశాయ నమః

దేవానం ఈశః దేవేశః

బ్రహ్మాదీనాంచ దేవేశో యథార్థ వినియోజకః

శ్రీ చిన్మయానంద వివరణ – తక్కిన దేవతలందరికిని శ్రీమన్నారాయణుడే పరమాత్ముడు. అంతరాత్ముడు.

శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించిన నమ్మాళ్వార్ తిరువైమొళి 1.5.4 – **వానోర్ పెరుమాన్ మామాయన్ వైకుంఠన్ ఎంపెరుమాన్.**

శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి వివరణ – బ్రహ్మాదులకు వారి వారి విధులను అనుగ్రహించును గనుక శ్రీమన్నారాయణుడు దేవేశుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఉదాహరించిన శ్రుతి వాక్యములు –

యో దేవేషు అధిదేవ ఏకాऽసీత్ కస్మై దేవాయ హవిషా విధేమ – ఋగ్వేదము 10.121.8
యో జాత ఏవ ప్రథమో మనస్వాన్ దేవో దేవాన్ ఋతునా పర్యభూషాత్ – అధర్వణ వేదము 20.34.1
స దేవానాం అధిపతిర్బభూవ నో అస్మాసు ద్రవిణా మాదధాతు – అధర్వణ వేదము 7.5.2
తమ్ ఈశానామ్ జగత్ స్తస్థుషస్పతిమ్ ధియమ్ జిన్వమశే హూమహే వయమ్ – యజుర్వేదము 25.8

494.దేవభృత్

దేవతలను భరించువాడు (పోషించువాడు).

ఓం దేవభృతే నమః

దేవభృత్-గురుః - దేవభృద్గురుః

- దేవతలకు అధిపతియైన ఇంద్రునకు గురువు.
- దేవతలకు ఆధారమైనవాడు, విజ్ఞానమునకు మూలమైనవాడు.

ఓం దేవభృద్గురవే నమః

శ్రీ భట్టులు '**దేవభృత్**', '**గురుః**' అను రెండు నామములుగా పరిగణించి వ్యాఖ్యానించారు.
దేవభృత్ – ఆదిదేవుడు, మహాదేవుడు అయిన శ్రీమన్నారాయణుడు దేవతలకు వారి వారి విధులనేర్పరచి పాలించుటయేగాక వారి రక్షణభారమును కూడ తానే వహించును.
శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించిన నమ్మాళ్వార్ స్తుతి 8.1.5 – **మనిశరక్కు దేవర్ పోల దేవరక్కుమ్ దేవన్.**

శ్రీ శంకరులు, ఆయనను అనుసరించిన ఇతర వ్యాఖ్యాతలు '**దేవభృద్గురుః**' అనే ఒకే నామమును పరిగణించారు.

దేవభృద్గురుః – దేవతలకు అధిపతియైన ఇంద్రుడు దేవభృత్. ఇంద్రునకు జ్ఞానమును (వేదోపదేశమును) ఇచ్చిన గురువు దేవభృద్గురువు.

వారిదే మరొకవిధమైన వ్యాఖ్యలో 'దేవభృత్', 'గురుః' అనే రెండు నామముల దివ్యలక్షణములను అనుసంధించి 'దేవభృద్గురుః' నామమును వివరించారు. దేవతలకు పోషకుడు, గురువు దేవభృద్గురువు.

495. గురుః

గురువు. వేదముల రూపమున జ్ఞానమంతటికిని మూలము.

ఓం గురవే నమః

దేవతలకు వేదములిచ్చిన గురువు అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

హరి గురు వసాగోऽస్మి. నేను నా గురువైన హరికి విధేయుడను – అని విష్ణుపురాణము (3.7.15)లో బ్రహ్మ చెప్పెను. శ్రీవైష్ణవ పరంపరలో ప్రధమాచార్యుడు శ్రీనాధుడేనని ఈ సందర్భములో శ్రీరామానుజన్ గుర్తు చేశారు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః |
శరీరభూతభృద్భోక్తా కపీంద్రో భూరిదక్షిణః || (53)

496. ఉత్తరః

- రక్షకుడు. బ్రహ్మాదులను అసురులనుండి రక్షించువాడు.
- రక్షకుడు. సంసార సాగరమును తరింపజేయువాడు.
- జన్మ పునర్జన్మ అవధులకు అతీతుడు.

ఓం ఉత్తరాయ నమః

ఉత్తరాత్ ఉత్తరః – తరింపజేయువాడు, కాపాడువాడు ఉత్తరుడు – అన్న అర్థంలోనే ఇరువురు వ్యాఖ్యానకర్తలు ఈ పుణ్య నామమును వివరించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఆపదుత్తారణాద్యోఽసౌ బ్రహ్మాదే రుత్తర స్మృతః** – బ్రహ్మాదులను ఆపదలనుండి రక్షించువాడు ఉత్తరుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **జన్మ సంసార బంధనాత్ ఉత్తరతి ఇతి ఉత్తరః** – జన్మ సంసార బంధమునుండి తరింపజేయువాడు (కాపాడువాడు) ఉత్తరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఆప్-నీటిని, తర-దాటుట; మరొక విధముగా ఉత్-ఉత్కర్షోతిశయః-అసాధారణమైన, అద్భుతమైన, తర-దాటుట. ఉత్తరుడు – సంసార సాగరమును తరించుటకు ఉత్తమ (ఏకైక) మార్గము.

ధర్మచక్రము రచయిత వివరణ – సంసార సాగరమును తరించుటకు బుద్ధియనునది ఒక నౌక. అహంకార మమకారాది భావములు ఈ బుద్ధికి తూట్లు పొడిచి సంసారసాగరమున మునుగుటకు కారణమగును. అలా నావ (బుద్ధి) ఛిన్నాభిన్నము కాకుండా భవ తరణ కార్యము సాగాలంటే ఉత్తరుని ధ్యానమే శరణ్యము.

నడిపించు నా నావా నడి సంద్రమున దేవా.

497. గోపతిః

- అన్ని పదములకు (వాక్కులకు, వేదములకు) అధిపతి.
- తన వాక్కునకు తానే రక్షకుడు.
- తన భక్తుల పలుకును రక్షించువాడు.
- గోవులను కాచిన గోపాలకృష్ణుడు.
- కదులుచున్న సమస్తమును (ఇంద్రియములను) కాపాడువాడు.
- భూపతి, ధరణీధరుడు.
- (పుణ్య) లోకముల కధినాధుడు.

ఓం గోపతయే నమః

ఇదే నామము మరల 63వ శ్లోకములో వచ్చును. రెండు శ్లోకములలోను 'గోపతి', 'గోప్త' నామములు క్రమములో వచ్చుట గమనింపదగును.

53వ శ్లోకము. 497వ నామము. గోపతిః – **ఉత్తరో గోపతిః గోప్తా జ్ఞానగమ్యః పురాతనః**

63వ శ్లోకము. 599వ నామము. గోపతిః – **గోహితో గోపతిః గోప్తా వృషభాక్షో వృషప్రియః**

'గో' శబ్దమునకు ఆవులు, వాక్కులు, వేదములు, భూమి వంటి పెక్కు అర్థములున్నవి. అలాగే ఈ పుణ్యనామమునకు పలు వివరణలు ఉన్నవి. వివిధ భావములను శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఇలా సంక్షిప్తంగా, చక్కగా చెప్పారు.

గావో వాచో, గావః పశవో, గౌర్ భూమిశ్చ విశ్వ నిర్మాణే కారణమ్ ఇతి భావార్థః
ఏవాన్చ గోపతి చతుష్పదామ్ గవామ్ వాచామ్ భూమేశ్చ రక్షక ఇత్యర్థః

సకల వాక్కులకు గోవిందుడే అధిపతియన్న అర్థమును శ్రీ భట్టులు ఇలా వివరించారు – వేదములను, సకల భాషలను ప్రసాదించినవాడు గోపతి.

ధర్మచక్రము రచయిత వివరణ – భక్తులను కాచువాడు భగవంతుడు. శరణాగతులకు సకల విధములగు రక్షణనొసగుట భగవానుని గుణము. దేవదేవుని మాట వ్యర్థమగుట అసాధ్యము. పుండరీకాక్షుని మాట

అమోఘము. అలాగే ఆయన భక్తుల మాట కూడ వొల్లుపోదు. వాసుదేవునితో ఆయుధము పట్టింతునని ప్రతిజ్ఞ చేసిన భీష్మని మాట నిలుపుటకై 'ఆయుధము ధరింపను' అని అంతకుముందు చెప్పిన పార్థసారధి అర్జునుడు వేడుకొంటున్నా వినకుండా కురుక్షేత్రమున చక్రము ధరించి భీష్మునిపై లంఘించెను. చక్రి సర్వోపగతుడని ప్రహ్లాదుడు పలికిన పలుకులకు ఆపన్నత రాకుండుటకై శ్రీహరి శ్రీనారసింహమూర్తియై స్తంభమునుండి వెలువడెను.

'గమ్' అన్న ధాతువునకు 'గతౌ' అనగా 'చలించుచున్నది'. 'పా'- రక్షణే- కాపాడునది. ఇవే ధాతువుల ప్రకారము 'గో' అనగా ఇంద్రియములని కూడా చెప్పవచ్చును. ఎందుకంటే ఇంద్రియములు నిలకడ లేకుండా విషయానురక్తులై చలించుచుండును. 'గో' అనగా 'ఆత్మ' కావచ్చును. ఎందుకంటే ఆత్మ ఒక శరీరమునుండి మరొక శరీరమును ధరించుచునేయుండును. 'గో' అనగా శరీరము కావచ్చును. ఒక చోటనుండి మరొక చోటకు కదులుతూ ఉండేది. ఈ అన్నింటికీ అధిపతి గోపతి.

వినిపించేవి వేదములు. కనిపించేది భౌతిక ప్రపంచము. ఈ రెండింటికినీ గోపతియే నాధుడు.

498. గోప్తా

- సంరక్షకుడు. సకల విద్యలకును.
- సంరక్షకుడు. సకల భూతములకును, అఖిల లోకములకును.
- కర్మచక్రమును కాపాడి నడుపువాడు.
- భక్తులు కానివారికి తెలియరానివాడు.

ఓం గోప్త్రే నమః

ఈ పావన నామము ఇప్పుడు 'గోపతిః' తరువాత వచ్చినది. మరల 63వశ్లోకములో ఇదే క్రమములో స్తుతింపబడును.

53వ శ్లోకము. 498వ నామము. గోప్తా – **ఉత్తరో గోపతిః గోప్తా జ్ఞానగమ్యః పురాతనః**

63వ శ్లోకము. 600వ నామము. గోప్తా – **గోహితో గోపతిః గోప్తా వృషభాక్షో వృషప్రియః**

'గుప్' అనే ధాతువును రక్షణ, దాచుట అనే రెండు అర్థములలోను వాడుతారు. వ్యాఖ్యలు కూడ ఆ విధముగానే చెప్పబడినవి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – గోపతి సకల వేదములకు అధిపతి. వేదములకు, సకల విద్యలకును రక్షకుడు గోప్త (498వ నామము). భగవంతుడు కర్మచక్రమును సంరక్షించును. జీవుల కర్మానుసారము వారికి తగిన

ఫలములను, జనన మరణ కార్యములను నిర్దేశించును. ఇలా భగవంతుని రక్షణ గుణము ఎల్లెడల విస్తరించినది గనుక ఆయన గోప్త (600వ నామము).

శ్రీ శంకరుల వ్యాఖ్య – సకల జీవులకును, లోకములకును సంరక్షకుడు గనుక, వారిని కాపాడి, రక్షించి, పోషించువాడు గనుక గోప్త (498వ నామము). తన మాయ కారణముగా భక్తులు కానివారికి గుప్తముగానుండువాడు గోప్త (600వ నామము).

పాలనాత్ సర్వవిద్యానాం గోప్తేతి పరికీర్తితః – సకల విద్యలను పాలించువాడు గోప్త.
గోపయతీతి గోప్తా – సకల విద్యలకును రక్షకుడు. గుప్తముగానుండువాడు గోప్త.
రక్షతి సమస్త భూతానాం – సమస్త భూతములను రక్షించువాడు.
సంస్పృజ్య విశ్వ భువనాని గోప్తా (అధర్వ శీర్షము 5) – శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉదాహరించినది.
త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపాదాభ్యః (యజుర్వేదము 34.43) – శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఉదాహరించినది. భగవంతుని రక్షణాగుణము ఎల్లెడల విస్తరించినది.

దాచుట, రక్షించుట అనే రెండు భావములను అనుసంధించుచు శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇలా వివరించారు – భగవంతుడు తన భక్తులను వారి శత్రువులనుండి భద్రముగా దాచి సంరక్షించును, సకల విపత్తులనుండి భక్తులను దూరముగానుంచును. కనుక శ్రీమన్నారాయణుడు గోప్త.

ధర్మచక్రము రచయిత – అందరినీ కాపాడువాడు ఆ దేవుడే. ఇది తెలియక ప్రజలు తామెవరినో కాపాడుచున్నామని, లేదా తమనెవరో కాపాడుచున్నారని భ్రమిస్తారు.

499. జ్ఞానగమ్యః

జ్ఞానమువలన తెలియవచ్చువాడు.

ఓం జ్ఞానగమ్యాయ నమః

పరయా విద్యయా వేద్యో జ్ఞానగమ్య ఇతి స్మృతః – పరావిద్యచేత మాత్రమే తెలియవచ్చువాడు 'జ్ఞానగమ్యః'. ఇక్కడ పరావిద్య అనగా పరమాత్ముని గురించిన విద్య. సమాధినిష్ఠ వలనే సాధ్యము.

ముండకోపనిషత్తులో చెప్పిన వివరణ – రెండు విధాల విద్యలున్నాయి (1) పరావిద్య (2) అపరావిద్య. పరావిద్య – పరమేశ్వరునికి సంబంధించినది. జ్ఞానేంద్రియములకు లొంగనిది, కర్మేంద్రియాల విషయం కానిది, నిత్యమై అన్నింటియందు ఉన్నది, సూక్ష్మాతిసూక్ష్మమైనది, అవ్యయమైనది, పంచభూతాలకు కారణమైనది అగు పరబ్రహ్మతత్వమును జ్ఞానియైనవాడు సర్వత్ర చూడగలడు. కనుక పరమేశ్వరుడు జ్ఞానగమ్యుడు.

అపరావిద్య – ధర్మములు, కర్మలు, వాటి సాధన మొదలైన విషయాలకు సంబంధించినది. నామములు, ఇంద్రియములు వంటివానికి గోచరమయ్యే విషయాలకు సంబంధించినది.

ధర్మచక్రము రచయిత వివరణ – పరావిద్యకు జ్ఞానము, భక్తి, కర్మ, యోగములు సాధనములు. హరినామ సంకీర్తనము, పుణ్యకథాశ్రవణము, అచ్యుతునకు నిత్య కైంకర్యము వంటి సత్కృత సాధనలు భక్తుని భక్తిని పెంపొందించును. కష్ట సుఖములపట్ల సమభావవర్తనము, సర్వము వాసుదేవార్పణా తత్పరత్వము జీవాత్ముని పరమాత్మ సాన్నిధ్యమునకు కొనిపోవును. జ్ఞానమును అంకురింపజేయును. అదియును జ్ఞానగమ్యుని కరుణాప్రసాదమే.

కల్పవృక్షవాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న మలయప్ప స్వామి

నారాయణీయమునుండి –

కేయూరాంగద కంకణోత్తమ మహా - రత్నాంగుళీయాంకిత
శ్రీమద్బాహు చతుష్క సంగత గదా - శంఖారి పంకేరుహామ్
కాంచిత్కాంచన కాంచి లాంఛిత లసత్ - పీతాంబరాలంబినీ
మాలంబే విమలాంబుజ ద్యుతిపదాం - మూర్తిం తవార్తిచ్ఛిదమ్

---

500. పురాతనః

- కాలాతీతుడు. పూర్వమునుండే ఉన్నవాడు.
- ప్రతి కల్పమునందును విద్యను ప్రకాశింపజేయువాడు.

ఓం పురాతనాయ నమః

విద్యా ప్రద్యోతనాద్యోऽసౌ ప్రతికల్పం పురాతనః – ప్రతికల్పమునందును విద్యను ప్రకాశింపజేయువాడు. శ్రీ భట్టులు ఇంతకుముందు నామములో చెప్పబడిన 'జ్ఞాన' స్వరూపమునే ఈ నామవివరణలో కూడ తీసికొన్నారు. ప్రతికల్పమునందును జ్ఞానమును రక్షించి జనులకు ప్రసాదించు దేవుడు జ్ఞానగమ్యుడు, పురాతనుడు.

శ్రీ శంకరుల భాష్యము – సృష్టిలో వేరేమియును లేనప్పుడుకూడ ఉండియుండినవాడు. అనాదియైనవాడు. అజుడు. 'కాలము' అనునది లేనప్పుడు కూడ ఉండియున్న విరాట్ పురుషుడు. కనుక కాలముచే కొలువబడ జాలనివాడు. పురాతనుడు.

501. శరీరభూతభృత్

- శరీరమునేర్పరచు తత్వాలకు ఆధారమైనవాడు.
- తన శరీరములోని భాగములైన సకల భూతములకు ఆధారము.
- శరీరములోని వివిధ భాగములకు, ఇంద్రియములకు అధిపతులైన దేవతలను కాపాడువాడు.

ఓం శరీరభూతభృతే నమః

భృత్ – భరించువాడు, పోషించువాడు.

భూత – పదమునకు మూడు విధాలైన అర్ధములను చెప్పవచ్చును (1) పంచభూతములు (2) 24 తత్వములు (25, 36, 51 గా కూడా లెక్కిస్తారు). (3) విశ్వములో ఉండేవన్నీ. ఈ అర్ధాలనుబట్టి ఈ నామమునకు మూడు విధాలైన అర్థాలను చెప్పారు.

దేహ భూతం జగత్తత్వం ప్రకృత్యాది ధరాస్తకమ్

శరీరభూతభృత్ ప్రోక్తో బిభర్తీతి తతోऽక్షరః

శ్రీ భట్టులు చెప్పిన భావము – 24 తత్వములు సృష్టికి మూలములు. వానిని తన శరీరములో భాగములుగా కలిగి సృష్టికి ఆధారమైనవాడు గనుక గోవిందుడే శరీరభూతభృత్. ఆ 24 తత్వములు – ప్రకృతి(1), మహత్ (1), అహంకారము(1), జ్ఞానేంద్రియాలు (5), కర్మేంద్రియాలు (5), పంచభూతాలు (5), పంచ తన్మాత్రలు (5), మనసు. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణము. **తస్య మూర్ధా సమభావాత్ ద్యౌష నక్షత్ర దేవతా** – నక్షత్రములు, దేవతలు కూడా ఆయన శిరస్సులోని భాగమైన ఆకాశములో భాగములు.

మరింత విస్తారమైన భావములో 'భూతములు' అనగా సృష్టిలోని సమస్తములు. భూ - సత్తాయామ్ - నిజమైనది, ఉండినది. విశ్వరూపుడైన శ్రీదేవుని శరీరములో సకల భూతములు భాగములే. అన్నింటిని భరించు శ్రీమహావిష్ణువే శరీరభూతభృత్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – మన శరీరములోని అంతఃప్రాణము ఆ నారాయణుడే. శరీరమునకు మూలమైన భూతములను పోషించువాడు శరీరభూతభృత్.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన మరొక వ్యాఖ్య – కంటికి అధిదేవత సూర్యుడు. మనసుకు చంద్రుడు. చర్మమునకు వాయువు. ఇలా సకలేంద్రియముల అధిదేవతలను కాపాడేవాడు శరరభూతభృత్.

502. భోక్తా

అనుభవించువాడు. భుజించువాడు. స్వీకరించువాడు.

ఓం భోక్త్రే నమః

ఈ దివ్యనామము 145వ, 502వ, 888వ నామములుగా మూడుమార్లు స్తుతించబడినది.
16వ శ్లోకము. 145వ నామము. భోక్తా – **భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః**
53వ శ్లోకము. 502వ నామము. భోక్తా – **శరీరభూతభృత్ భోక్తా కపీంద్రో భూరిదక్షిణః**
95వ శ్లోకము. 888వ నామము. భోక్తా – **అనన్తో హుతభుక్ భోక్తా సుఖదః నైకదోగ్రజః**

ఇంతకుముందు (145వ) నామ వివరణ ప్రకారము 'భోక్తా' అనగా (1) పత్రపుష్పఫలాది సమర్పణలను పరిగ్రహించి ఆనందించువాడు (2) సకల దేవతలకు సమర్పించినవన్నియును వాసుదేవునకే చేరును – కనుక ఆయనను భోక్త అని కీర్తిస్తారు. (గీత 9.26, గీత 5.29 ఆధారముగా).

ఈ (502వ) నామ వివరణలో శ్రీ భట్టులు చెప్పినది – హవ్యములను, కవ్యములను కూడ భుజించువాడు భోక్త. 'హవ్యము' అనగా దేవతలకు సమర్పించునది. 'కవ్యము' అనగా పితృదేవతలకు సమర్పించునది.
హవ్యకవ్య భుజో విష్ణో హుదక్ పూర్వే మహోదధౌ (మహాభారతము. శాంతిపర్వము. 348.3) – విష్ణువు ఈశాన్యమున మహాసాగరమునందుండి భక్తితో సమర్పించిన హవ్య కవ్యములను భుజించుచున్నాడు.

అహమన్నమ్ అహమన్నమ్ అహమన్నమ్
అహమన్నాదో అహమన్నాదో అహమన్నాదో – తైత్తరీయోపనిషత్తు
నా భక్తులు ఆనందించే భోజనము (విషయము) నేను. వారు అర్పించేవానిని ఆస్వాదించునది నేను.

ఇంకా దివ్యప్రబంధములనుండి పెక్కు వచనములను శ్రీ వి.వి. రామానుజన్ వంటివారు ఉదాహరించారు. (తిరువైమొళి 5.6.4, తిరువైమొళి 9.6.10, తిరువైమొళి 10.10.11). ప్రసాదించువాడు, ఆస్వాదించువాడు కూడ పరమాత్ముడే. భక్తుని సాంగత్యమును భగవంతుడు, భగవంతుని సాంగత్యమును భక్తుడు పోటీపడి అనుభవిస్తున్నారు. ఆ విషయంలో చివరకు దేవుడే నెగ్గాడు. ఆ భక్తసులభుడు తన భక్తుల సాన్నిహిత్యమును తనివితీరా అనుభవించి ఆనందిస్తున్నాడు. గోపీజనవల్లభుడు భోక్త గనుకనే కుచేలుడు తెచ్చిన పిడికెడు అటుకులను భుజించి సంతృప్తుడయ్యాడు. దుర్యోధనుని రాజమర్యాదలను వలదని విదురుని యింట విందారగించాడు.

'భోక్తా' అన్న పదమునకు శ్రీ చిన్మయానంద రెండు అర్థాలను చెప్పారు (1) **భునక్తి ఇతి భోక్తా** – రక్షించేవాడు భోక్త (2) **భుంక్తే ఇతి భోక్తా** – ఆస్వాదించేవాడు భోక్త.

రక్షకో భక్షణశ్చ – పుట్టించేవాడు, కాచేవాడు, తుదకు కబళించేవాడు కూడా విశ్వేశ్వరుడే – అని శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరించారు.

ధర్మచక్రము రచయిత వివరణ – అందరియందును అంతర్యామిగా స్థితుడైన పరమాత్ముడు సాక్షి, మార్గదర్శి, భోక్త కూడాను.

ఉపద్రష్టాఽనుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః – గీత 13.22
ఈ శరీరంలో అంటీ అంటనట్లు ఉండే పరమపురుషుణ్ణి సాక్షి, అనుమతించేవాడు, భరించేవాడు, అనుభవించేవాడు, మహేశ్వరుడు, పరమాత్మ అని చెబుతారు.

ఇంద్రియలోలురై చరించేవారిలో దేవుడు సాక్షి మాత్రమే. ధర్మమార్గం అనుసరించేవారికి జగత్పతియే భర్త (పాండవులకు వలె). శరణాగతులై సర్వము శ్రీహరికి అర్పించువారికి ఆయన భోక్త. వారి నివేదనము స్వీకరించి తన యనుభవమును భక్తులకు పంచును. కనుక అహంకార మమకారములను త్యజించి సర్వమును శ్రీకృష్ణార్పణమొనరించి దివ్యానందము ననుభవింపవచ్చును.

ఇంతకుముందు 390 నుండి 421 వరకు నామములను శ్రీ రామావతారపరముగా శ్రీభట్టులు వ్యాఖ్యానించారు. మరల 503 (కపీంద్ర) నుండి శ్రీ భట్టులు శ్రీరామగుణగానము చేయు నామములుగా వ్యాఖ్యానించారు.

503. కపీంద్రః

- కపిసేనకు ప్రభువైన రాముడు. వానరరూపంలో ఉన్న దేవతలకు రాజు.

- ఆదివరాహమూర్తి.

- అన్నింట, అంతట చలనమునకు అధిపతి.

ఓం కపీంద్రాయ నమః

'కపి' అనే పదమునకు వానరము, వరాహము, చలనము కలిగినది అనే అర్థాలున్నాయి.

కపిరూపం ప్రపన్నానాం దేవానామీశ్వరతత్వతః

కపీంద్ర ఇతి విఖ్యాతః సప్తార్ణో మనునాయకః

శ్రీ భట్టుల వ్యాఖ్య – తానే హయగ్రీవుడై ప్రసాదించిన వేదములను సంరక్షించుటకు శ్రీహరి స్వయముగా నరుడై యవతరించెను. అదే కార్యమును సాధించుటకు దేవతలు వానరులుగా జనించిరి. అట్టి కపులకు ప్రభువైనందున ఆపన్నివారణుడైన శ్రీరామచంద్రుడు కపీంద్రుడు. ఇది ఉత్తమమైన సప్తాక్షరీ మంత్రము. ఓం కపీంద్రాయ నమః.

సర్వలోకేశ్వర స్సాక్షాత్ లోకానాం హితకామ్యయా

సర్వేః పరివృతో దేవ్యైః వానరత్వముపాగతైః – రామాయణము. యుద్ధకాండము 114.16

లోకేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు లోకహితమును కోరి వానరరూపమెత్తిన సకల దేవతలతోను పరివేష్టితుడైయున్నాడు. ఇక్కడ లోకములనగా ప్రపంచము, అందలి జనులు మరియు వేదములు కూడ. వీనినన్నింటిని కాపాడుటకు దేవదేవుడు కపీంద్రుడై యవతరించినాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – కోట్లకొలది కోతులను క్రమశిక్షణలో నడిపినవానికి ఇంద్రియములను నియంత్రించుట చాలా తేలిక పని.

ధర్మచక్రము రచయిత – కోతిలా గెంతే మనసు భగవద్ధ్యానమువలన అదుపులోనికి వచ్చును. అలా చేయడం వల్లనే అజ్ఞానము (రావణుడు) నశించును. బందీయైయున్న జ్ఞానము (సీతమ్మ తల్లి) స్వతంత్రమగును. అందుకు కపీంద్రుని ధ్యానమే ఉత్తమము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'కపి' అనగా వరాహము. కనుక ఆదివరాహమూర్తియే కపీంద్రుడు. 102వ నామమైన **'వృషాకపి'** కూడ ఇదే అర్థములో వ్యాఖ్యానించబడినది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – కపి - సంచలనే - చలించే గుణము కలది. సూర్యచంద్రాదులు, గ్రహములు, జీవజాలములు, పంచభూతములు, శరీరములో హృదయము, ప్రవహించే రక్తము, దేహమునుండి దేహమునకు మారు ఆత్మలు – అన్నీ చలనము కలిగినవే. అన్నింటికీ అధినాధుడు కపీంద్రుడు.

504. భూరి దక్షిణః

- పుష్కలముగా దక్షిణలొసగువాడు.

- శీఘ్రగతిని అన్నింటిని పెంపొందించువాడు. చలింపజేయువాడు.

- గొప్ప నైపుణ్యము గలవాడు.

ఓం భూరి దక్షిణాయ నమః

‘భూరి’ అనగా ఎక్కువ, అత్యధికము, పుష్కలము. ‘దక్షిణ’ అనగా దానము, గౌరవ పురస్కారము.

హయమేధాదిభిర్యజ్ఞైః జగదాచార్యకాయవై

యజమానస్స విజ్ఞేయ సర్వదా భూరిదక్షిణః

లోకంలోని ప్రజలతో కర్మలు చేయించదలచినవాడై, తానే స్వయంగా అశ్వమేధాది యజ్ఞాలు అనేకం చేసి బ్రాహ్మణులకు అధికమైన దక్షిణలిచ్చినవాడు భూరిదక్షిణుడు.

అశ్వమేధ శతైరిష్ట్వా తథా బహు సువర్ణకైః

గవాం కోట్యాయుతం దత్వా బ్రహ్మలోకం గమిష్యతి

శ్రీరామచంద్రుడు వంద అశ్వమేధయాగాలు చేసి, కోట్ల కొలది ఆవులను, బంగారాన్ని దానంగా ఇచ్చి పరమపదం చేరాడు.

బలరామ శ్రీకృష్ణులు తమ గురువైన సాందీపనికి మరణించిన పుత్రుని యమలోకమునుండి పిలిచి ఇచ్చి, అపూర్వమైన, అసాధ్యమైన గురుదక్షిణనొసగిరి. అందరకు అభయమ్మునిచ్చు కందువగు బంగారుచేయి, కొండలంత వరములు కూపెడు చేయి తిరువేంకటేశ్వరుని మంగళహస్తము.

యజతో ధర్మమర్యాదాదర్శనాయాఽపి భూరయః

బహ్వ్యోఽస్య దక్షిణా యజ్ఞ ఇతీశో భూరిదక్షిణః

ధర్మ మర్యాదను లోకమునకు చూపుటకై యజ్ఞమును ఆచరించు యజమానిగా ఉన్న ఈ భగవానునకు ఆ యజ్ఞమున తాను ఇచ్చు భూరిదక్షిణలు కలవు. అట్టి యజ్ఞమును ఆచరించుచుండు యజమానుడూ విష్ణుపరమాత్ముని విభూతియే! అనగా - యజ్ఞమును చేయించిన ఋత్విజులకు యజమాని సమర్పించుకొను భూరిదక్షిణలూ విష్ణువే. కావున ఆ విష్ణుదేవుడు భూరిదక్షిణః. (దివ్య నామములు బ్లాగు).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దక్ష్ - వృద్ధౌ - శీఘ్రగతే - వేగముగా వృద్ధి చెందుట, త్వరగా చలించుట – అనే అర్థములో – జీవజాలములు జన్మించినవెంటనే కదులుట, ఆహారము గ్రహించుట, ప్రవర్ధమానమగుట వంటి లక్షణములు కనబరచును. ఇది భగవానుని అనుగ్రహము. కనుక ఆయన భూరిదక్షిణుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక అర్థమును కూడ సూచించారు – పాణిని సూత్రము 1.1.34 ప్రకారము ‘దక్షిణ’ అనగా నైపుణ్యము అనే అర్థమున్నది. కనుక అసమాన దక్షిణాదక్షుడు భూరిదక్షిణుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ముగ్గురు ఆళ్వారుల దివ్యానుభవము

ఈ క్రింది రచన వీనినుండి సంగ్రహించబడినది –

1) ఆళ్వారాచార్య సంగ్రహ చరిత్రలు – శ్రీమాన్ పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకటలక్ష్మీ నరసింహాచార్యులు

2) ద్వాదశ సూరి చరిత్ర – శ్రీ కె.టి.ఎల్. నరసింహాచార్యులు

ఆళ్వారులు శ్రీవైష్ణవ సంప్రదాయంలోనూ, తమిళ సాహిత్యంలోనూ విశిష్టమైన స్థానం కలిగిన విష్ణు భక్తులు. తమ పాశురాలతో విష్ణువును కీర్తించి దక్షిణాదిన భక్తి సంప్రదాయాన్ని పరిమళింపజేశారు. వీరు పాడిన (రచించిన) పాశురాలు అన్నీ (నాలుగు వేలు) కలిపి 'దివ్య ప్రబంధం' లేదా 'నాలాయిరం' లేదా 'ద్రవిడ వేదం' అనబడుతాయి. భక్తి, పారవశ్యము, శరణాగతి - ఇవి ఈ ఆళువారుల జీవితంలోనూ, రచనలలోనూ, వారిని గురించిన గాధలలోనూ ప్రముఖంగా కానవచ్చే అంశాలు. మొత్తం పన్నెండుమంది ఆళ్వారులలో **పొయ్‌గయాళ్వార్** (సరోయోగి), **పూదత్తాళ్వార్** (భూతయోగి) మరియు **పేయాళ్వార్** (మహాయోగి) - ఈముగ్గురూ ప్రధములు. కనుక వారిని ముదలాళ్వారులు అంటారు. ఆళ్వారుల జీవిత కాలాల గురించి స్పష్టమైన చారిత్రక ఆధారాలు అందడంలేదు. ముదళాల్వారులు ద్వాపర యుగాంతంలో ఉద్భవించారని సంప్రదాయ గాధలు. కాని శాస్త్రీయ పరిశోధకులు వీరి కాలం క్రీ.శ. 7వ శతాబ్దం - 9వ శతాబ్దం మధ్యకాలమని అభిప్రాయపడుతున్నారు. ఆళ్వారుల జీవిత విశేషాలగురించి కూడా అనేక గాధలు ప్రచారంలో ఉన్నాయి. ఈ ముగ్గురు ముదలాళ్వారుల సమావేశం గురించీ, ద్రవిడ వేదం ఆవిర్భవించడం గురించీ ఒక గాధ ప్రచారంలో ఉంది. ఇది తిరుక్కోవలూర్‌లో జరిగింది అని చెబుతారు.

వర్షం కురుస్తున్న ఒక చీకటిరాత్రి పోయ్‌గై ఆళ్వారు ఒక ఇంటి యజమాని అనుమతి తీసికొని ఆ యింటి చిన్న అరుగుపైన పడుకొని భగవద్ధ్యానము చేసికొంటున్నాడు. కొంత సేపటికి పూదత్తాళ్వారు అక్కడికి వచ్చి తాను కూడా తలదాచుకొనవచ్చునా అని అడిగాడు. అప్పుడు పోయ్‌గయాళ్వారు - 'ఈ అరుగు మీద ఒకరే పండుకొనవచ్చును కాని ఇద్దరు కూర్చుండవచ్చును' అని పూదత్త ఆళ్వారును ఆహ్వానించాడు. మరి కొంత సేపటికి పేయాళ్వాఋ వచ్చి తనకు కూడా చోటు దొరకునా అని అర్థించాడు. కూర్చొని ఉన్న ఇద్దరు ఆళ్వారులు - 'ఈ అరుగు మీద ఇద్దరే కూర్చోగలరు. కాని ముగ్గురు నిలుచుండవచ్చును' అని మూడవ భగవద్దాసుని ఆహ్వానించారు.

ఆ రాత్రిపూట, కన్ను పొడుచుకున్నా కానరాని ఆ కటిక చీకటిలో, ఈ ముగ్గురూ భగవద్గుణానుభవామృత పానమత్తచిత్తులై మైమరచి యున్నారు. వారి భక్తి ప్రకర్షకు పరవశించి తిరుక్కోవలూర్ ఆలయంలోని నాయనార్ (సర్వేశ్వరుడు) శ్రీ హరి ఉన్నట్లుండి అదృశ్యరూపంలో వచ్చి వారి నడుమ నిలిచాడు. మాధవుని కళ్యాణగుణ వైభవమును వారు మువ్వురు గానము చేయుచుండగా అచ్యుతుడు ఆనందముతో చిందులు వేయసాగాడు. నాల్గవ వ్యక్తి తమ మధ్య ఉన్నారని. ఆయనే సర్వేశ్వరుడని, ఆళ్వారులు గ్రహించారు.

అపుడు పొయ్‌గయాళ్వారు ఆ మహామూర్తిని గుర్తించటానికి ఒక దివ్యదీపం వెలిగించాడు. భూమిని ప్రమిదగా చేసి, దానిలో సముద్రజలం అనే నెయ్యిపోసి, ఉష్ణకిరణాలతో వెలిగే సూర్యుణ్ణి వత్తిగా వేసిన దీపంతో సుదర్శన చక్రధారియైన స్వామిని అర్చిస్తానన్నాడీ కవి. సుదర్శన హస్తుడగు శ్రీమహావిష్ణువు పాదారవిందములకు నూరుపాశురములు ప్రస్తుతించెను. వాటిని 'ముదల్ తిరువన్దాది' అని దివ్య ప్రబంధములో చెబుతారు.

వైయం తకళియా వార్ కడలే నెయ్యాక
వెయ్యకతిరోన్ విళక్కాక - శెయ్య
శుడరాళియా నిడిక్కే శూట్టినేన్ శొన్మాలై
ఇడలాళి నీంగుక వే యెంగు

తాళ్ళపాక తిరువేంగళనాథుడు రచించిన 'పరమయోగి విలాసము'లో ఈ పాశురమునకు తెలుగు సేత ఇలా ఉన్నది.
ధరణి పంతియ సముద్రంబులు నేయి
యరుణు దీపము జేసి యరుణాంశ తతుల
గారాబు చక్రంబు కైబూన్చినట్టి
నీరజాక్షునకిత్తు నీరాజనంబు
ఆహా! ఏమి అద్బుత దృశ్యమిది? దీనిని గాంచినంతనే నా యొడలు గగుర్పొడుచుచున్నదే! సాక్షాత్తు శ్రీమహావిష్ణువే నాకు ప్రత్యక్ష మయినాడు. ఆహా ఏమి నా భాగ్యము. ఎంతో కాలమునుండి యెదురుచూచిన మా స్వామి నాకు ప్రసన్నుడైనాడు గదా! నేటికి నా జన్మ తరించినది. అయిన నీ మహాత్మ్యనికి నేనెట్లొనరింపగలను? సామాన్య ధూప దీపాదులతో ఈ ఘను నర్చించుట నాబోటి యల్పునకీ సమయమున సాధ్యమగునా? కాన భూమిని ప్రమిదగాజేసి, సముద్ర జలమునే నేయిగా అందుంచి, ఉష్ణకిరణుడగు సూర్యునే వత్తిగా వేసిన దీపముతో ఈ స్వామిని అర్చింతును. దుఃఖ సముద్రమునుండి బయటపడగోరి సుదర్శన చక్రహస్తుడగు శ్రీమహావిష్ణువు పాదములయందు ఈ వాఙ్మయమును భక్తితో సమర్పించుట తక్క నేనేమి సేయగలను?

ఆ తరువాత పూదత్తాళ్వారులు తమ హృదయంలోనే ప్రజ్వలిస్తూ ఉన్న జ్ఞానదీపంతో ఆ శ్రీపతి కిట్లా నివాళి పట్టాడు:-
అన్బే తకళియా ఆర్వమే నెయ్యాక
ఇన్బురుకు శిందై ఇడు తిరియా - నన్బురుకి
జ్ఞానచ్చుడర్ విళక్కేత్తినేన్ నారణుక్కు
జ్ఞానత్తమిళ్ పురిందనాన్
భక్తిని ప్రమిదగా చేసి, ఆర్తిని నెయ్యిగా దానిలో పోసి, భగవత్సందర్శన జనితానందం అందులో వత్తిగావేసి, అజ్ఞానాంధకారం దూరం అయ్యేటట్లుగా పరభక్తి అనే ఉజ్జ్వల దీపాన్ని నిండుమనస్సుతో అర్పించి ఆ శ్రీ హరిని అర్చిస్తున్నాను అని దీని అర్థం. వీరు పాడిన దివ్య ప్రబంధము నూరుపాశురములను 'ఇరణ్డాన్ తిరువన్దాది' అంటారు.

తాళ్ళపాక తిరువేంగళనాథుడు రచించిన పరమయోగి విలాసములో ఈ విషయాన్ని ఇలా వర్ణించాడు.

.... ప్రేమ

పంతియ మితి లేని భక్తియే చమురు

నానంద భరిత హృదట్టంబె వత్తి

గానొనరించి వికాసమై యాత్మన్

తిరమొందు జ్ఞానంబు దీపంబు జేసి

పెరియ నారాయణార్పితము గావించె

ఈ ఇద్దరు భక్తులూ వెలిగించిన జ్ఞానదీపద్వయ ప్రకాశంలో మూడవ ఆళ్వారైన పేయాళ్వారులు ఆ భగవానుని దివ్యమంగళ విగ్రహ సౌందర్యం కన్నుల కరువు తీరా సందర్శించాడు. బ్రహ్మానంద పరవశుడై పరమాత్మ స్వరూపమును నుతించారు. వారి నూరు పాశురములు 'మూన్డాన్ తిరువన్దాది'. ఆ శుభక్షణంలో అయత్నంగా వెలువడిన సుమధుర వాణియే ఇది:-

తిరుక్కండెన్ పొన్మేని కండేన్ తికళుమ్

అరుక్కన్ అణినిరమున్ కండెన్ – శెరుక్కి శరుం

పొన్నాళి కండేన్ పురిశంగై కండేన్

ఎన్నాళి వణ్ణన్ పాల్ ఇంగు

ఆహా! ఏమియానందము! శ్రీమహాలక్ష్మి ఈ నా ప్రాకృత నేత్రములకు కనిపించినది. శ్రీహరి సువర్ణ శరీర సౌందర్యము ఈనాడు నేత్రాంజలులతో తనివితీర గ్రోలగలిగినాను. పాపాత్ములను సమూలముగా ఛేదించునట్టి మా స్వామి హస్తము నలంకరించిన సుదర్శనాయుధమును కూడ సందర్శింపగలిగిన నేనెంత భాగ్యశాలినో గదా! ప్రళయకాలాభీలమగు పర్జన్య దేవుని గర్జన ననుకరించే పాంచజన్యమును గాంచి సుకృతిని కాగలిగినాను. నీల ఘనాభుడగు శ్రీవైకుంఠుని దివ్యమంగళ విగ్రహము సందర్శించిన సౌభాగ్యవంతుడనగు నాకింక కోరదగినది ఏముండును?

తాళ్ళపాక తిరువేంగళనాథుడు రచించిన పరమయోగి విలాసములో ఈ విషయాన్ని ఇలా వర్ణించాడు.

సిరి గంటి చెన్ను మించిన మేను గంటి

కరమొప్పు వదన వికాసంబు గంటి

సల్లలితా వనీస్తన కుంభ శుంభ

పల్లవంబుల బోలు పాదముల్గంటి

సరసీజ హల శంఖ చక్రాంకుశాంక

చరణముల్ జగదేక శరణముల్ గంటి

ధరణీ బింబము చాయ దరళించు కనక

సురుచిరాంశుకము నంశుకము గన్గొంటి

శ్రీ మించు కటితట శ్రీ సతీవరణ

దామముల్ మేఖలా దామముల్గంటి

వాత్సల్య జలధి కైవడి నొప్పుచున్న

వత్సంబు గంటి శ్రీవత్సంబు గంటి

చుట్టు కైదువు వలచుట్టు శంఖంబు

పట్టి చూపట్టిన బాహువుల్గంటి

శీతాంశు మండల శతకోటి కోటి

రీతి జూపట్టు కిరీటంబు గంటి

మలగుల్లై తెల్ల దామరల దామరలన్

గలహించు నిడువాలు గన్నుల గంటి

మకర కుండల బాల మార్తాండ రుచుల

వికసించు వదనారవిందంబు గంటి

ఇలా ఆ మహనీయుల భగవద్దర్శన కాంక్ష ఒకే కాలమున ఒకేచోట భగవదనుగ్రహము చేతనే నెరవేరెను. అప్రాకృత దివ్యమంగళవిగ్రహుడగు శ్రీహరిని ఈ లోకస్థులలో కాంచు అదృష్టము ఈ ముగ్గురు ఆళ్వారులకే ప్రప్రధమమున కలిగినది. కావుననే వారికి ముదలాళ్వారులు – మొట్టమొదటిగా భగవద్దర్శనానందామృత పాన మత్తచిత్తులు – అను పేరు రూఢి యయినది.

వారికి శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమైన విధమును “ప్రపన్నామృతము” అను సంస్కృత కావ్యములో ఇలా వర్ణించారు.

తార్క్ష్యదిరూఢం తటిదంబుదాభం

లక్ష్మీధరం వక్షసి పంకజాక్షమ్

హస్తద్వయే శోభిత శంఖచక్రం

విష్ణుం దయాబ్ధిం దదృశుస్తమాద్యమ్

ఆజానుబాహుం కమనీయగాత్రం

పార్శ్వద్వయే శోభిత భూమినీళమ్

పీతాంబరమ్ భూషణ భూషితాంగం

చతుర్భుజమ్ చందన రూక్షితాంగమ్

బింబాధరం కుందసమాన దంతం

శరన్నిశానాథ సమాన వక్త్రమ్

నీలాలకం దివ్యకిరీట జుష్టమ్

కర్ణద్వయే శోభిత కుండలాఢ్యమ్

రత్నాంగదం మౌక్తిక దివ్యహారం

కటీతటీ లంబిత హేమసూత్రమ్

రత్నాంగుళీయం మణి కంకణాఢ్యం

మాణిక్య మంజీర సుమృష్ట పాదమ్

మందార మాలాంచిత కేశబంధం

శ్రీకౌస్తుభోద్భాసిత కంఠ దేశమ్

శ్రీవత్స చిహ్నమ్ కమనీయ వేషం

వేదాంతవేద్యం మనసోऽప్యగమ్యమ్

అప్రాకృతం దివ్యమనంతరూపం

సద్యోగి గమ్యం గుణ సంవియోగే

అత్యద్భుతం కోటి రవిప్రకాశ

మనుత్తమం యత్నసకాద్య గమ్యమ్

శ్రీమన్నారాయణుడు గరుడవాహనారూఢుడై వారి అనన్య భక్తికి ప్రీతుడై ప్రత్యక్షమయ్యెను. ఉరమున లక్ష్మీదేవిని దాల్చిన ఆయన నేత్రములు పద్మదళములను పోలినవై ఆకర్ణాంత విశాలములై చూపరులకు చూడవలెనను కాంక్ష కల్గించుచుండెను. సుదర్శన పాంచజన్యాదులను హస్తములందు ధరించిన ఆ దేవదేవునకు ఇరుపార్శ్వములందు భూ నీళా దేవులు కొలిచియుండిరి. నీలమేఘశ్యామమగు ఆ రమాకళత్రుని శరీరయష్టికి పట్టుపుట్టము వన్నె పెట్టుచుండెను.

శరచ్చంద్ర మండలమును బోలిన స్వామి ముఖమండలమున అధరము బింబఫలమును, దంతములు కుందపుష్పములను అనుకరించి శోభించుచుండెను. నీలాలకాలంకృతమైన శిరమున స్వామి ధరించిన దివ్యమణికిరీట కాంతులు కర్ణద్వయోలంబి కుండలములతో వియ్యమాడుచున్నవా అన్నట్లుండెను. భుజముల రత్నాంగదములు కైసేసి వైజయంతిమాలయను వనమాల గళమున వ్రేలాడగా కటితటమున సువర్ణసూత్రమును కట్టుకొనిన మాధవుడు చేతులకు రత్న వలయములు దాల్చి వ్రేళ్ళకు రత్నాంగుళీయములు పెట్టుకొని పాదములకు మాణిక్యమంజీరములు ధరించి మిగుల తేజరిల్లుచుండెను.

ఆ మేఘవర్ణుని కేశపాశము మందారమాలతో గూడి వింతకాంతులీనుచుండెను. కౌస్తుభరత్నముతోబాటు శ్రీవత్సమను పుట్టుమచ్చకూడ ఆ మహనీయుని ఱొమ్మునకు వింతశోభ గూర్చుచుండెను. ఆ మహామహుడు మనసునకు కూడ అందనివాడయ్యును వేదాంతవేత్తలకు సులభవేద్యుడు. అప్రాకృత దివ్యమంగళ విగ్రహుడును, యుగపదుదిత కోటిసూర్య ప్రభాభాసమానుడును, సనక సనందనాది మహామునులకు కూడ అగమ్యుడును అయిన ఆ అనంత కళ్యాణగుణాకరుని కాంచగలిగిన ఈ మహర్షిత్రయము భాగ్యమెట్టిదో గదా!

పరమపదనాధ సందర్శనా జనిత పారవశ్యముచే శరీరములందు పులకలెగియగా కన్నులనుండి ఆనంద బాష్పామృత ధారలు స్రవించుచుండగా వారు భక్తిగీతములు ఆలాపించిరి. ఆ భక్తి రసామృత ప్రవాహములు “ఇయఱ్పా” అను పేరుగల గ్రంధమున మూడువందలుగా నిబంధింపబడినవి. ఒకటవ తిరువందాది, రెండవ తిరువందాది, మూడవ తిరువందాది – ఇవి వీరి ఆత్మానుభవమునకు, హరిభక్తి తత్వమునకు, ఉత్తమ తాత్విక లక్ష్యమునకు ప్రతిబింబములు

శ్రీమతే రామానుజాయ నమః

మూలం –

1) ఆళ్వారాచార్య సంగ్రహ చరిత్రలు – శ్రీమాన్ పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకటలక్ష్మీ నరసింహాచార్యులు

2) ద్వాదశ సూరి చరిత్ర – శ్రీ కె.టి.ఎల్. నరసింహాచార్యులు

3) తెలుగు వికీపీడియా

సోమపోऽమృతపః సోమః పురుజిత్ పురుసత్తమః |
వినయో జయః సత్యసంధో దాశార్హస్సాత్వతాం పతిః || (54)

505. సోమపః

- శ్రీరామావతారములో యజ్ఞములు చేసి, అందు దేవతలకు అర్పించిన పిదప సోమరసమును పానము చేసిన యజమాని.
- యజ్ఞాధిదేవతయై సకల యజ్ఞములందును నివేదింపబడు సోమరసమును పానముచేయు భోక్త.

ఓం సోమపాయ నమః

ఒక వృక్షమునుండి సేకరింపబడే సోమరసం యజ్ఞాలలో అర్పింపబడే ముఖ్యమైన నివేదన. యజ్ఞము ఏ దేవతలను ఉద్దేశించి చేశారో ఆ దేవతలకు ముందుగా ఈ రసమును సమర్పిస్తారు. తరువాత యజ్ఞమును ఆచరించిన యజమాని సేవిస్తాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీరాముడు అనేక యజ్ఞములను ఆచరించాడు. అప్పుడు సోమరసం దేవతలకు సమర్పించి, తరువాత తాను త్రాగాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –అన్ని యజ్ఞములలోను ఉద్దేశించబడిన దేవతలందరూ నారాయణుని రూపములే. కనుక వివిధ దేవతల రూపములలో విష్ణువే అన్ని యజ్ఞములకు భోక్తయై సోమమును స్వీకరించును.

506. అమృతపః

- అమృతమును సేవించినవాడు.
- అమృతమును కాపాడువాడు.

ఓం అమృతపాయ నమః

ఈ నామములో 'ప' ధాతువును గ్రహించే విధం బట్టి శ్రీ భట్టులు రెండు విధములైన అర్థాలను చెప్పారు.

'ప' - పిబతి - త్రాగినవాడు.

యత్కించిద్ధూయతే వహ్నౌ హవిర్మంత్రైర్విధానతః

తత్సర్వ మమృతం కృత్వా విష్ణవే సంప్రయచ్ఛతి

యజ్ఞంలో హోమం చేసిన ద్రవ్యాలను అగ్నిదేవుడు అమృతముగా చేసి విష్ణువునకందజేస్తాడు. కనుక భగవానుడు అమృతమును (యజ్ఞభోక్తయై) ఆస్వాదించువాడు. **అహం హి సర్వ యజ్ఞానాం భోక్తా ప్రభురేవచ** (గీత).

'ప' - పాతి - రక్షించువాడు.

భగవానుడు స్వయముగా అమృతస్వరూపుడు. ధర్మపరులైన తన భక్తుల కొరకు, ముక్తుల కొరకు అమృతమును భగవానుడు కాపాడుచుండును.

అమృతస్య ఏష సేతుః (ముండకోపనిషత్తు 2.2.5) – ఆయనే అమృతమునకు సేతువు (అనగా అమృతము లభించు మార్గము).

యస్య ఛాయా అమృతమ్ (తైత్తరీయ యజుర్వేదము 4.1) – ఆయన నీడ అమృతము. అనగా అమృతము ఆయన రక్షణలో ఉన్నది.

ఈ నామ వివరణలో శ్రీ శంకరులు మోహిని అవతారమును ఉదాహరించారు. శ్రీమన్నారాయణుడు అసురులనుండి అమృతమును కాపాడి, దేవతలకు పంచి, వారితోపాటు ఆయన కూడ పానము చేశాడు. కనుక అమృతమును కాపాడినవాడు, అమృతమును త్రాగినవాడు 'అమృతపః'.

శ్రీ చిన్మయానంద – భగవానుడు పరమసత్యము. సదా అమృతత్వ స్వరూపుడు (నాశనము లేనివాడు). కనుక అమృతపః. స్వాత్మానందము అనే అమృతాన్ని త్రాగేవాడు.

507. సోమః

- అమృతమూర్తి
- చంద్రుడు.

ఓం సోమాయ నమః

సోమ స్సుధాయమానత్వాత్ ముక్తానాం పరికీర్తితః – ముక్తులైనవారు భగవంతుని అమృతమువలె ఆస్వాదింతురు. ఈ భావమును శ్రీభట్టులు రామాయణంలోని అరణ్యకాండ శ్లోకము ద్వారా ఉదాహరించారు –

మహతా తపసా రామ మహతా చాపి కర్మణా

రాజ్ఞా దశరథే నాసి లబ్ధోఽమృతమపివామల్తైః

రామా! దశరథుడు గొప్ప తపస్సు చేసి, మహత్వమైన కర్మలు చేసి, దేవతలు అమృతమును పొందినట్లుగా నిన్ను పొందాడు.

ఇంకా శృతినుండి – **శాంతి సమృద్ధమ్ అమృతమ్** (తైత్తరీయ. శిక్షావల్లి. 6) – అని కూడ ఉదాహరించారు. భగవంతుని తిరుమంత్రము 'ఆరావముదన్' కూడ ఇదే భావమును తెలుపుచున్నది. ఇదే 'తరగని అమృతము' అనే అర్థములో వివిధ దివ్యప్రబంధములలో ఉట్టంకించబడినది.

మనత్తుక్కినియానై పాడవుం నీవాయ్ తిఱవాయ్ – ఆండాళ్ తిరుప్పావై 12.

ఇందుకు ఆత్రేయ ఆంధ్రీకరణ (తిరుప్పావై పూదండ) –

మంచు మా తలలపై పడగ నీ వాకిలి పట్టి
కోపమున రావణుని కూల్చిన శ్రీరాముని
కీర్తింపగ, పెదవి కదపవేమె కలికి!
మాయ నిద్రను వీడి మేలుకోవమ్మ!

ఎన్నక్కుట్ తేనే! పాలే! కన్నలే! అముదే! (నమ్మాళ్వార్. తిరువైమొళి 10.7.2) – ఆయన నా సర్వస్వము- తేనె, పాలు, మిఠాయి, అమృతము.

నమ్మాళ్వార్. తిరువైమొళి 2.5.4 – నీవు నాకు తనివి తీరని అమృతానివి. రోజులు, నెలలు, యేళ్ళు, యుగాలు ఆస్వాదించినా నీ అనుభవము నాకు ఎల్లప్పుడూ క్రొత్త ఆనందమే!

'సోమ' అనగా 'చంద్రుడు' అని కూడ అర్థము. శ్రీ శంకరులు ఈ నామమునకు ఈ అర్థాన్ని కూడా చెప్పారు. **పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః** (గీత 15.13) – నేను రస స్వరూపుడనగు సోముడనై సస్యములను ఫలింపజేయుచున్నాను.

508. పురుజిత్

అందరిని జయించువాడు.

ఓం పురుజితే నమః

శ్రీ శంకరుల వ్యాఖ్య –

పురూన్ బహూన్ జయతి ఇతి పురుజిత్ – ఎల్లరిను జయించువాడు పురుజిత్తు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

లోకాన్ దీనాన్ గురూన్ శత్రూన్ సత్య దానానువర్తనైః

ధనుషా జితవాన్ యశ్చ పురుజిత్ సస్మృతో బుధైః

లోకములను సత్యముతోను, దీనులను దానముతోను, గురువులను సద్వర్తనతోను, శత్రువులను ధనుస్సుతోను జయించినవాడు గనుక పురుజిత్. ఇందుకు శ్రీ భట్టులు రామాయణమునుండి ఉదాహరించిన శ్లోకము –

సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః

గురూన్ శుశ్రూషయా వీరః ధనుషా యది శాత్రవాన్ – అయోధ్యకాండ 12.29

రాముని అడవులకు పంపమని కైక పట్టుబట్టినపుడు ఆమెను పట్టువీడమని బ్రతిమాలుతూ దశరథుడు రాముని సద్గుణాలను వివరించాడు. తనను రామునినుండి దూరం చేయవద్దని బ్రతిమాలుతూ అన్నాడు. లోకాలను రాఘవుడు సత్యంతోను, దీనులను దానంతోను, గురువులను శుశ్రూషతోను, శత్రువులను ధనుస్సుతోను జయించాడు.

ఇదే జయశీలత్వమును తిరుమంగైయాళ్వారులు తమ పెరియ తిరుమోళిలో వర్ణించారు (1.10.2, 4.3.5)

శ్రీ రామానుజన్ చెప్పిన మరొక విషయం – శ్రీరాముడు ఒకే కుటుంబంలో ముగ్గురిని మూడువిధాలుగా జయించాడు. రావణుని యుద్ధంతోను, విభీషణుని ధర్మంతోను, శూర్పణఖను రూపంతోను జయించాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఇదేభావాన్ని భగవంతుని విశ్వేశ్వర స్వరూప వర్ణనలో చెప్పారు –

అసంఖ్యాత తారాగ్రహొపగ్రహ సహితం తథా వన ఉపవన సముద్రాది సహితం

ఖగోళ భూగోళాత్మకం సర్వం విశ్వం యేన వశీకృతం స పురుజిత్ విష్ణుః

అంతులేని తారాగ్రహాదులు, వనాలు, సాగరాలు, ఖగోళ భూగోళాదులు కలిగిన సకల విశ్వమును తన అధీనమున ఉంచుకొన్నందున విష్ణువు పురుజిత్.

ధర్మచక్రము రచయిత – శ్రీరాముడు అనుసరించిన ధర్మ, వినయ, సత్య, శౌర్యాది శీలసంపదయే అందరికిని ఆదర్శప్రాయము. ఇట్టి నియమములతో సాగించు జీవనక్రమంలో వచ్చే అవరోధాలు తాత్కాలికమైనవి. వాటిని ఎదుర్కొనడం ద్వారా విశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవాలి. హరిశ్చంద్రుడు, పాండవులు అనుభవించిన క్లేశములే ఇందుకు దృష్టాంతములు.

509. పురుసత్తమః

- స్వయముగ మహాత్ములయందు సత్యముగ (తోడుగ) ఉండేవాడు.
- విశ్వస్వరూపుడు, సర్వమునకు ఉత్తముడు, అధికుడు.

ఓం పురుసత్తమాయ నమః

ఈ నామమునకు భాష్యకారులు వివిధములైన వ్యాఖ్యలు చెప్పారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

మహత్వ స్థిత మత్వాద్యో హ్యాంజనేయాదిషు స్వయమ్

పురుసత్తమ అఖ్యాతో నవార్ణ స్స్వస్తిదో మనుః

ఆంజనేయాది మహాత్ములపట్ల భగవానుడు స్వయముగ తోడై నిత్యమై యుండును. వారు భగవంతుని అమృతత్వమును సదా ఆస్వాదింప నిచ్చగింతురు. ఈ నామము నవాక్షరీ మంత్రము. స్వస్తికరము. ఓం పురుసత్తమాయ నమః. ఇందుకు దృష్టాంతముగా శ్రీభట్టులు రామాయణం ఉత్తరకాండలో హనుమంతుడు చెప్పిన శ్లోకము(40.15)ను ఉదాహరించారు.

స్నేహో మే పరమో రాజన్! త్వయి నిత్యం ప్రతిష్ఠితః

భక్తిశ్చ నియతా వీర! భావో నాన్యత్ర గచ్ఛతి.

రాజా! నాకు నీ పట్ల స్నేహము నిత్యమై నెలకొన్నది. వీరుడా! నా మనసు నీ యెడల భక్తి తప్ప వేరెక్కడికీ వెళ్ళదు.

శ్రీ వి.వి. రామానుజన్ తిరుమంగైయాళ్వారు రచనలు తిరువైమొళి 4.9.2, 1.8.4లను ఉదాహరించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఈ నామమును రెండు భాగాలుగా వ్యాఖ్యానించారు.

విశ్వరూపత్వాత్ పురుః, ఉత్కృష్టత్వాత్ సత్తమః

పురు – అనేకాద్భుత దివ్య ముఖ నయన దిశా సమన్వితమైన విశ్వరూపమూర్తి.

సత్తమ – సత్-తమ – సజ్జనులందరికంటె అధికుడు.

విశ్వరూపుడు మరియు సర్వోత్తముడు అయినందున పురుసత్తముడు.

శ్రీ చిన్మయానంద 'పురు' అనగా 'గొప్ప' అనే భావములో 'పురుసత్తమ' అనగా గొప్పవారిలో గొప్పవాడు – అని భగవానుని పరమోత్తమ తత్వమును వివరించారు. అంతే గాకుండా కొన్ని పాఠములలో 'పురుషోత్తమ' అనగా అంతటను ఉన్నవాడు మరియు ఉత్తముడు అని వివరించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్య – పురు-సత్-తమ – పురుసత్తమ – ఇక్కడ 'సత్' అనగా ఉనికి. 'తమ' అనగా ఉత్తమ. భగవంతుడొకడే నిత్యము. తక్కినదెల్లా అనిత్యము. ఈ నామము భగవంతుని అమృతత్వమును సూచించునది.

ధర్మచక్రము రచయిత – అనేక విభూతులతో నొప్పువాడు పురుసత్తముడు.

ప్రకాశవంతమైనవానిలోసూర్యుడు, చంద్రుడు. వేదములలో సామవేదము. దేవతలలో ఇంద్రుడు. అన్నింట అత్యధిక ప్రభావము గలవాడు. పురుసత్తముడు.

510. వినయః

- దండించి (దుష్టులను) అణచివేయువాడు.

- నయ (ధర్మ) మార్గములో నడిపించువాడు.

ఓం వినయాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **వినీయంతే దమయంతే ఇతి వినయః** – దండించి అణచువాడు వినయుడు.

కుంభకర్ణ మహాకాయ ఖర మారీచ రావణాః

దమ్యంతే విక్రమైర్యేవ వినయ స్స ముదాహృతః

మహాకాయుడైన కుంభకర్ణుని, ఖర దూషణ మారీచ రావణాదులను తన పరాక్రమముచే అణచివేసినందున శ్రీరాముడు వినయుడు. నయవర్తనము లేనివారిని దండించును.

శ్రీ చిన్మయానంద – 'వినయ గుణము' అనగా అహంకారము లేకుండుట. అధర్మపరుల అహంకారమును అణచివేయును గనుక భగవంతుడు వినయుడు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పెద్దలపట్ల, గురువులపట్ల, బ్రాహ్మణులపట్ల ఎంతో వినయవిధేయతలను కలిగియున్నారు. ఇలా భగవంతుడు వినయుడు.

వి-నయః – నయ మార్గమున నడిపించువాడు నేత. సత్య ధర్మ మార్గమున ముముక్షువులను నడిపించును గను శ్రీదేవుడు వినయుడు.

511. జయః

- ఆశ్రితులచే జయింపబడినవాడు.

- జయించువాడు.

ఓం జయాయ నమః

శ్రీ శంకరుల భాష్యము – **సమస్త భూతాని జయతి ఇతి జయః** – అన్ని భూతములను జయించువాడు జయుడు.

శ్రీ భట్టుల భాష్యము – **ఆశ్రితైర్జీయతే యస్మాత్ విధేయో క్రియతే జయః** –ఆశ్రితుల ఇచ్చ ప్రకారము నడుచుకొనువాడు. వారిచే జయించబడినవాడు. ఇలా భగవంతుని సౌశీల్యమును కీర్తించే ఈ పుణ్యనామము వివరణకు శ్రీ భట్టులు రామాయణమునుండి ఉదాహరించారు –

ఆజ్ఞాప్యోఽహమ్ తపస్వినామ్ (బాలకాండ 3.37) – నేను తాపసుల ఆజ్ఞను పాటించెదను.

తతో నారాయణో విష్ణుః నియుక్తః సురసత్తమైః (బాలకాండ 16.1) – అప్పుడు నారాయణుడు దేవతలచే నియుక్తుడయ్యాడు (వారు చెప్పిన విధంగా చేశాడు).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'జయ' శబ్దమువల్ల భగవానుడు అన్నింటిని తన అధీనములో ఉంచుకొనినట్లు, అన్నింటిని జయించినట్లు, ఏదియు గాని ఎవరుగాని ఆయనను జయింపజాలనట్లు తెలిసికొనవలెను.

ధర్మచక్రము రచయిత – ఈ నామము ద్వారా మనము తెలిసికొనవలసినది. మనలో రెండు విధముల్లైన గుణములున్నవి (1) భగవంతుని తెలిసికోవడానికి ఉపయోగపడేవి (2) అలా కానివి. సంపదకు లోబడుట, సంపద కొరకు అధర్మ కార్యములాచరించుట, కీర్తి కొరకు ప్రాకులాడుట వంటి దుర్లక్షణములు భగవదారాధనకు అవరోధములు. అలా కాకుండా శ్రీహరి కైంకర్యమునకు జీవితమును అంకితమొనర్చుట ద్వారా నిజమైన జయము లభించును.

ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్
వంచకులలో జూదమును నేనే. ప్రభావశాలురలోని ప్రభావము నేను. విజేతలలో విజయము నేను. నిశ్చయాత్మకులలో నిశ్చయమును, సాత్త్విక పురుషులలో సాత్త్విక భావమును నేనే.

512. సత్యసంధః

- తానిచ్చిన మాటను నిలుపుకొనువాడు.
- దృఢమైన, చెరగని సంకల్పము గలవాడు.

ఓం సత్యసంధాయ నమః

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'సంధ' అనగా 'ప్రతిజ్ఞ' అన్న అర్థమును వివరించారు. భగవానుని ప్రతిజ్ఞలు ఎల్లపుడు సత్యములగును. ఇందుకు శ్రీ భట్టులు అయోధ్యకాండ (10.9)నుండి చెప్పిన ప్రమాణము. శ్రీరాముడు సీతమ్మతో అన్నది –

అప్యహం జీవితమ్ జహ్యామ్ త్వాం వా సీతే స లక్ష్మణాం
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః
సీతా! నేను నా ప్రాణమును, నిన్ను, లక్ష్మణుని కూడా విడువగలను కాని నా ప్రతిజ్ఞను, విశేషించి బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను, విడువజాలను.

దశావతారములు – 19వ శతాబ్దపు చిత్రం

శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వార్ రచన తిరువైమొళి నుండి (9.10.6) ఉదాహరించారు. భగవంతుడు సదా తన నిజభక్తులకు సత్యస్వరూపుడు. ఆయన శ్రీనారసింహుడై ప్రహ్లాదుని మాటను, దేవతలకు తానిచ్చిన మాటను సత్యమొనర్చెను. హిరణ్యకశిపునకు కూడా దర్శనమొసగెను. హిరణ్యకశిపుడు తన కొడుకునకు ఆపన్నత కలిగించినపుడు వానిని పట్టి వధియింతునని శ్రీహరి దేవతలకు అభయమిచ్చినాడు. సర్వాత్మకుడైన హరి స్తంభమున తప్పక యుండునన్న ప్రహ్లాదుని మాట తప్పకుండ హరి యుద్ధండ ప్రభావమున శ్రీనారసింహాకృతుడై స్తంభమునుండి అవతరించెను. బ్రహ్మ వరమునకు భంగము కాకుండ రాక్షసుని పట్టి వధియించి జయ విజయుల మనోరథమును నెరవేర్చెను.

శ్రీరామానుజులు శరణాగతి గద్యములో ఉదాహరించిన భగవద్వాక్యములు –

రామో ద్విర్నాభిభాషతే – రాముడు రెండువిధములుగా మాటలాడడు.

అనృతం నోక్త పూర్వమ్ మే న చ వక్ష్యే కదాచన – నేనెన్నడును అసత్యమును చెప్పినవాడను కాను.

కైకేయికిచ్చిన వరమునకు కట్టుబడ్డ దశరథుడు, ద్యూత నియమమునకై అజ్ఞాతవాసము చేసిన ధర్మపుత్రుడు, ఆడితప్పని హరిశ్చంద్రుడు – వీరంతా భగవంతునకు ఆప్తులు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్యసంధః అస్య ఇతి సత్య సంకల్పః** – ఆ వాసుదేవుని సంకల్పము నిశ్చయముగా సత్యమగును.

శ్రీ ఆర్. అనంతకృష్ణశాస్త్రి, శ్రీ చిన్మయానంద పురాణములనుండి ఉదాహరించినది – మిన్ను విరిగి పడుగాక. హిమాలయములు క్రుంగుగాక. భూమి బ్రద్దలగుగాక. సాగరములింకిపోవు గాక. నా పలుకులెన్నటికిని వ్యర్థములు కావు.

513. దాశార్హః

- కానుకలు సమర్పించ తగినవాడు.
- భక్తులకు తానే కానుక యగువాడు.
- 'దశార్హః' – యదువంశమున జన్మించినవాడు.

ఓం దాశార్హాయ నమః

దాస్య - దానే - ఇచ్చుట; అర్హ - తగిన; అనే రెండు శబ్దములనుండి ఈ పుణ్యనామము మొదటి రెండు అర్థములు తెలుపబడినవి. కానుకలు సమర్పించి హరిని సేవింపదగును. హరియే పరమ భాగ్యమని తలచి ఆరాధింపదగును. శ్రీ శంకరులు 1వ, 3వ అర్థములలో వ్యాఖ్యానించారు. శ్రీ భట్టులు ఈ మూడు అర్థములను వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము భగవంతుడు అన్ని నివేదనలను, యజ్ఞయాగాదుల అర్పణలను స్వీకరించును.
ఆత్మనోవార్పణం భక్తైః తేభ్యోవా స్వాత్మనోఽర్పణం
దాశస్తు మర్హతి చ యః దాశార్హ స్స తు కీర్తితః
దానానికి తగినవాడు. తనను తన భక్తులకు ఇచ్చుకొనేవాడు. భక్తులు స్వయంగా తమను ఆయనకు సమర్పించుకోవడానికి తగినవాడు.

భగవంతుడు కృష్ణుడై దశార్హ (యదు) వంశమున జన్మించెను గనుక దాశార్హుడు.

శ్రీ వి.వి. రామానుజన్ తిరుపైమొళి (2.34, 3.7.4)నుండి ఉదాహరించారు. భగవంతునకు ఆత్మ సమర్పణము చేసికొనవలెను. భగవంతుడు తానే పాలసముద్రమునుండి అమృతమును చిలికించి, మరల మోహినియై దేవతలకు పంచినాడు. **పెరుమక్కళ్ ఉళ్ళువార్ తమ్ పెరుమాన్** – భగవన్నామ స్మరణ చేయువారి హృదయములలో వసించును. అట్టి ముముక్షువులు కోరుకొను గొప్ప బహుమతి శ్రీనివాసుడే.

ధర్మచక్రము రచయిత – మనము సమర్పించిన అన్నింటిని, పాపములతో సహా, స్వీకరించువాడు భగవానుడే. మన కర్మ ఫలములను గైకొని వాసుదేవుడు సకల పాపకర్మలనుండి మనలను విముక్తులను చేయువాడు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః – గీత 18.66
సర్వ ధర్మములను, అనగా సమస్త కర్తవ్య కర్మలను నాకు సమర్పించి, సర్వ శక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని గావించెదను. నీవు శోకింపకుము.

514. సాత్వతాం పతిః

- సాత్వతులకు ప్రభువు.
- సాత్వత (యదు) వంశమున జన్మించినవాడు.

- సాత్వత తంత్రము (పాంచరాత్రము) అనుసరించువారికి దిక్కు.

ఓం సాత్వతాంపతయే నమః

యే సాత్వతా భాగవతాః తేషాం యః పతి రీశ్వరః

సాత్వతాం పతిర్యుక్తో నవార్ణ స్సాధు రక్షకః

సాత్వతులనగా సత్వగుణ సంపన్నులు. సత్యమును తెలిసికొని నిచ్చగించు భాగవతులు. సాత్వికులను అనుసరించువారు. అట్టి సాత్వతులకు పతియైన భగవంతుడు సాత్వతాం పతి. ఇది నవార్ణ మంత్రము. సాధువులకు రక్ష. ఓం సాత్వతాంపతయే నమః.

సాత్వత వంశమనగా యదుకులము. యాదవులకు దిక్కైనందున శ్రీకృష్ణుడు సాత్వతాంపతి.

సాత్వతము – అనగా సత్వగుణ ప్రధానమైన ధర్మతంత్రము. అట్టి తంత్రము ననుసరించి శ్రీమహావిష్ణు ధ్యానమే జీవిత లక్ష్యముగా సాధనచేయువారు సాత్వతులు. పాంచరాత్రము కూడా అట్టి సాత్వతమే.

పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి – శ్రీహరియే పాంచరాత్ర విధమును ప్రసాదించెను. దానిని ఆచరించు సాత్వతులకు పతియైన శ్రీదేవుడే సాత్వతాంపతి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

జీవో వినయితా సాక్షీ ముకుందోఽమితవిక్రమః |

అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః || (55)

515. జీవః

- జీవనము ప్రసాదించువాడు.

- పరమాత్మ సకల క్షేత్రములందు జీవుడై వెలసియున్నాడు.

ఓం జీవాయ నమః

జీవయతీతి జీవః. భాగవతులను పాపకర్మలనుండి దూరముగా ఉంచి, భగవత్సేవా భాగ్యమును ప్రసాదించి, వారి జీవితమును సచ్చిదానందమయము చేయువాడు గనుక శ్రీదేవుడు 'జీవః'. ఒక ఉడుత కూడ కైంకర్యమొనర్చి జన్మను సాఫల్యము చేసికొను భాగ్యము ప్రసాదించినవాడు.

తానాత్మనాశాద్వ్యావర్త్య సత్వాన్యశ్చ స్వసేవయా

ఉజ్జీవయతి జీవ స్సః భక్త క్లేశా సహో మనుః

తన భక్తులను ఆత్మ నాశనమునుండి కాపాడి, తనకు సేవలు చేయు భాగ్యమును ప్రసాదించి, ఉజ్జీవింపజేయువాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరింత విస్తృతమైన అర్థంలో వివరించారు. **జీవయతి ప్రాణాన్ ధారయతి ఇతి జీవః.** అన్ని జీవులను, ప్రాణములను నిలుపువాడు జీవుడు.

మరొక విధంగా – పరమాత్మయే అన్ని శరీరములందును జీవుడై వెలయుచున్నాడు. మాయావశుడై, కర్మబద్ధుడై కర్తృత్వ భోక్తృత్వములను అనుభవించుచున్న జీవుడు వాస్తవముగా పరబ్రహ్మమగుటచేత 'జీవ' శబ్ద వాచ్యుడగును. **క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత** (గీత 13.2.). అన్ని క్షేత్రములందును నేను క్షేత్రజ్ఞుడనైయున్నాను. (శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి).

516. వినయితా

517. సాక్షీ

516, 517. వినయితా సాక్షీ

ఈ నామమును శ్రీ శంకరభగవత్పాదులు 'వినయితా సాక్షీ' అని ఒకే నామముగా పరిగణించారు. శ్రీ పరాశరభట్టులు 'వినయితా', 'సాక్షీ' అనే రెండు నామములుగా పరిగణించారు.

వినయితా

- రక్షించువాడు.

- అందరికిని మార్గము చూపువాడు.

ఓం వినయిత్రే నమః

'నే' అనే ధాతువునకు (గతౌ) 'వెళ్ళుట', (రక్షణేచ) 'కాపాడుట' అనే రెండు అర్థములు ఉన్నవి. కాపాడుట అనే భావములో శ్రీ పరాశరభట్టు ఈ నామమును వ్యాఖ్యానించారు.

భక్తాన్నిత్యం రాజపుత్ర లాలన న్యాయత్ స్సుఖమ్ రక్షత్యతో వినయితా నయతే రక్షణార్థతః. భక్తులను రాజకుమారులవలె లాలించి భగవానుడు రక్షించునట. శ్రీ వి.వి. రామానుజన్ యుద్ధకాండమునుండి ఉదాహరించారు. లంకలో సుగ్రీవుడు తొందరపడి రావణునిపై ద్వంద్వయుద్ధానికి తలపడ్డాడు. అప్పుడు రాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. **త్వయి కించితి సమాపన్నే కిం కార్యమ్ సీతాయా మమ?** మిత్రుడా! నీకు ఆపత్తు కలిగేట్లయితే నాకు సీత ఎందుకు?.

నమ్మాళ్వార్ తిరువైమొళి(6.9.3)లో ఇలా అన్నారు. నీ రక్షణ కోరి నిన్నాశ్రయించేవారి కొరకు నీవు నిలుచున్నట్లు గాను, విశ్రమించినట్లు గాను, కూర్చున్నట్లుగాను దర్శనమిస్తుంటావు మాధవా.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'నే' అనగా 'వెళ్ళుట' అనే భావములో ఈ నామమును వివరించారు. **సర్వస్య జగతో ప్రాయయితా గతేర్దాతా ఇత్యర్థః.** అందరికిని దారి చూపెడువాడు, నడిపించేవాడు వినయిత.

సాక్షీ

చూచువాడు.

ఓం సాక్షిణే నమః

భగవంతుడు అందరిలోను అంతర్యామియై అందరిని పరికించుచుండును. తనను నమ్ముకొన్నవారికి కించిత్తైనా కీడు కలుగకుండా చూస్తూ ఉంటాడని శ్రీ భట్టుల వివరణ. **సాక్షాత్కరోతి యస్సాక్షీ తద్వృత్తం రక్షణాయ సః.** భక్తులను కాపాడడానికి వారు చేసే పనులన్నీ ప్రత్యక్షముగా చూసే శ్రీదేవుడే సాక్షి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **సాక్షాత్ ద్రష్టా సాక్షీ** – అని చెప్పారు. ఇందుకు రెండు విధాల వివరణలు ఇవ్వవచ్చును. (1) మాయకు అతీతుడైన భగవానుడు అన్నింటినీ ఉన్నవి ఉన్నట్లు చూచేవాడు గనుక సాక్షి. (2) భగవంతుడు అందరియందును, లోపల, వెలుపల, అంతటా ఉన్నాడు. అన్నీ ఆ దేవుడే. కనుక అన్నింటికిని ఆ శ్రీనివాసుడే సాక్షి. సర్వము వాసుదేవ మయమే గనుక ఆయన యెరుగనిది లేదు. ఈ నామమును వివరిస్తూ శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన శ్లోకము –

సాక్షీ స విష్ణుః స హి దర్శనో వా ద్రష్టా స్వయం స హి సూర్యచక్షుః
జ్ఞానమ్ హి చక్షుర్తమాత్ర బోధః నోऽంతర్గతః పశ్యతి విశ్వమాత్రమ్.

వినయితా సాక్షీ

తన భక్తులందలి వినయసంపదను చూచి ఆనందించువాడు.

ఓం వినయిత్రే సాక్షిణే నమః

తన ప్రియ భక్తులలోనున్న దయ, ప్రేమ, కరుణ, శాంతి, అహింస, సత్యము వంటి దివ్యగుణ సంపదలకు, వినయ సంపదకు శ్రీమహావిష్ణువే సాక్షి. మాధవుని సేవించు దివ్యగుణ సంపన్నులకు ఆ పుండరీకాక్షుడే తోడు, నీడ, గురువు, బంధువు, చెలి, మార్గదర్శి, రక్షణ, కైవల్యము.

518. ముకుందః

మోక్షమునిచ్చువాడు ముకుందుడు.

ఓం ముకుందాయ నమః

శ్రీ శంకరులు, శ్రీ పరాశరభట్టులు కూడా ఈ నామమునకు అర్థమును, వ్యుత్పత్తిని ఒకే విధముగా చెప్పారు. **ముక్తిం దదాతి ఇతి ముకుందః.** ముక్తినిచ్చేవాడు ముకుందుడు. పాణిని సూత్రము 6.3.109 – **పృషోదరాదీని యథోపదిష్టమ్** – ను ఇద్దరు భాష్యకారులూ ఉదాహరించి, ముక్తినిచ్చేవాడు ముకుందుడు అనే వ్యుత్పత్తిని సమర్థించారు. సమస్త కర్మ బంధములనుండి, క్లేశములనుండి భక్తులను విముక్తులను చేసి ముక్తినిచ్చేవాడు ముకుందుడు. ఇందుకు శ్రీ వి.వి. రామానుజన్ దివ్య ప్రబంధములనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః – గీత 18.66

సర్వ ధర్మములను, అనగా సమస్త కర్తవ్య కర్మలను నాకు సమర్పించి, సర్వ శక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని గావించెదను. నీవు శోకింపకుము.

519. అమితవిక్రమః

- హద్దులు లేని బలపరాక్రమములు కలిగినవాడు (ఆధారశక్తి).
- కొలువజాలని పెద్ద అడుగులుగల త్రివిక్రముడు.

ఓం అమిత విక్రమాయ నమః

ఈ నామము మరల 647వ నామముగా వచ్చును.

55వ శ్లోకము. 519వ నామము. అమితవిక్రమః – **జీవో వినయితా సాక్షీ ముకుందః అమితవిక్రమః**

68వ శ్లోకము. 647వ నామము. అమితవిక్రమః – **అనిరుద్ధః అప్రతిరథః ప్రద్యుమ్నః అమితవిక్రమః**

తేషాం ధ్యానానుసంధేయ తత్వ సందోహ ధారిణీమ్
తాం శక్తి ధృతవాన్యేసా స్మృతో హ్యమిత విక్రమః
భక్తులు పరమేశ్వరుని ధ్యానించేటపుడు వారు అనేకములైన తత్వాలను సంధిస్తుంటారు. వాటన్నింటినీ ఆధారశక్తి అనబడే అపరిమిత బలపరాక్రమాలతో ధరిస్తుంటాడు. భక్తులు తనను ధ్యానించేటపుడు చేసే మంత్ర తంత్ర యోగాలను భరించగల బలవంతుడు అమితవిక్రముడు. (డా. క్రోవి పార్థసారధి రచననుండి).

శ్రీ భట్టుల వ్యాఖ్యప్రకారం శ్రీ భగవానుడు సకల ప్రకృతి తత్వములకు ఆధారశక్తి. **ఆధారశక్తి సంజ్ఞస్య అమృతస్య చ వై విభో** (శ్రీ పౌష్కరము). శ్రీ వి. ఎన్. వేదాంతదేశికుల వివరణ – సకలమును భరించుటకు అపరిమితమైన శక్తి కలిగిన కారణమున భగవానుడు అమితవిక్రముడు.

శ్రీ శంకరులు ఈ నామమునకు రెండు విధములైన వ్యాఖ్యలు చెప్పారు (1) 'విక్రమ' అనగా 'శౌర్యము' అన్న భావంలో (2) 'విక్రమ' అనగా 'పదక్రమము' (నడకలో అడుగు) అన్న భావంలో.

అమితమ్ విక్రమణమ్ శౌర్యమ్ అస్య ఇతి అమిత విక్రమః.

భగవద్గీత (11.40)లో ఈ నామము కీర్తింపబడినది.

నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ

అనంత వీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వ.

అనంత సామర్ధ్యము గలవాడా! నీకు ఎదురుగా ఉండియు, వెనుకనుండియు నమస్కరించుచున్నాను. ఓ సర్వాత్మా! నీకు అన్నివైపులనుండియు నమస్కారములు. ఏలనన అనంత పరాక్రమశాలివై నీవు జగత్తంతటను వ్యాపించియున్నావు. అన్నిరూపములు నీవియే.

అఖిల దేవతలును హరిరూపములు. హరినామములే అన్ని మంత్రములును (అన్నమయ్య)

శ్రీ తిరుక్కళ్ళమ్ శ్రీనృసింహరాఘవాచార్యస్వామి ఈ అమితవిక్రమనామము తులలేని పరాక్రమమును, శౌర్యమును, శక్తిని, బలమును సూచించునని వివరించారు.

శ్రీ శంకరుల రెండవ వివరణ – **అమితా అపరిచ్ఛిన్నా విక్రమాస్త్రయః పాదవిక్షేపా అస్య** – కొలువజాలని మూడడుగులువేసి ముల్లోకములను కొలిచిన శ్రీవామనమూర్తియే అమితవిక్రముడు.

'క్రమ' అనగా 'పదవిక్షేపము' లేదా 'అడుగు' అన్న భావంలోనే శ్రీ సత్యదేవోవాసిష్ఠ కూడా ఈ నామమును వివరించారు. అయితే ఆయన చెప్పిన అర్థం – భగవంతుడు సృష్టి అంతటా తానే వ్యాపించియున్నాడు. భూమ్యాకాశములలోను, సత్వరజస్తమో గుణములలోను, త్రిసంధ్యలయందును – ఇలా సర్వత్ర భగవంతుని విస్తారమున్నది గనుక ఆయన అమితవిక్రముడు (పెద్ద పెద్ద అడుగులతో విస్తరించియున్నవాడు.)

520. అంభోనిధిః

- జలములే నివాసముగా నున్నవాడు (శ్రీ కూర్మావతారము).
- సాగర స్వరూపుడు (**సరసామస్మి సాగరః**)
- అంభువులకు (దేవతలకు, పితరులకు, మానవులకు, అసురులకు) ఆధారము. అంభువులను తనయందు నిలుపుకొన్నవాడు.
- సకల జీవులలో జలరూపమున నిధానమై యున్నవాడు.

ఓం అంభోనిధయే నమః

శ్రీ పరాశరభట్టు 520 నుండి 528 వరకు నామములను శ్రీ కూర్మావతార పరముగా వివరించారు.

ఆధారశక్తి కమఠ స్వరూపేణార్ణవాంభసి
నిధీయతే స్వయం యేన స హ్యంభోనిధి రుచ్యతే

పాతాళాంభసి అఖిల జగదాధార పీఠ నిధీయతే ఇతి అంభోనిధిః – పాతాళలోకము తన పీఠముగా కలిగి జలములలోనుండి సకల జగములను భరించేవాడు అంభోనిధి. ఇందుకు ప్రమాణముగా శ్రీ భట్టులు ఉదాహరించిన మంత్రము – **అనంత బలశక్తయే భువనభృతే కచ్ఛపాత్మనే** – కచ్ఛప స్వరూపుడై భువనములను భరించే అనంత బలశక్తిమూర్తికి ప్రణామములు.

'నిధి' అనగా ప్రోగుచేసిన చోటు, ఆవాసస్థానము. శ్రీ శంకరులు ఈ అర్థములో 'అంభోనిధి' నామమును వ్యాఖ్యానించారు. సకల జలములకు స్థానమైనవాడు గనుక భగవానుడు అంభోనిధి. జలాశయములలో నేను సాగరమును – అని గీత (10.24)లో శ్రీకృష్ణభగవానుడు తెలియజెప్పెను.

శ్రీ శఁకరులు చెప్పిన రెండవ భాష్యము – దేవతలు, పితృదేవతలు, మనుష్యులు, అసురులు - ఈ నలుగురికి కలిపి 'అంభస్సులు' అని పేరు ఉన్నది. ఇందుకు తైత్తరీయ బ్రాహ్మణములోని శృతివాక్యము (2.3.8) ప్రమాణము – **తాని వా ఏతాని చత్వార్యంభసి దేవా మనుష్యాః పితరోఽసురాః**
ఇట్టి అంభస్సులు తనయందు విహితములై యున్నందున శ్రీహరియే అంభోనిధి. ధర్మచక్రము రచయిత దీనిని మరింత వివరించారు. ఈ నాలుగు అంభస్సులు సకల జీవములను నియంత్రించును. కనుక సర్వము భగవానుని నియంత్రణలో ఉన్నది. ఇంకా ప్రళయకాలములో అంతా జలమయమైనపుడు శ్రీకూర్మమూర్తి జీవులను కాపాడును. అనగా సకల కాలములందును సకల జీవరాశులకును ఆధారము శ్రీహరియే.

శ్రీసత్యదేవోవాసిష్ఠ వివరణ – సకల జీవరాశులకును నీరే ప్రాణాధారము. జీవుల రక్తములోను, వృక్షముల నాళములందు నీరే జీవమునకు ఆధారమైయున్నది. అలా శ్రీనివాసుడు నీటిని నిధానముగా చేసియున్నాడు గనుక ఆయన అంభోనిధి. **అపామ్ రేతాంసి జిన్వతి** – అని అధర్వణ వేదంలో తెలుపబడినది.

521. అనంతాత్మా

- అనంతుని ఆత్మ.
- దేశ కాల వస్తు పరిచ్ఛేదములు లేని ఆత్మ. అనంతమైన ఆత్మ.

ఓం అనంతాత్మనే నమః

శ్రీ పరాశర భట్టుల వివరణ – సమస్త జగత్తునకు ఆధారమైన ఆదికూర్మముపైనుండి, జగదాధార స్తంభమైన అనంతునికి ఆత్మ.

కమఠేనోపరి జగదాధార స్తంభ భోగినః

స్వరూపేణ స్థితో యోఽసౌ అనంతాత్మా ప్రకీర్తితః

అనంతస్య ఆత్మా అనంతాత్మా

ఆధారశక్తే రుపరి విమలం దీప్తవిగ్రహమ్

జ్వాలాశ సమాకీర్ణం శంఖ చక్ర గదాధరమ్

అనంతేశమ్ న్యశేత్

ఆధారశక్తి మీద నిర్మలమై ప్రకాశిస్తున్న దివ్య మంగళ స్వరూపుడు, అనేక జ్వాలలతో కూడినవాడు, శంఖ చక్ర గదాధారి అయి ప్రకాశిస్తున్న అనంతేశుని హృదయస్థానంలో స్థాపించాలి – అని జయ సంహితలో చెప్పబడినది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అనంతమైన, తెలియజాలని ఆత్మ. దేశ కాల వస్తు పరిచ్ఛేదములు లేని స్వరూపము గలవాడు. దీనికి శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – సృష్టిలో సకల వస్తువులకు దేశ కాల పరిమితులుంటాయి. ఒక వస్తువు ఒక చోట ఉన్నట్లయితే అదే సమయంలో అది మరొకచోట ఉండలేదు. కాని శ్రీమన్నారాయణునికి ఈ నియమాలు వర్తించవు. కనుక శ్రీహరియే అనంతాత్ముడు. అన్నింటికీ అంతరాత్ముడు. అంతటికీ పరమాత్ముడు.

522. మహోదధిశయః

మహాసాగరమున శయనించినవాడు.

ఓం మహోదధిశయాయ నమః

తస్మిన్ననంత పర్యంకే సముద్రే శయనాచ్చయః
మహోదధిశయః ఖ్యాతో దశార్ణో మనురుత్తమః

మహాసముద్రంలో అనంత శేషపాన్పుపై పవళించినందున శ్రీమన్నారాయణుడు మహోదధిశయనుడు. ఈ నామము దశాక్షరీ మహామంత్రము. ఓం మహోదధిశయాయ నమః.

ఈ భావమును పెరియాళ్వారు తిరుమొళి (5.1.7)నందు, నమ్మాళ్వారు తిరువైమొళి (3.4.9)నందు కీర్తించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము ప్రళయ సమయమున జగం అంతా ఒక సాగరంలో విలీనమౌతుంది. ఆ మహార్ణవంలో శ్రీరంగనాధుడు శయనించాడు.

కరారవిందేన పదావిందం
ముఖారవిందే వినివేశయంతం
వటస్య పత్రస్య పుటేశయానం
బాలం ముకుందం మనసా స్మరామి.

523. అంతకః

సమస్తమును లయము చేయువాడు.

ఓం అంతకాయ నమః

శ్రీ శంకరులు ఈ నామమునకు చెప్పిన వ్యుత్పత్తి – **అంతం కరోతి భూతానామ్ ఇతి అంతకః.**

శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణములు –

అంతే పృథివ్యాం సలిలే దృశ్యతే త్వం మహోరగః (రామాయణము. యుద్ధకాండ 120.23)

కల్పాంతే యస్య వక్త్రేభ్యో విషానల శిఖోజ్వలః
సంకర్షణాత్మకో రుద్రో నిష్క్రమ్య అత్తి జగత్త్రయమ్
కల్పాంతమున అతని నోటినుండి వెలువడే విషజ్వాలలు లోకములను నాశనం చేస్తాయి. అతడే బలరాముడు, రుద్రుడు (సంకర్షణ రూపుడైన రుద్రుడు).

శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వార్ తిరువైమొళి (2.2.6)నుండి ఉదాహరించారు.

శ్రీ చిన్మయానంద – కాలాంత ప్రళయంలో అంతటినీ అంతం చేయడంవల్ల పునఃసృష్టి సాధ్యమవుతుంది. కనుక భగవానుడు అంతకుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః |
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః || (56)

524. అజః

- 'అ'కారము ('అ' అనే అక్షరము) విభూతిధారి.

- జన్మము లేనివాడు.

- భక్తుల చిత్తములందు అంధకారమును పారద్రోలువాడు.

- భక్తుల వెన్నంటి ఉండువాడు.

- హృదయగతికి కారణమైనవాడు.

- కర్మ ఫలములను సదా వర్తింపజేయువాడు.

- సకల వస్తుభూత సముదాయము కలిపిన స్వరూపుడు.

- అంతటా, అన్నింటా ఉండువాడు.

- మన్మథుడు.

ఓం అజాయ నమః

ఈ నామము 96వ, 206వ, మరియు ఇప్పుడు 524వ నామములుగా చెప్పబడినది.

11వ శ్లోకము. 96వ నామము. అజః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః**

22వ శ్లోకము. 206 వ నామము. అజః – **అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా**

11వ శ్లోకము. 524వ నామము. అజః – **అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః**

ఈ మూడు సందర్భాలలోను ఈ పుణ్యనామమునకు శ్రీ భాష్యకారులు చెప్పిన అర్థాలు క్లుప్తంగా ఇలా ఉన్నాయి.

శ్రీ భట్టుల వివరణ –

96. అజః – **క్షిపతి ఇతి అజః** – ముముక్షువుల సాధననుండి విఘ్నములను తొలగించువాడు.

206. అజః – **న జాయతే ఇతి అజః** – పుట్టుక లేనివాడు. స్తంభమునుండి వెలువడిన శ్రీనారసింహుడు.

524. అజః – **అకార వాచ్యతయా జాతః** – 'అ' అను అక్షరముగా తెలియువాడు.

శ్రీ శంకరుల వివరణ –

96. అజః – **అజతి గచ్ఛతి క్షిపతి వా అజః** – భక్తుల హృదయమున ప్రవేశించి చరించువాడు.

206. అజః – **న జాయతే ఇతి అజః** – జన్మము లేనివాడు (ఎప్పుడూ ఉన్నవాడు).

524. అజః – **విష్ణువునకు జన్మించిన మన్మథుడు** *(సరి చూడవలసి ఉన్నది)*

తత్త్వావసాన కాలేన ప్రణవ ప్రకృతి తత్త్వతః

స్మర్తవ్యత్వా దజః ప్రోక్తః షడర్ణో హ్యార్తి నాశకః

ప్రళయకాలంలో అన్ని తత్త్వాలు నశించిపోతాయి. అటువంటి సమయంలో 'ఓం'కారానికి ఆదియైన 'అ'కారముచే చెప్పబడువాడు (ప్రణవంలో అకార, ఉకార, మకారాలున్నాయి). ఈ నామము షడక్షరి. తాపనాశకము. ఓం అజాయ నమః.

అక్షరాణామకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ

అహమేవాక్షయః కాలో ధాతాఽహం విశ్వతోముఖః – గీత 10.33

అక్షరములలో 'అ'కారమును నేను. సమాసములలో 'ద్వంద్వ'సమాసమును నేను. అక్షయకాలము అనగా మహాకాలమును నేను. విశ్వతోముఖుడైన విరాట్ పురుషుడను నేను. అందరిని పోషించువాడను నేను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'అ' విష్ణువును, 'జ' ఉత్పత్తిని సూచించును. అంతా విష్ణువునుండే సంభవించినది గనుక 'అజ' అనగా సకల వస్తు భూత సముదాయము.

మహాభారతం శాంతిపర్వంలో ఇలా ఉంది (341.74).

న హి జాతో న జాయేఽహమ్ న జనిష్యే కదాచన

క్షేత్రజ్ఞః సర్వ భూతానామ్ తస్మాదహం అజః స్మృతః

నేను పూర్వము జన్మించియుండలేదు. ఇప్పుడు జన్మించినవాడను కాను. భవిష్యత్తులో జన్మించను. నేను సర్వభూతములందును క్షేత్రజ్ఞుడను. కనుక నన్ను 'అజుడు' అని యందురు.

525. మహార్హః

పూజింపదగినవాడు.

ఓం మహార్హాయ నమః

స్వరూపాది కృతార్ఘేన తారేణాత్మ నివేదనమ్

మహం పూజాం అర్హతీతి మహార్హ ఇతి కథ్యతే

ఆత్మ జ్ఞాన సముపార్జనకు ఉపయోగించే ప్రణవ స్వరూపంగా ఆత్మను అర్పించడమే 'పూజ' అవుతుంది. అటువంటి పూజకు తగినవాడు మహార్హుడు. **మహమ్ - పూజనమ్ - అర్హతీతి మహార్హః** – 'మహమ్' అనగా 'పూజ'. ఇక్కడ పూజ అనగా 'ఆత్మ సమర్పణము' లేదా 'ప్రపత్తి' అని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు.

ఉపనిషత్తులలోనే 'న్యాసము' లేదా 'భార సమర్పణము' విశిష్టత తెలియజేయబడిందని వివరిస్తూ శ్రీ భట్టులు తైత్తరీయారణ్యకము (21)నుండి ఉదాహరించారు.

బ్రహ్మణే త్వా మహసా ఓం ఇతి ఆత్మానమ్ యుంజీత

ఏతద్వై మహోపనిషదమ్ దేవానామ్ గుహ్యమ్

ప్రణవం ద్వారా పరమాత్మునికి జీవమును సమర్పించుకోవాలి. ప్రణవంలో మొదటిదైన'అ'కారము పరమాత్మ స్వరూపము. చివరిదైన 'మ'కారము జీవాత్మ సూచకము. 'ఓం' అనే మంత్రము ద్వారా నేను నన్ను నీకు సమర్పించుకొంటున్నాను పరబ్రహ్మమా – ఇది దేవతలకు మాత్రమే తెలిసిన రహస్యం. దీనిని మహోపనిషత్తులు మనకు అందజేశాయి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – అన్ని సేవలకంటెను అత్యుత్తమమై ఆత్మనివేదనమే ప్రపత్తి. అట్టి ప్రపత్తి శంఖచక్రగదాధరుడైన శ్రీమన్నారాయణునికి చెందవలెను. ఆయనే మహార్హుడు.

ఆత్మ బోధోపనిషత్తు – ప్రత్యగానంద స్వరూపుడు, ఓంకార రూపుడు అయిన పరమపురుషుడే పరబ్రహ్మ. అకార, ఉకార, మకారముల కలయికే ప్రణవము, ఓంకారము. ఈ ప్రణవాన్ని జపించే బ్రహ్మజ్ఞాని జన్మ సంసార బంధనాలనుండి విముక్తి పొందుతున్నాడు. "ఓం నమో నారాయణాయ శంఖ చక్ర గదా ధరాయ" అనే మంత్రమును జపిస్తున్న ఉపాసకుడు వైకుంఠము పొందుతాడు. పద్మమువంటి బ్రహ్మ పట్టణము తటిల్లతవలె, దీపమువలె ప్రకాశిస్తున్నది. దేవకీపుత్రుడే పరబ్రహ్మ. మధుసూదనుడు. పుండరీకాక్షుడు. విష్ణువు. అచ్యుతుడు. అతడే నారాయణుడు. కారణ పురుషుడు. అతడే "ఓం"కారము. కనుక పరమపదమును పొందగోరేవారు ఓంకారాన్నే అర్చించాలి. అటువంటి అర్చనకు తగినవాడు కాబట్టే శ్రీమన్నారాయణుడు "మహార్హః" అనబడుతున్నాడు. (డా. క్రోవి పార్థసారథి రచన 'శ్రీ కైవల్య సారధి' నుండి).

526. స్వాభావ్యః

- తన సొత్తు అయిన జీవులచే సదా ధ్యానింపతగినవాడు.

- స్వభావపరంగా ప్రభువు.

- స్వభావాత్మకంగా అనాది అయినవాడు.

- అన్నింటా, అంతటా, మినహాయింపు లేకుండా ఉండువాడు.

ఓం స్వాభావ్యాయ నమః

మంత్రేణానే నాత్మభిస్తు స్వభూతైరాభి ముఖ్యతః

అవశ్యం భావనీయత్వాత్ స్వాభావ్యః పరికీర్తితః

తన సొత్తుగా ఉన్న జీవులు ప్రణవ మంత్రాన్ని జపిస్తూ తనను ధ్యానించడానికి తగినవాడు స్వాభావ్యుడు.

స్వభూతైః (ఆత్మభిః) భావనీయత్వాత్ స్వాభావ్యః – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. **స్వభావికత్వేన భావనీయత్వాత్ స్వాభావ్యః** – అని కూడా చెప్పారు. సకల భూతములు శ్రీమహావిష్ణువునకు స్వంతమే. కనుక ఆ జీవులు అన్నీ సహజంగానే ఆయనను ప్రభువుగా ధ్యానించును గనుక భగవంతుడు స్వాభావ్యుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్వభావ్యేన అభావ్యః** – భగవంతుడు పరమోన్నతుడు. పురుషోత్తముడు. మనకు ఆయనను గురించి తెలియకపోవడం, ఆయనకు ఆది లేకపోవడం – ఇవి రెండూ భగవంతుని స్వభావములు కనుక ఆయన స్వాభావ్యుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ **"స్వ-భూ-వ్యాత్"** అనే ధాతువులనుండి పాణిని సూత్రాల ద్వారా (భు=భావ్), అంతటా, అన్నింటా తప్పక ఉండేవాడు స్వాభావ్యుడని వివరించారు.

పోతన భాగవతము

కలడంభోధి కలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులందంతటన్
గలడీశుండు గలండు తండ్రి! వెదుకంగానేల యీ యా యెడన్

శ్రీమన్నారాయణీయము – క్షీరసాగర మధనము

ఉద్భ్రామ్య ద్భహు తిమి-నక్ర-చక్ర వాలే
తత్రాబ్ధౌ చిర మథితేऽపి నిర్వికారే
ఏకస్త్వం కరయుగ కృష్ట సర్పరాజః
సం రాజన్ పవనపురేశ పాహి రోగాత్

ఈ విధంగా చాలాకాలం క్షీరసాగర మధనం జరిగినప్పటికీ సముద్రంలోని తిమింగలాలూ, జలచరాలూ కలత చెందినవేగాని ఆశించిన ఫలితం రాలేదు. అందువలన స్వయంగా నువ్వే నీ రెండుచేతులతో ఆ వాసుకిని పట్టుకొని మధించడం ప్రారంభించావు. అటువంటి ఓ గురువాయూరు దేవా! నా వేదనలను తొలగించి నన్ను రక్షించు.

---

527. జితామిత్రః

- అమిత్రులను జయించినవాడు. తన భక్తులు కామ క్రోధ అహంకార మమకారాదులను జయించడానికి తోడ్పడేవాడు.
- కామక్రోధాదులను జయించినవాడు.
- రావణాది శత్రువులను జయించినవాడు.

ఓం జితామిత్రాయ నమః

ఏతద్రహస్య విజ్ఞాన నిరోధి మమతాదయః
జితాస్తేషా మనేనేత్ జితామిత్రాऽష్ట వర్ణకః
తన భక్తులు ఈ విధమైన రహస్యార్థాలు తెలుసుకోవడానికి వారి అహంకార మమకారములను పోగొట్టేవాడు జితామిత్రుడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. అహంకారాన్ని పోగొడుతుంది. ఓం జితామిత్రాయ నమః.

అమిత్రా జితాః అనేన ఇతి జితామిత్రః – జయింపబడిన అమిత్రులు (శత్రువులు) గలవాడు. ఇక్కడ 'అమిత్రులు' అనగా కామము, అహంకారము, మమకారము వంటి వికార భావములు – అని శ్రీ భట్టులు వివరించారు. భగవానుని స్వరూపజ్ఞానం లభించకుండా భక్తులకు ఈ వికారాలే ఆటంకంగా ఉంటాయి. భగవద్గీతలో (3.37 నుండి 3.43 వరకు) ఇట్టి రజోగుణములే శత్రువులని శ్రీకృష్ణుడు ఉపదేశించాడు.
కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్
రజోగుణంనుండి జనించే కామక్రోధాలు మహాశనములు. ఎంత అనుభవించినా తృప్తి కల్గించవు. పైగా ఇవి మహాపాప కర్మలకు ప్రేరణలవుతాయి. కనుక ఇవి పరమ శత్రువులని తెలిసికొనుము.

భక్తుల సాధనలో ఆటంకాలైన వికార శత్రువులను భగవంతుడు తొలగిస్తాడని చెప్పడానికి
శ్రీ వి.వి. రామానుజన్ దివ్య ప్రబంధములనుండి ఉదాహరించారు (తిరువైమొళి 29.3).

భగవానుని జితామిత్రుడని సంబోధించుటకు శ్రుతులనుండి శ్రీ సత్య దేవో వాసిష్ఠ అనేక ప్రమాణాలు చూపారు.
ద్యుమాగమ్ అమిత్రా దంభనః – ఋగ్వేదము 4.15.4
అమిత్ర సేనామ్ మఘవన్ – అధర్వణ వేదము 3.1.3
అంతే కాకుండా భగవంతుని, ధర్మాన్ని నమ్ముకొన్నవారికి విజయం తథ్యం.

శ్రీ శంకరులు తమ వ్యాఖ్యలో రావణాది శత్రు సంహారం చేయుండవలన కూడా భగవానుడు జితామిత్రుడని తెలిపారు. భగవానుడు స్వయంగా కామక్రోధాదులను జయించినందున జితామిత్రుడు – అనే భావం కూడా చెప్పబడింది.

528. ప్రమోదనః

- భక్తులకు ముదము (ఆనందము) కలిగించువాడు.
- సదానంద స్వరూపుడు.

ఓం ప్రమోదనాయ నమః

ప్రమోదం కరోతి ఇతి ప్రమోదనః – తనను ధ్యానించేవారి మనస్సులను సంతోషంతో నింపివేసేవాడు ప్రమోదనుడు. 'ముదము' అనగా 'హర్షము' అనే భావంలో ఈ నామమును వ్యాఖ్యానిస్తూ శ్రీ భట్టులు దీని ముందు నామమైన 'జితామిత్రః'తో ఇలా అనుసంధానించారు – తమనుండి కామక్రోధాది తమోగుణములు దూరమైనపుడు భక్తులు ప్రమోదితులు అవుతారు. అలా వారిని ఆనందింపజేయువాడు గనుక భగవంతుడు ప్రమోదనుడు.

శ్రీ శంకరులు చెప్పిన అర్థము – భగవతుడు సచ్చిదానంద స్వరూపుడు గనుక ప్రమోదనుడు.

శ్రీ పి.బి. అణ్ణాంగార్ స్వామి, శ్రీ వి.వి. రామానుజన్ వంటి వ్యాఖ్యాతలు ఈ రెండు భావాలను చక్కగా సమన్వయ పరచారు – అహంకార మమకార కామ క్రోధాది శత్రువులనుండి విముక్తులైన కారణంగా భక్తులు సంతోషిస్తారు. వారి సంతోషం కారణంగా భగవంతుడు సంతోషిస్తాడు. బిడ్డల ఆనందం తల్లిదండ్రులకు ముదావహం గదా! ఇలా భక్తులకు ముదం కలుగజేసి, ఆయన స్వయంగా ఆనందం అనుభవిస్తాడు గనుక శ్రీనివాసుడు ప్రమోదనుడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – 'మోదము' అనగా ఐహికములైన ఆనందములు. 'ప్రమోదము' అనగా ఆత్మ సాక్షాత్కారము వలన కలిగే ఆనందము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – కర్మ బంధాల కారణంగా సంప్రాప్తించిన దేహాన్ని వదలడానికి ఎవరూ ఇష్టపడరు. అనగా భగవానుడు జీవులకు ఎంత సంతోషం కలుగజేస్తున్నాడో ఊహింపవచ్చును.

529. ఆనందః

ఆనంద స్వరూపుడు.

ఓం ఆనందాయ నమః

529 నుండి 537 వరకు నామములను భగవానుని కపిలాచార్య అవతారస్తుతి పరముగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

బ్రహ్మ మానస పుత్రుడు కర్దముడు. అతడు విష్ణువును గురించి గొప్ప తపస్సు చేశాడు. శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై కర్దమునికి దేవహూతిని పరిణయమాడమని, ఆ దంపతులకు తాను స్వయముగా కపిలమూర్తిగా జన్మించి సాంఖ్యయోగము తెలియజేస్తానని వరమిచ్చాడు.

స్వాయంభువ మనువు భార్య శతరూప. వారి పుత్రిక పేరు దేవహూతి. స్వాయంభువ మనువు తన భార్య, కుమార్తెలను వెంటబెట్టుకొని కర్దముని దర్శించాడు. తన కుమార్తెను కర్దమునికిచ్చి పెండ్లి చేశాడు. దేవహూతికి కర్దమునివలన తొమ్మిదిమంది కుమార్తెలు, ఒక కుమారుడు కలిగారు. ఆ కుమారుడే కపిలుడు. విష్ణుమూర్తి అంశావతారము. తరువాత కొంత కాలానికి కర్దముడు సన్యాసము స్వీకరించి సాయుజ్యం పొందాడు. కపిలుడు సాంఖ్యదర్శనాన్ని ప్రచారం చేశాడు. ఒకమారు కపిలుడు తన తల్లి దేవహూతికి జ్ఞానోపదేశం చేశాడు. ఆ ఉపదేశానికి 'కపిల దేవహూతి సంవాదము' అని పేరు.

శ్రీమన్నారాయణీయము 14.10

వనమేయుషి కర్దమే ప్రసన్నే
మత సర్వస్వ - ముపదిశన్ జనన్యై
కపిలాత్మక వాయుమనిర్దేశ
త్వరితం త్వం పరిపాహి మాం గదౌఘాత్

కపిలునిగా జన్మించిన ఓ గురువాయూరు దేవా! నీ తండ్రియైన కర్దముడు ప్రసన్నుడై అడవులకేగిన పిదప, సాంఖ్యయోగాన్ని నీ తల్లి దేవహూతికి బోధించావు గదా! నన్ను కూడా జ్ఞానయుతుని కావించి, నా వేదనలను తొలగించు.

వాఙ్మనస దుర్గ్రాహ్యే మహానందః అస్య ఇతి ఆనందః.

వల్ల్యామానంద సంజ్ఞాయాం అవాఙ్మనస గోచరః
ఆనందో యస్స్వయస్యాస్తీ త్యానందః పరికర్తితః

ఆనందవల్లి అనే ఉపనిషత్తునందు చెప్పబడినట్లుగా మనస్సుకు, వాక్కుకు అందని ఆనందమునకు స్వరూపుడు (కలవాడు) కనుక ఆనందుడు.

తైత్తరీయోపనిషత్తులో శిక్షావల్లి, భృగువల్లి, ఆనందవల్లి అనే మూడు భాగాలున్నాయి. విషయవాంఛలవలన కలిగేది క్షణికమైన లౌకికానందము. సత్యము, జ్ఞానము, అనంతము అయిన బ్రహ్మము గురించిన

చింతనవలన కలిగేది బ్రహ్మానందము. ఆనంద స్వరూపుడైన బ్రహ్మను మనము పరిమితమైన మాటల చేతను, మనసు చేతను తెలిసికోవడం అసాధ్యం. మనసుకు, మాటలకు అతీతమైన జ్ఞానంతో మాత్రమే పరబ్రహ్మమును గురించిన ఎఱుక సాధ్యము.

కపిల మూర్తిని గూర్చిన స్తుతికి 'ఆనందః' అనే నామమును చెప్పడానికి కారణాన్ని శ్రీ వి.వి. రామానుజన్ ఇలా వివరించారు. కపిలావతారమూర్తి బంధరహితుడు. కామక్రోధాది బంధములకు అతీతుడైనవాడు. **శ్రోత్రియస్య చ అకామహతస్య** – అని శ్రుతి చెబుతున్నది. అట్టి బ్రహ్మానంద స్వరూపుడే కపిలుడు. ఆనందుడు.

శ్రుతులలో భగవానుని ఆనంద స్వరూపమును గురించి పెక్కు ప్రస్తావనలను శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉదాహరించారు –

ఆనందరూపమ్ అమృతమ్ యద్ విభాతి – ముండకోపనిషత్తు 2.2.7.

ఆనంద ఆత్మా – తైత్తరీయ 2.5

ఆనందో బ్రహ్మ – తైత్తరీయ 3.6

530. నందనః

ఆనందము కలిగించువాడు. నందయతి ఇతి నందనః.

ఓం నందనాయ నమః

గరుడ వాహనులైన లక్ష్మి, విష్ణువు. 1720 కాలపు చిత్రం.



తమానందం యథోక్తాయాం ముక్తౌ ప్రాప్య య స్సదా
ముక్తా నిత్యానందయతే నందన స్స తు కీర్తితః

అటువంటి (ఇంతకుముందు నామంలో చెప్పబడినట్టి) ఆనందాన్ని (బ్రహ్మానందాన్ని) ముక్తులకు ప్రసాదించి వారికి నిత్యానందాన్ని (క్షణికం కాని ఆనందాన్ని) కలిగించేవాడు. ఇంతకు ముందరి నామం (ఆనందః) ప్రకారం భగవంతుడు ఆనంద స్వరూపుడు. ఈ నామం (నందనః) ప్రకారం ఆయన అట్టి బ్రహ్మానందాన్ని ముక్తులకిచ్చి, వారికి ఆనందం కలుగజేసి, తానుకూడా ఆనందిస్తాడు. భగవంతుని సామీప్యము చాలును ఈ పరస్పరానందాన్ని ప్రభవింపజేయడానికి.

శ్రీ శంకరాచార్యులు భజగోవిందంలో ఇలా చెప్పారు –

యోగరతో వా భోగరతో వా సంగరతో వా సంగవిహీనః
యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ.

యోగి అయినా, భోగి అయినా, ఒంటరి అయినా, బంధుమిత్రులతో కలసిఉన్నా గాని పరబ్రహ్మయందు మనసు లగ్నము చేసినవాడు ఆనందిస్తాడు. ఆనందిస్తాడు. ఆనందిస్తాడు. సందేహము లేదు.

531. నందః

ఆనందః

సమస్త సుఖ సంతోష భోగములతో పరిపూర్ణుడైనవాడు.

ఓం నందాయ నమః

ఓం ఆనందాయ నమః

భోగ్యైః భోగోపకరణైః భోగైర్భోక్తృభిరేవచ
తస్మిన్ సమృధ్యతే నిత్యం ఇతి నందః ప్రకీర్తితః
భోగ్యములు, భోగ వస్తువులు, భోగ సాధనములు, భోగముల సమృద్ధిచేత నిత్య పరిపూర్ణుడైనందున భగవానుడు నందుడు. **నందతి అస్మిన్నితి నందః** – ఆనందంలో ఉన్న అపరిమిత భోక్తలచేత, భోగవస్తువులచేత, భోగోపకరణములచేత సమృద్ధుడు.

శ్రీ వి.వి. రామానుజన్ – భగవానుడు సంగరహితుడు. ఆయనకు కావలసింది లేనిది ఏదియును లేదు. సకల ఆనందములు, ఆనంద ఉపకరణములు, ఆనందించేవారు అంతా ఆయనయందే స్థితులైయున్నారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **నందతి సమర్ధంతే అస్మిన్ విశ్వరూపే పురుష ఇతి నందో విష్ణుః** – శ్రీమహావిష్ణువు పూర్ణ పురుషుడు. సకల జీవములు ఆయనయందే ఆనందములు పొందును. కనుక భగవానుడు నందుడు.

శ్రీ శంకరులు **'ఆనందః'** అనే నామమును కూడా (**'నందః'**కు బదులుగా) గ్రహించారు. ఇక్కడ **'ఆనందః'** అనగా – ఇంద్రియ సంబంధములైన సౌఖ్యములేవీ భగవానునకు సంబంధము కలిగియుండవు – అని.

532. సత్యధర్మా

- తన ధర్మమును సత్యముగా (తప్పక) నిర్వర్తించువాడు.
- నిశ్చయంగా శరణాగతులను కాపాడువాడు.
- సకల కళ్యాణగుణములకు నిలయము.
- సత్యము ఆయన ధర్మము. తనను ఆశ్రయించినవారిని సత్యమైన మార్గంలో నడిపించేవాడు.
- జ్ఞాన బల ఐశ్వర్య వీర్య శక్తి తేజములనే షడ్గుణములు పరిపూర్ణముగా గలవాడు.

ఓం సత్యధర్మణే నమః

ఆప్తక్రమా ధాన్యప్రాప్తే రార్జవాత్ సత్యవర్తనః
యస్మాత్ స సత్యధర్మా చ వస్వర్ణ స్సత్యధర్మదః
ఆశ్రితులను మొదటినుండి చివరివరకు ఒకేరీతిగా నడిపించువాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. సత్యధర్మమును ప్రసాదించును. ఓం సత్యధర్మణే నమః.

శ్రీ భట్టుల వివరణ – భక్తుడు భగవంతుని గురించి సేవా ధ్యానాదులు మొదలుపెట్టినప్పటినుండీ మోక్షము సాధించేవరకు వారిని విడువకుండా, క్రమం తప్పకుండా, నిశ్చయంగా వారికి తోడుండి నడిపించేవాడు. సత్యధర్ముడు. సాధు పరిత్రాణత, శరణాగత పరిత్రాణత – ఇవి రెండూ దేవదేవుని ధర్మాలు. వాటిని ఆయన సత్యంగా, నిస్సందేహంగా, నిశ్చయంగా ఆచరిస్తాడు.

శరణాగతి గద్యంలో భగవంతుడు తన గుణాలను (ధర్మాలను) శ్రీ రామానుజులకు ఇలా తెలియజేశాడు.
అనృతమ్ నోక్త పూర్వమ్ న చ వక్ష్యే కదాచన.
రామో ద్విర్నాభి భాషతే

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వ భూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ – రామాయణము

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకమ్ శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః – గీత

శరణాగతులను కాచుట శ్రీరామకృష్ణుని ధర్మము. ఇందులో సందేహం లేదు. తన ధర్మాన్ని ఆయన సత్యముగా నిర్వహించును.

శ్రీ శంకరాచార్యులు ఈ నామమునకు చెప్పిన అర్థము – జ్ఞాన బల ఐశ్వర్య వీర్య శక్తి తేజములనే షడ్గుణములు పరిపూర్ణముగా గలవాడు సత్యధర్ముడు.

శ్రీ చిన్మయానంద – సకల ధర్మములు శ్రీ వాసుదేవునియందు సర్వోత్తమ పరిపూర్ణములై నెలకొనియున్నవి. మరియు ఆత్మ దర్శన యోగమే పరమ ధర్మమని ఉపనిషత్తులలో చెప్పబడినది.

533. త్రివిక్రమః

- మూడు వేదాలలోను విస్తరించియున్నవాడు.
- మూడు అడుగులతో ముల్లోకములలోను విస్తరించియున్నవాడు.
- ముల్లోకములలోను అంతటా వ్యాపించినవాడు.

- మూడు అవస్థలు అతిక్రమించి తురీయావస్థ యందున్నవాడు.

ఓం త్రివిక్రమాయ నమః

శ్రీ భట్టులు హరివంశము (279.50)నుండి చెప్పిన ప్రమాణము –

త్రిరిత్యేవం త్రయో వేదాః కీర్తితః మునిసత్తమైః

క్రమతే తాన్ తథా సర్వాన్ త్రివిక్రమ ఇతిస్మృతః

త్ర-విక్రమ – ఇక్కడ 'త్రి' అనగామూడు వేదములని అర్ధము. ఈ మూడు వేదములందు విస్తరించినందున శ్రీమన్నారాయణుడు త్రివిక్రముడు.

'త్రి' అను పదము మూడు లోకములను సూచించునని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. ముల్లోకములందును విస్తరించినవాడు (అంతటా ఉన్నవాడు) త్రివిక్రముడు.

శ్రీ శంకరులే ఈ నామమును త్రివిక్రముడైన శ్రీవామనావతార పరముగా కూడా వివరించారు. **త్రయో విక్రమః త్రిషు లోకేషు క్రాంతా యస్య స త్రివిక్రమః**.ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన శ్రుతి ప్రమాణము – **త్రీణి పదా విచక్రమే** (తైత్తరీయ బ్రాహ్మణము 2.4.6).

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ముల్లోకములలోను ప్రతి వస్తువునందు వ్యాపించియున్నవాడు త్రివిక్రముడు.

శ్రీ చిన్మయానందగారు పైనున్న హరివంశ శ్లోకమునే మరొక విధంగా వ్యాఖ్యానించారు. 'లోకము' అనగా ఆత్మ అనుభవించే పరిస్థితి (అవస్థ). జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనేవి మూడు అవస్థలు. ఈ మూడింటికి అతీతమైనది తురీయావస్థ. అది పరమాత్మకు సహజస్థితి. త్రివిక్రముడు తెలియవచ్చే లోకము.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః |
త్రిపదస్త్రిదశాధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్ || (57)

534. మహర్షిః

మహర్షిః కపిలాచార్యః

- గొప్ప ఋషి, వేదద్రష్ట.
- గొప్ప ఋషియైన కపిల ముని.

ఓం మహర్షయే నమః

ఓం మహర్షయే కపిలాచార్యాయ నమః

శ్రీ పరాశరభట్టు 'మహర్షిః', 'కపిలాచార్యః' అనేవి రెండు నామములుగా పరిగణించారు. రెండు నామాలనూ కపిలావతార పరంగానే వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు కపిలాచార్యునికి 'మహర్షి' అని వర్ణనగా గ్రహించి 'మహర్షిః కపిలచార్యః' అనే ఒకే నామముగా వ్యాఖ్యానించారు.

కపిల మూర్తిగా భగవానుడు వేదములకు ద్రష్ట అయినందున 'మహర్షి' అని శ్రీ భట్టులు వివరించారు. **ఋషిర్దర్శనాత్** (నిరుక్తి 2.11. శ్రీ సత్యదేవో వాసిష్ఠ) మరియు అన్ని వేదములను పొల్లుపోకుండా పఠించినందున కూడా – **శ్రుతీర్గాద్యాః వక్తేభ్యః ప్రోద్గిరంతరమ్ అతః స్మరేత్** – మహర్షి. శ్రీ భట్టులు శ్వేతాశ్వరోపనిషత్తు (5.2)నుండి కూడా ప్రమాణం చెప్పారు. **ఋషిమ్ ప్రసూతమ్ కపిలం మహాంతమ్.** కపిలుడు

జన్మనుండి మహాముని. **సాంఖ్యస్య వక్తా కపిలః పరమర్షిః స ఉచ్యతే**. సాఖ్య దర్శనము బోధించినందున కపిలుడు మహర్షి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సమస్త వేదములకు ద్రష్టలైన మునులు మహర్షులు. అట్టి మహర్షులో తాను స్వయముగా కపిలాచార్యుడనని శ్రీకృష్ణ భగవానుడు గీత (10.26)లో చెప్పెను.

అశ్వత్థః సర్వ వృక్షాణాం దేవర్షీణాం చ నారదః
గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః

అర్జునా! వృక్షములలో అశ్వత్థ వృక్షమును నేను. దేవఋషులలో నారదుడను. గంధర్వులలో చిత్రరథుడను. సిద్ధులలో కపిలుడను.

దర్శనాలు మొత్తం ఆరు. పాణిని - వ్యాకరణము; జైమిని - పూర్వ మీమాంస; వ్యాసుడు - ఉత్తర మీమాంస; కపిలుడు - సాంఖ్యము; కణాదుడు - వైశేషికము; అక్షపాదుడు - తర్కము.

పాణినిర్జైమినిశ్చైవ వ్యాసశ్చ కపిలశ్చచ
కణాద్యశ్చాక్షపాదశ్చ దర్శనాని షడైవహి.

535. కపిలాచార్యః

కపిల వర్ణము కలిగిన ఆచార్యుడు. కపిలశ్చా సౌ ఆచార్యశ్చ కపిలాచార్యః

ఓం కపిలాచార్యాయ నమః

కపిలశ్చా సౌ ఆచార్యశ్చ ఇతి కపిలాచార్యః. చెట్టుయొక్క లోపలిభాగపు రంగును కపిల వర్ణమంటారు. ఇది పొగలేని జ్వాలయొక్క వర్ణము. కపిలాచార్యుడు ఈ రంగులో ఉండేవాడట. కపిలాచార్యుని స్మరించే మంత్రము – **నిర్ధూమాంగ వర్ణాభమ్ శంఖ పద్మాక్ష సూత్రిణమ్**. పొగ లేకుండా జ్వలించే నిప్పులవంటి వర్ణము కలిగినవాడు, చేతిలో శంఖ, పద్మముల పూసలు ధరించినవాడు. ఈ వర్ణన కపిలుని రంగుకు మాత్రమే కాక ప్రజ్వలించే అతని జ్ఞానమునకు కూడా అన్వయింపవచ్చును. **సంవిత్ ప్రకాశనాయ** – జ్ఞానమును ప్రకాశింపజేసినవాడు కపిలాచార్యుడు.

'ఆచార్య' పదానికి శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన చక్కని నిర్వచనం – **ఆచరతి స్వయం శిష్యేభ్యశ్చ ఆచారం గ్రాహయతి ఇతి ఆచార్యః**. సద్ధర్మమును స్వయముగా ఆచరించేవాడు, తన శిష్యులకు బోధించేవాడు ఆచార్యుడు.

536. కృతజ్ఞః

- తనపట్ల ఒనర్చిన సత్కార్యములను మాత్రమే గుర్తుంచుకొనేవాడు.

- సృష్టికర్త మరియు సృష్టి కూడ అయినవాడు.
- తాను సృజించిన అంతటినీ తెలిసినవాడు.

ఓం కృతజ్ఞాయ నమః

ఈ పుణ్య నామము ఇంతకుముందు 9వ శ్లోకములో 83వ నామముగా కూడ స్మరింపబడినది.

9వ శ్లోకము. 83వ నామము. కృతజ్ఞః – **అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్**

57వ శ్లోకము. 536వ నామము. కృతజ్ఞః – **మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః**

83వ నామము 'కృతజ్ఞః'కు చెప్పిన భావములు –

- నామస్మరణము, శరణాగతి, పూజాది భక్తి కార్యక్రమములచే ప్రసన్నుడై భక్తులను అనుగ్రహించువాడు.
- పత్ర పుష్పాది అల్ప నివేదనలచేతనే సంతుష్టుడై, కామితార్థ మోక్షములను ప్రసాదించువాడు.
- సమస్త ప్రాణుల పుణ్య, అపుణ్య కర్మలనెరిగినవాడు.

ప్రస్తుత 536వ నామము వ్యాఖ్యలో శ్రీ భట్టులు తమ కపిల మహర్షి స్తుతిని కొనసాగించారు. శ్రీ శంకరులు 'కృతమ్-జ్ఞ' అనగా 'చేసినది తెలిసినవాడు' అన్న భావంలో ఈ నామును వివరించారు.

స్వాభి నమ్రత్వ సుకృతం కిమంశుమతాకృతమ్

విదితం యేన కారుణ్యాత్ కృతజ్ఞ సోఽభిధీయతే

అంశుమంతుడు తనకు చేసిన సుకృతము (ప్రణామము, ప్రార్థన) తెలిసికొని కరుణతో అతని పినతండ్రులు (సగర పుత్రులు) తరించే మార్గమును బోధించి రక్షించినవాడు. భూమిపై గంగావతరణమునకు ఈ ఘట్టము నాందీవాక్యము. ఇక్ష్వాకు వంశ చరిత్రలో జరిగిన ఈ కథ – సగరుని యజ్ఞాశ్వాన్ని దొంగిలించి ఇంద్రుడు పాతాళంలో కపిలుని ఆశ్రమంలో ఉంచాడు. అశ్వాన్ని వెదుకుతూ పాతాళాన్ని చేరిన సగరుని కుమారులు అశ్వాన్ని కపిలుడే అపహరించాడని తలచి కపిలునిపై దూషించి, కొట్టబోయారు. కపిలుడు కనులు తెరువగానే సగర పుత్రులు భస్మమయ్యారు. అనంతరం సగరుని మనుమడు అంశుమంతుడు పాతాళం చేరి అశ్వాన్ని కనుగొని కపిలునికి వినమ్రతతో ప్రణామం చేసి ప్రార్థించాడు. కపిలుడు ప్రసన్నుడై, అశ్వాన్ని ఇచ్చి సగరుని పుత్రులు (అంశుమంతుని పినతండ్రులు) తరించే మార్గం తెలిపాడు. **సుకృతమేవ జ్ఞాత్వాన్ ఇతి కృతజ్ఞః** – అని శ్రీ భట్టులు వివరించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారం 'కృతమ్' అనగా భగవంతుని సృష్టి. 'జ్ఞ' అనగా తెలిసినవాడు లేదా ఆత్మ (సృజింపబడనిది). శ్రీహరియే సృష్టి మరియు స్రష్ట గనుక కృతజ్ఞుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **కృతమ్ జ్ఞానాతి ఇతి కృతజ్ఞః** – తన సృష్టి గురించి సమస్తమూ తెలిసినవాడు కృతజ్ఞుడు.

నామరూపాత్మకమైన విశాల విశ్వమునందలి అణువణువునందును నిమిత్త కారణముగాను, ఉపాదాన కారణముగాను వ్యాపించియున్నవాడు పరమాత్ముడు, కృతజ్ఞుడు (శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి).

537. మేదినీపతిః

భూమిని భరించేవాడు, రక్షించేవాడు, భర్త.

ఓం మేదినీపతయే నమః

కాపిలం రూపమాస్థాయ యో ధారయతి మేదినీమ్
స మేదినీ పతి ఖ్యాతో నవార్ణో భూప్రదో మనుః

కపిల రూపము ధరించి భూమిని ధరించినవాడు మేదినీపతి. ఈ నామము నవాక్షరీ మంత్రము. భూమిని ప్రసాదించునది. ఓం మేదినీపతయే నమ.

సృష్టి సమయంలో భూమి జలాంతర్గతమై యుంది. అపుడు బ్రహ్మదేవుని ప్రార్ధనను మన్నించి వాసుదేవుడు శ్రీ యజ్ఞవరాహమూర్తియై భూమిని ఉద్ధరించాడు. కపిలునిగా పాతాళమున ఉండి తన యోగశక్తితో భూమిని నిలుపుతున్నాడు. శ్రీ మద్రామాయణం బాలకాండ (1.40.2)లో ఇలా ఉంది –

యస్యేయం వసుదాస్సర్వే వాసుదేవస్య ధీమతః
కాపిలం రూపమాస్థాయ ధారయత్యనిశం ధరామ్

సమస్త భూమి వాసుదేవునిది. కపిలరూపం ధరించి ఆయన భూమిని ధరించుచున్నాడు.

శ్రీ వి.వి. రామానుజన్ తిరుపైమొళి (8.1.11)నుండి ఉదాహరించారు. **పెరియ అప్పన్, పిరమన్ అప్పన్, ఉరుత్తిర అప్పన్, మునివరక్కు ఉరియ అప్పన్, అమరార్ అప్పన, ఉలగుక్కోర్ తనియప్పన్....**

538. త్రిపదః

- మూడు తత్వములను దర్శించినవాడు (కపిల ముని).
- మూడు శబ్దముల మిశ్రితమైన ప్రణవ స్వరూపమును దాల్చినవాడు.
- మూడు మూపులతో శోభిల్లిన శ్రీవరాహమూర్తి.
- మూడు అడుగులతో సర్వమును జయించిన శ్రీ త్రివిక్రముడు.
- భూత భవిష్యత్ వర్తమానములకు ప్రభువు.

ఓం త్రిపదాయ నమః

మూడు తత్త్వములను దర్శించినవాడు గనుక త్రిపదుడని వివరిస్తూ శ్రీ భట్టులు పేర్కొన్న మూడు తత్త్వములు – ప్రధాన, పురుష, పరమాత్మ తత్త్వములు. వీటినే భోక్త, భాగ్యము, నియంత అని కూడా పేర్కొన్నారు. ఇందుకు విష్ణుధర్మము (63.59)నుండి ఉదాహరించిన శ్లోకము –

సత్త్వానాం ఉపకారాయ ప్రధానం పురుషం పరమ్
దర్శయిష్యామి లోకేషు కాపిలమ్ రూపమాస్థితః

లోక కళ్యాణార్థమై నేను కపిలావతారమును ధరించి, ప్రధాన, పురుష, పరమాత్మ తత్త్వములను బోధించెదను.

ఈ మూడు తత్త్వములూ భగవద్విశేష విభూతులే అని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు. ఒక రూపంలో ఈ లోకాన్ని రక్షిస్తాడు. మరొక రూపంలో లోకాన్ని రక్షించే దేవతలను రక్షిస్తాడు. మరొక రూపంలో లోక బంధాలకు అతీతుడైన శ్రీవైకుంఠనాథుడు.

శ్రీ పరాశరభట్టులే ఈ 'త్రిపదః' నామమునకు మరి రెండు భావాలను చెప్పారు –

ప్రణవే త్రీని వాచ్యాని వాచకాని పదానివాచ – 'అ', 'ఉ', 'మ' కారములచే ఏర్పడిన ప్రణవరూపములో మూడు పదములు కలవాడు త్రిపదుడు.

శ్రీవరాహమూర్తిగా అవతరించినపుడు మూడు మూపులు ధరించినవాడు త్రిపదుడు. **తవైవాహమ్ త్రిక-కుదో వారాహమ్ రూపమాస్థితః** (మహాభారతము. మోక్షపర్వము. 343.63).

వారాహ రూపస్యాస్థానే సదాని కకుదానివా
యస్య సంతి హ్యసౌ నిత్యం త్రిపదః పరికీర్తితః.

శ్రీ శంకరులు ఈ నామమును శ్రీవామనావతారపరంగా వ్యాఖ్యానించారు. తైత్తరీయ బ్రాహ్మణము (2.4.6)లో **'త్రీణి పదా విచక్రమే'** ప్రకారం **'త్రీణి పదాని యస్య సః త్రిపదః'** – అనగా మూడు అడుగులో జగత్తును జయించినవాడు త్రిపదుడు. ఇలా త్రివిక్రముడు మూడడుగులలో ఏమి జయించాడో శ్రీ రాధాకృష్ణశాస్త్రి చక్కగా వివరించారు. మొదటి అడుగుతో శ్రీహరి సకల భువనాలనూ, అనగా మహాబలియొక్క స్థూల సంపదను ఆక్రమించాడు. రెండవ అడుగుతో శ్రీమన్నారాయణుడు మహాబలియొక్క సూక్ష్మ ఐశ్వర్యాలను ఆక్రమించాడు. సూక్ష్మ ఐశ్వర్యాలు అనగా అతడు (మహాబలి) తన సత్కర్మలద్వారా పొందగల స్వర్గాది భాగ్యములను, తరువాత పొందే ఉత్తమ జన్మలను కూడా హరించాడు. మూడవ అడుగుతో శ్రీవాసుదేవుడు మహాబలియొక్క అహంకార మమకారములను భస్మంచేసి పరమపదాన్ని ప్రసాదించాడు.

శ్రీరాధాకృష్ణశాస్త్రి చెప్పిన మరొక భావం – భూతకాలం, వర్తమానం, భవిష్యత్తులలో శ్రీనివాసుని పాదం (అధిపత్యం) ప్రాశిస్తున్నది గనుక ఆయన త్రిపదుడు.

539. త్రిదశాధ్యక్షః

- బ్రహ్మాది దేవతలకు కూడ ఆపదలు సంభవించినపుడు కాపాడువాడు.
- ముప్పైమూడు దేవుళ్ళకు అధిపతి.
- మూడు అవస్థలకు ప్రభువు.
- మూడు గుణములకు ప్రభువు.

ఓం త్రిదశాధ్యక్షాయ నమః

సఖాస్యా త్రిదశాధ్యక్ష బ్రహ్మదేవ ప్రళయాపది. ప్రళయంవంటి ఆపదలు సంభవించినపుడు బ్రహ్మాది దేవతలను కాపాడువాడు – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. ఇక్కడ 'త్రి-దశ' అనగా 'ముప్పై' అనే సంఖ్య '33'ను సూచించేదిగా పరిగణించవచ్చునని ప్రొఫెసర్ శ్రీనివాస రాఘవన్ భావించారు. అష్ట వసువులు (8), ఏకాదశ రుద్రులు (11), ద్వాదశాదిత్యులు (12) మరియు అశ్వినీ దేవతలు (2) – మొత్తం 33 దేవతలు. తిరుప్పావై (20)లో ముప్పదిమూడు దేవతల ప్రస్తావన ఉన్నది. **ముప్పత్తి మూవర్ అమరక్కు మున్ సెన్లు కప్పమ్ తవిర్క్కుమ్ కలి** – లోకములు జలమయమైనపుడు శ్రీమన్నారాయణుడు శ్రీవరాహమూర్తియై భూమిని ఉద్ధరించి బ్రహ్మసృష్టిని సాధ్యం చేశాడు – అని శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించారు.

శ్రీ శంకరాచార్యుల వివరణ – 'త్రి-దశ' – మూడు దశలకు అధిపతి గనుక శ్రీహరి త్రిదశాధ్యక్షుడు. ఇక్కడ మూడు దశలు (1) జాగ్రదవస్థ (2) స్వప్నావస్థ (3) సుషుప్త్యవస్థ.

'త్రి-దశ-అధ్యక్ష' అనే భావాన్ని శ్రీ చిన్మయానంద మరింత విస్తరించి చెప్పారు. మూడు గుణములను, అనగా (1) సత్వగుణము (2) రజోగుణము (3) తమోగుణములను తన అధీనములో ఉంచుకొన్నందున శ్రీమహావిష్ణువే త్రిదశాధ్యక్షుడు.

540. మహాశృంగః

- గొప్పకొమ్ము (శృంగము) కలిగిన శ్రీవరాహమూర్తి.
- గొప్ప కొమ్ము కలిగిన శ్రీమత్స్యావతారమూర్తి.

ఓం మహాశృంగాయ నమః

ఈ పుణ్యనామమును శ్రీ భట్టులు వరాహావతార పరముగాను, శ్రీ శంకరులు మత్స్యావతార పరముగాను వ్యాఖ్యానించారు.

మహీ యస్య చ శృంగాగ్రే మహాశృంగ స కథ్యతే – కోర కొనయందు భూమిని ధరించిన శ్రీమన్నారాయణుడు మహాశృంగుడు. శ్రీమద్రామాయణము యుద్ధకాండ (120.14)లో – **ఏకశృంగో వరాహస్త్వం** – ఒక కొమ్ము కలిగిన శ్రీవరాహమూర్తివి నీవే – అని ఉన్నది. ప్రళయజలాంతర్గతయైన భూమిని శ్రీవరాహమూర్తి తన కొమ్ముతో పైకి ఉద్ధరించెను. అపుడు సరస్సులో ప్రవేశించిన గజరాజు దంతములపై మట్టి అంటుకొన్న పద్మము శోభిల్లినట్లుగా శ్రీవరాహమూర్తి కొమ్ముపై భూమి ప్రకాశించెను (విష్ణుపురాణము 1.4.36). మహోన్నతమైన శ్రీవరహాశృంగముపై చిన్న ఆహారపు తునక అంటుకొన్నట్లుగా ఆయన కొమ్ముపై భూమి ఆసీనయైనది (శ్రీమద్భాగవతము).

శ్రీ శంకరుల వ్యాఖ్య – ప్రళయసాగరంలో సప్తర్షులను, సర్వబీజములను కలిగిన నావను తన కొమ్మునకు సంధించుకొని క్రీడించిన శ్రీమత్స్యావతారమూర్తి మహాశృంగుడు.

హళేబీడులోని శ్రీవరాహమూర్తి శిల్పం.



శ్రీమన్నారాయణీయములో వరాహావతార స్తుతి –

అభ్యుద్ధరన్నథ ధరాం దశనాగ్రలగ్న
ముస్తాంకురాంకిత ఇవాధిక పీవరాత్మా
ఉద్ధూత ఘోర సలిలాజ్జలధే రుధంచన్
క్రీడా వరాహవపురీశ్వర పాహిరోగాత్

ఓ దేవా! మాయావరాహరూపంతో, కల్లోల సముద్రంనుండి సువిశాలమైన భూమితో నువ్వు బయటకు వచ్చే సమయంలో ఆ భూమి నీ కోర పైభాగాన అంటుకొనిన ఒక గడ్డిపరకలా కనబడింది. ఓ క్రీడావరాహధారీ! మహాశృంగా! గురువాయురప్పా! నా వేదనను తొలగించు. ఓం మహాశృంగాయ నమః.

శ్రీమన్నారాయణీయములో మత్స్యావతార స్తుతి –

ఋుషాకృతిం యోజన లక్షదీర్ఘాం దధాన ముచ్చైస్తర తేజసం త్వామ్
నిరీక్ష్య తుష్టా మునయస్త్వదుక్తా త్వత్తుంగ శృంగే తరణిం బబన్ధుః

ఆ ఋుషులు లక్ష యోజనాల విస్తీర్ణంతో, అద్భుత తేజస్సుతో ఒప్పారుతున్న మత్స్యరూపంలోని నిన్ను దర్శించి మహదానందభరితులైనారు. నీ ఆదేశం మేరకు ఆ నావను నీ కొమ్మునకు గట్టిగా కట్టారు.

ఆకృష్ట నౌకో మునిమండలాయ ప్రదర్శయన విశ్వ జగద్విభాగాన్
సంస్తూయమానో నృవరేణ తేన జ్ఞానం పరం చోపదిశన్నచారీః

ఆ జలరాశిమీదుగా నావను లాగుకొనిపోతూ ఆ ముని బృందానికి లోకంలోని అన్ని ప్రాంతాలనూ చూపించావు. రాజర్షియైన ఆ సత్యవ్రతుడు నిన్ను స్తుతించసాగాడు. ఆ ప్రళయజలాల్లో అలా సంచరిస్తూనే నువ్వు అతడికి ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించావు.

కల్పావధౌ సప్తమునీన్ పురోవత్ ప్రస్థాప్య సత్యవ్రత భూమి పం తమ్

వైవస్వతాఖ్యం మనుమా దధానః క్రోధాద్ధయగ్రీవ-మభిద్రుతోఽభూః

ప్రళయం ముగియగానే సప్తర్షులను మళ్ళీ వారి యథాస్థానాలలో నియమించి, సత్యవ్రతుని వైవస్వతుడనే మనువుగా నియుక్తుడిని చేశావు. ఆ తరువాత (అంతకు క్రితం బ్రహ్మ ముఖాలనుండి వేదాలను అపహరించిన) హయగ్రీవుడనే అసురునిపై ఆగ్రహోదగ్రుడవై దండెత్తావు.

స్వతుంగ శృంగ-క్షత వక్షసం తం నిపాత్య దైత్యం నిగమాన్ గృహీత్వా

విరించయే ప్రీత హృదే దదానః ప్రభంజనాగారపతేః ప్రపాయాః

ఆ విధంగా రాక్షసునితో యుద్ధం చేసి అతడి వక్షస్థలాన్ని నీ కొమ్ముతో చీల్చి, వేదాలను గ్రహించి, బ్రహ్మకు తిరిగి ఇచ్చి, ఆయనను ఆనందభరితుడిని చేసిన ఓ గురువాయూరు దేవా! ప్రసన్నుడవై నన్ను రక్షించు. ఓం మహాశృంగాయ నమః

541. కృతాంతకృత్

- హిరణ్యాక్షుని సంహరించినవాడు.
- మరణమును అంతము చేయువాడు.
- కృతాంతమును (సిద్ధాంతమును) ప్రకటించినవాడు.
- కార్యరూపమైన (వ్యక్తమైన) జగమును ప్రళయమున అంతము చేయువాడు.

ఓం కృతాంతకృతే నమః

అంతకాభం హిరణ్యాక్షం కృత్తవాఽన్యః కృతాంతకృత్

స్వ సిద్ధాంత కరత్వాద్వా స్వాఖ్య స్మృతి పురాణయోః

కృతాంతకృదితి ఖ్యాతో వస్వర్ణోఽభీష్ట దాయకః

మహాభయంకరుడైన హిరణ్యాక్షుని సంహరించినవాడు. వరాహస్మృతి, వరాహ పురాణాలతో తన సిద్ధాంతమును ప్రకటించినవాడు కృతాంతకృత్. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. భక్తుల కోరికలను తీరుస్తుంది. ఓం కృతాంతకృతే నమః

ఈ నామమును వివరిస్తూ శ్రీ భాష్యకారులు ఇలా చెప్పారు –

శ్రీ భట్టులు – **కృతాన్తమ్ కృత్వాన్ ఇతి కృతాన్తకృత్**

శ్రీ శంకరులు – **కృతాన్తమ్ మృత్యుమ్ కృన్తతి ఇతి కృతాన్తకృత్**

ఇద్దరూ చెప్పిన వ్యాఖ్యలకు ఒకేవిధమైన అర్థమును తీసికొనవచ్చును. 'కృతాంతుడు' అనగా యముడు. శ్రీ శంకరులు ఈ అర్థాన్ని యథాతథంగా గ్రహించి, మృత్యువును కూడా అంతము చేయువాడు 'కృతాంతకృత్' అని వివరించారు. సమస్తమును లయం చేసేటపుడు మృత్యుదేవత కూడా లయమౌతుందని ఒక భావం.

శ్రీవాసుదేవుని శరణాగతులైనవారు జనన మరణ చక్రమును అధిగమించి మృత్యుంజయులౌతారని కూడా చెప్పవచ్చును.

శ్రీ భట్టులు చెప్పిన అర్థం – యమునివలె భీకరుడైన హిరణ్యాక్షుని సంహరించిన శ్రీవరాహమూర్తి కృతాన్తకృత్.

శ్రీ భట్టులు మరొక అర్థం కూడా చెప్పారు. 'కృతాంతము' అనగా సిద్ధాంతము. తనకు శరణాగతులైనవారిని తాను కరుణించి బ్రోచెదనన్న సిద్ధాంతమును ప్రకటించిన శ్రీహరి కృతాంతకృత్. ఇందుకు
శ్రీ వి.వి. రామానుజన్ తిరుమంగయాళ్వారు పెరియతిరుమోళి (2.6.3)నుడి ఉదారించారు – శ్రీ వరాహావతారము జ్ఞానస్వరూపము.

శ్రీ శంకరులు కూడా మరొక అర్థాన్ని చెప్పారు – **కృత అంత కృత్ – కృతస్య అంతమ్ సంహారమ్ కరోతి ఇతి కృతాన్తకృత్** – కృతమైన జగత్తును అంతము చేయువాడు కృతాన్తకృత్.

ధర్మచక్రము రచయిత – రైతు తన పంటను చివరికి నరికివేయడం ద్వారా అందరికీ మంచే చేస్తాడు. అలాగే శ్రీమన్నారాయణుడు తను సృజించిన లోకాలను తానే లయం చేసి జీవులకు మేలు చేస్తాడు.
ఓం కృతాంతకృతే నమః

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ |
గుహ్యో గభీరో గహనో గుప్తశ్చక్రగదాధరః || (58)

542. మహావరాహః

గొప్ప వరాహ అవతారమును ధరించినవాడు

ఓం మహావరాహాయ నమః

తూర్పు యడవల్లిలో శ్రీవరాహమూర్తి శిల్పం.

రసాతల గతాముర్వీం యశ్చోద్ధృత్యోత్థితః క్షణాత్
మహావరాహ ఇతినః స్మృతోహ్యుర్వీప్రదో మనుః

పాతాళానికి క్రుంగిపోయిన భూమిని తన కోరతో ఎత్తి లేపినవాడు మహావరాహమూర్తి.

శ్రీ భట్టులు విష్ణుపురాణంనుండి శ్రీ వరాహమూర్తి సౌందర్యాన్ని ఉట్టంకించారు (1.4.26) –

తతః సముత్క్షిప్య ధరాం స్వదంష్ట్రయా
మహావరాహః స్ఫుటపద్మలోచనః
రసాతలాత్ ఉత్పలపత్ర సన్నిభః
సముత్థితో నీల ఇవాచలో మహాన్

పద్మలోచనుడై ప్రకాశించుచున్న శ్రీమహావరాహమూర్తి రసాతలమునుండి తన దంష్ట్రతో తామరాకును ఎత్తినట్లుగా ధరను పైకి లేవనెత్తెను. అలా భూదేవిని సముద్ధరించిన ఆ స్వామి గొప్ప నీలిరంగు కొండవలెనుండెను.

శ్రీ వరాహమూర్తి సౌందర్యము 'తిరుచ్చంద విరుత్తమ్' (45)లో కూడా వర్ణింపబడినది. శ్రీ చిన్మయానంద ఇంకా ఇలా చెప్పారు – ప్రళయకాలంలో అంతా జలమయమైంది. అనంతరం ఆ జలాలు తగ్గినపుడు ఏర్పడిన బురదనుండి భూమిని బయటకు తీయడంకొఱకు శ్రీమన్నారాయణుడు శ్రీవరాహావతారమును ధరించాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన అర్థము. మహా-వర-ఆహ = గొప్ప వరములు ప్రసాదించువాడు.

బ్రహ్మపురాణంలో యజ్ఞవరాహాన్ని గురించి బ్రహ్మ స్తుతి –

యోఽసౌ చార్ణవ మధ్యస్థో నష్టే స్థావర జంగమే
నష్టే దేవాసురనరే ప్రనష్టోరుగ రాక్షసే
యోద్ధుకామౌ దురాధర్షౌ తావు భౌ మధుకైటభౌ
హతౌ భగవతా తేన తయోర్దత్వాఽమితం వరమ్

....

పురాణం కథ్యతే యత్ర దేవ శ్రుతి సమాహితమ్
వారాహస్తు శ్రుతిముఖః ప్రాదుర్భావో మహాత్మనః
యత్ర విష్ణుః సురశ్రేష్ఠో వారాహం రూపమాస్థితః
వేదపాదో యూపదంష్ట్రః క్రతుహస్తోఽశ్వినీ ముఖః
అగ్ని జిహ్వో దర్భ రోమా బ్రహ్మ శీర్షో మహాతపాః

....

నానా ఛందోగతి పథో గుహ్యోపనిషదాసనః
ఛాయా పత్నీ సహాయోఽసౌ మణిశృంగ ఇవోత్థితః
మహీం సాగర పర్యంతా స శైలవనకాననామ్
ఏకార్ణవ జలభ్రష్టా మేకార్ణవ గతః ప్రభుః
దంష్ట్రయా యః సముద్ధృత్య లోకానాం హితకామ్యయా
సహస్ర శీర్షో లోకాదిశ్చకార జగతీం పునః
ఏవం యజ్ఞ వరాహేణ భూత్వా భూతహితార్థినా
ఉద్ధృతా పృథ్వీ దేవీ సాగరాంబుధరాపురా

ఈ రకంగా యజ్ఞవరాహమూర్తి ఏకార్ణవమున మునిగిపోయిన భూమిని తన కోరలతో ఎత్తిపట్టి రక్షించాడు.

ఓం మహావరాహాయ నమః

543. గోవిందః

(1) దేవతలచే ప్రస్తుతింపబడిన దేవదేవుడు.

(2) ప్రళయ జలాంతర్గతయైన భూమిని పైకి ఉద్ధరించినవాడు.

(3) గోవులను కాచేటి గోపాలుడు.

(4) వేదములను ప్రసాదించినవాడు.

(5) భూమిని (రాక్షసులనుండి?) రక్షించినవాడు.

(6) వేదవాక్కులద్వారా తెలియదగినవాడు.

(7) సకల చైతన్యము (చలనము)నకు కారకుడు.

ఓం గోవిందాయ నమః

ఈ పుణ్యనామము 20వ శ్లోకములోకూడా ప్రస్తుతింపబడినది.

20వ శ్లోకము. 189వ నామము. గోవిందః – **అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాం పతిః**

58వ శ్లోకము. 543వ నామము. గోవిందః – **మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ**

భక్తులందరూ ఇతనిని అనేకవిధాలుగా స్తుతించి ఆయన అనుగ్రహం సంపాదిస్తారు గనుక శ్రీహరిని 'గోవిందుడు' అంటారు. ప్రస్తుత శ్లోక వివరణ సందర్భములో శ్రీ భట్టులు (5)వ భావమును తెలిపియున్నారు. రాక్షసులనుండి భూమిని కాపాడినవాడు గోవిందుడు. ఇది (1)వ భావమునకు కొంచెం మార్పుగా భావింపవచ్చును. **నష్టాం చ ధరణీం పూర్వం గోవిందో య స్స లబ్ధవాన్.**

శ్రీ శంకరులు ఈ నామవివరణకు (6)వ భావమును చెప్పారు. **గోభిః వాణిభిః విందతే** – వేదవాక్యములద్వారా తెలియవచ్చువాడు గోవిందుడు. ఇందుకు ప్రమాణము విష్ణుతిలకమునుండి చెప్పారు – **గోభిరేవ యతో వేద్యో గోవిందః సముదాహృతః** – శృతివాక్యములద్వారా తెలియనగువాడవు గనుక నీవు గోవిందుడవు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు (7)వ అర్థమును ఇలా తెలిపారు – **గామ్-గతౌ** – **గచ్ఛతి ఇతి గతౌ** – కదులునది; **విద్-లాభే** – ప్రాప్తించుట. కనుక **గామ్-విద్** – **గోవిందః** – చలించువానికన్నింటికి అధిపత్యము (స్వంతము) కలిగినవాడు. ఇక్కడ చలనము అనగా సమస్త చైతన్యమును సూచించును. అట్టి చేతనత అంతయు గోవిందుడే. ఇదే భావము 'గోవిదాంపతిః' నామమునకు కూడ చెప్పారు.

544. సుషేణః

- శుద్ధసత్త్వమయములైన పంచమహాశక్తులు శరీరముగా కలిగినవాడు.
- శోభనములైన సైన్యములు కలిగినవాడు.

ఓం సుషేణాయ నమః

శ్రీ వి.ఎన్. వేదాంతదేశికులు ఇలా చెప్పారు – ఈ నామము మొదలుకొని గుహ్యములైన, సామాన్య జ్ఞానమునకు అతీతమైన కొన్ని భావములు సూచితములు. వానిని ఆచార్యుల అనుగ్రహము చేతనే తెలిసికొనవలసియున్నదిగాని అవి గ్రంథరూపములుగా లభించవు. కనుక పుస్తక రూపములలో తెలిసే వివరణలు గూఢార్థములతో ఉండియుండును.

ఇంకా శ్రీ వి.వి. రామానుజన్ ఇలా సెలవిచ్చారు – శ్రీరాముని తనతో అడవులకు యాగరక్షణార్థము పంపమని విశ్వామిత్రుడు దశరథుని సమ్మతింపజేసే ప్రయత్న సందర్భంలో **'అహం వేద్మి'** అన్నాడు. అనగా రాజు అయిన దశరథునికి తెలియని శ్రీరామశక్తి రాజర్షి అయిన తనకు తెలుసునని అన్నమాట. ఈ నామము, తరువాత వచ్చే మరికొన్ని నామములు విశ్వామిత్రుడు **'అహం వేద్మి'** (నాకు తెలియును) అని దేనిని గురించి అన్నాడో ఆ విషయాలకు సంబంధించినవి.

శ్రీ భట్టులు 'సుషేణ' నామును 'సు-సేన' అనగా 'మంచి సైన్యము కలిగినవాడు' అన్న భావములో వివరించారు. భగవానుడు శుద్ధసత్త్వ శరీర స్వరూపుడు. ఈ శుద్ధ సత్త్వములే శ్రీనివాసుని శుభకరములైన సైన్యములు. ఆ మంగళ సైన్యమే బద్ధులను, ముక్తులను, నిత్యులను జయించి పరమానందమును విజయముగా పంచియిచ్చును. మానవ శరీరము పంచభూతమయమైనట్లుగానే భగవానుని శరీరమునందలి శుద్ధసత్త్వములు – పంచహాశక్తులు – **పరమేష్ఠి, ప్రమాన్, విశ్వః, నివృత్తః, సర్వః** అనునవి. ఈ పంచహాశక్తులను ఉపనిషత్తుల ద్వారానే తెలిసికొనడం సాధ్యమవుతుంది. కనుకనే వీనిని పంచోపనిషత్తుమయములు అని కూడా అంటారు. అట్టి పంచమహాశక్తులు లేదా పంచోపనిషద్మయ ద్రవ్యములే శ్రీమహావిష్ణువుయొక్క 'సు-సేన'. కనుక ఆ దేవదేవుడు 'సు-షేణుడు'.

శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి – భగవంతుడు తన భక్తులను వశపరచుకోవడానికి బహువిధములైన సైన్యములను (ఉపాయములను, ఉపకరణములను) కలిగియున్నాడు గనుక సుషేణుడు.

తిరువైమోళి (3.1.9)లో శ్రీ నమ్మాళ్వారు భగవంతుని గుణములే ఆయన బలములు (సైన్యములు) అని చెప్పినారని శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించారు. భగవానుని దివ్యలీలావిశేషములే ఆయన సేనలు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – మహోజ్వలములైన సైన్యమునకు అధిపతి గనుక శ్రీహరి సుషేణుడు. ఈ సైన్యము గురించి శ్రీ రాధాకృష్ణశాస్త్రి 9 గణములుగా ఇలా చెప్పారు – 12 ఆదిత్యులు, 10 విశ్వేదేవతలు, 8 వసువులు, 26 తుషితులు, 64 అభాస్వరులు, 49 మరుత్తులు, 30 మహారాజికులు, 12 సాధ్యులు, 11 రుద్రులు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమును 'సి-బంధనే-బంధించుట' అన్న ధాతువు ఆధారంగా వివరించారు. అన్నింటినీ చక్కగా బంధించేవాడు (కూర్చేవాడు) సుషేణుడు. శరీరమును, ప్రాణమును, గుణములను భగవంతుడే బంధిస్తున్నాడు. ఇందుకు శృతిప్రమాణములు (యజుర్వేదము) –

అయముపర్వాగ్ వసుస్తస్య సేన జీచా సుషేణశ్చ (15.19)

సత్య జిచ్చ సేన జిచ్చ సుషేణశ్చ (17.83)

545. కనకాంగదీ

- బంగారు భుజకీర్తులు, హస్తాభరణములతో నొప్పువాడు.
- దివ్యమైన కంకణములు, ఆభరణములు ధరించినవాడు.

ఓం కనకాంగదయే నమః

ఓం కనకాంగదినే నమః

కనకాని అంగదాని అస్య సంతీతి కనకాంగదీ. బంగారముతో చేసిన ఆభరణములు గలవాడు కనకాంగది. 'కనకము' అనగా బంగారము. కాని ఇక్కడ బంగారము అనగా లోహము అని కాక దివ్యమైన, శుద్ధ సత్వ తేజోమయములైన ఆభరణములు అని గ్రహింపవలెను. 'అంగదములు' అనగా సకల తిరు ఆభరణములు.

అప్రాకృతాని దివ్యాని భూషణాని నిత్యశః

రత్నానివంతి యస్యాऽసౌ నోచ్యతే కనకాంగదీ

'అంతరాదిత్య'లో భగవానుని సువర్ణతేజోమయునిగా వర్ణించారు. **అంతరాదిత్యే హిరణ్మయః పురుషః దృశ్యతే.** శ్రీ నమ్మాళువారు తిరువిరత్తమ్ లో ఇలా వర్ణించారు – **మాణిక్కమే! ఎన్ మరకతమే! మట్ఱొప్పారియల్లా ఆనిప్పొన్నే!**

శ్రీ భట్టులు ఇంకా ఇలా చెప్పారు. **నిత్యయోగే ఇనిః.** ఈ నామము చివరిలో ఉన్న 'ఇణీ' ద్వారా భగవానుని 'తిరుమెణి' యొక్క ప్రకాశము సూచితమైనది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – కనక-అంగ-ద – కనక-ప్రకాశము; అంగ-చలనము (చైతన్యము); ద-ఇచ్చువాడు. అందరికీ ప్రకాశమానమైన చైతన్యము ప్రసాదించువాడు కనకాంగది.

546. గుహ్యః

- తెలియరానివాడు. రహస్యముగానుండు శుద్ధసత్త్వమూర్తి.
- అతి రహస్యములైన ఉపనిషత్తులద్వారానే తెలియవచ్చువాడు.
- హృదయమనెడు గుహయందు రహస్యముగానున్నవాడు.

ఓం గుహ్యాయ నమః

శుద్ధసత్వ దివ్య శరీరధారియైనందున శ్రీహరిని ఎవ్వరును కనుగొనలేరు. ఆయనది పాంచభౌతిక దేహము కాదు. దివ్యాత్మ స్వరూపము. కనుక (ఉపనిషత్తుల జ్ఞానము లేనివారికి) అది గుహ్యము. నమ్మాళ్వారు తిరువైమొళి (3.4.9)లో ఇలా అన్నారు – జగములన్నింటినీ మ్రింగివేసి వాటిని మరల సృజించిన ఈ ఎంపెరుమాన్ స్వభావం నాకు తెలియరావడంలేదు.

శ్రీ శంకరులు ఈ నామానికి రెండు భావాలు చెప్పారు –

1. **రహస్య ఉపనిషద్వేద్యతాత్.** ఉపనిషత్తులలోని రహస్యవాక్యములద్వారా తెలియవచ్చువాడు.
2. **గుహాయాం హృదయాకాశే నిహిత ఇతి వా**. హృదయము అనెడి గుహాంతరమున ఉన్నందున.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – పంచేంద్రియముల అనుభూతి ద్వారా శ్రీ వాసుదేవుని తెలిసికొనుట అసాధ్యము. భక్తియుతమైన ధ్యానయోగాదులద్వారా ఆయన కానవచ్చును. అంతే కాకుండా ఒకరు మరొకరికి శ్రీనివాసుని చూపుట జరుగదు. ఎవరికివారే హృదయాంతరాళంలో పరిశోధించి ఆయనను తెలిసికొనే ప్రయత్నం చేయాలి.

ఇతరులకు నినునెరుగ తరమా ఇందిరా రమణా! (అన్నమయ్య)

547. గభీరః

తెలియరాని, అందరాని మహాగాంభీర్యము కలవాడు.

ఓం గభీరాయ నమః

మహాగాంభీర్య యుక్తత్వాత్ గభీర ఇతి కథ్యతే. మిక్కిలి లోతైన, స్వచ్ఛమైన నీరు అసలు లోతులేనట్లు కనిపించును. అలాగే భగవానుని శుద్ధషడ్గుణ పరిపూర్ణత్వము కారణముగా – జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సుల సంపూర్ణత వలన – ఆయన ఎంతటివాడో తెలిసికొనుట అసాధ్యం. ఏ విధమైన ఇతర పదార్థములు లేని స్వచ్ఛమైన ఆకాశం ఎంత దూరం విస్తరించి ఉందో అంచనా వేయడం అసాధ్యం కదా!

ఒక్కమారు శ్రీమన్నారాయణుని ధ్యానించినంతనే జన్మ జన్మాంతర పాపములు పటాపంచలవుతాయి. తరింపరానిదని అనిపించే సంసారబంధనంనుండి ముక్తి లభిస్తుంది. చిన్న స్పర్శతో మహాసాగరంలోని నీరంతా ఒక్కమారు స్వచ్ఛమయినట్లయితే అటువంటి స్పర్శనొసగేవాని గాంభీర్యము ఊహించతరమా!

శ్రీరామచంద్రా, సీతారామా, గోవిందా, గోపాలా, గురువాయురప్పా, వెంకటరమణా, శ్రీనివాసా, శ్రీవరాహమూర్తీ, త్రివిక్రమా, లక్ష్మీనారసింహా, గభీరా నమోనమః

548. గహనః

- దురవగాహ్యమైన, దుష్ప్రవేశ్యమైన వాడు. తెలియరానివాడు, చొరరానివాడు, చేరరానివాడు.
- అన్నింటినీ అవలోకించుచున్నవాడు.

ఓం గహనాయ నమః

ఈ నామము 384వ నామముగా 41వ శ్లోకములోకూడ చెప్పబడినది.

41వ శ్లోకము. 384వ నామము. గహనః – **కరణమ్ కారణమ్ కర్తా వికర్తా గహనో గుహః**

58వ శ్లోకము. 548వ నామము. గహనః – **గుహ్యో గభీరో గహనో గుప్తః చక్రగదాధరః**

ఈ రెండు చోట్లా (384వ, 548వ నామములకు) చెప్పిన అర్థాలు ఇంచుమించు ఒకే భావంతో ఉన్నాయి. 'గహనము' అనగా 'అడవి' లేదా 'కోట' వంటిది. వాటిలో ప్రవేశించుట కష్టము. భగవానుని తత్వము కూడా అలాంటిదే. అమరకోశం వ్యాఖ్యంలో శ్రీ అప్పయార్య **'గహనమ్ దుష్ప్రవేశ స్థానమ్'** అని చెప్పారు. ఈ నామాన్ని వివరిస్తూ శ్రీ భట్టులు 'దురవగాహ్యత' అనే పదాన్ని, శ్రీ శంకరులు 'దుష్ప్రవేశత్వము' అనే పదాన్ని వాడారు. రెండూ ఇంచుమించు ఒకే భావాన్ని సూచిస్తున్నాయి.

సముద్రంలో స్వచ్ఛమైన నీరు ఉంటే గనుక, దాని అడుగు స్పష్టంగా కనుపించవచ్చును గాని, అక్కడికి చేరడం సులభం కాదు. భగవంతుడు **'అప్రాప్య మనసా సహ'** అని శ్రుతివాక్యము. ఉపనిషత్తులు ఎంత వివరంగా తెలిపినాగాని శ్రీనివాసుని తత్వము మనకు తెలియరాదు. శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళవిగ్రహము కనులపండువుగా ఎదుటనున్నాగాని ఆయనపై మనసు నిలువదు. ఉండేది రాముడొకడేయని భక్తులు సెలవిచ్చినాగాని చిత్తము మోక్షకామి గాదు. ఎందుకంటే శ్రీమన్నారాయణుడు గహనుడు.

'గహనః' శబ్దమునకు మరొక అర్థము – 'గాహూ - విలోడనే - లోపలికి మునిగి చేరుట'. అన్న మూలమునుండి చెప్పబడింది. శ్రీవాసుదేవుడు మూడు అవస్థలందును (జాగ్రత్, స్వప్న, సుషుమ్న స్థితులు) మనతోనే ఉండి సకలమును చూచుచుండును (శ్రీ శంకరులు). కాని ఆయనను చేరుకోవడం మనకు సాధ్యం కాదు.

549. గుప్తః

- గోప్యముగానున్నవాడు.
- మనసునకు, మాటలకు అగోచరుడు.

ఓం గుప్తాయ నమః

'గుప్-రక్షణే' – అన్న ధాతువునుండి – గోప్యముగానున్నవాడు. అనగా అందుబాటులో లేకుండ కావలివారిచే రక్షింపబడుచున్నవాడు గుప్తుడు. **అన్యైః దురవబోధో యః గుప్త ఇత్యభిధీయతే.** అయనగురించి ఇతరులెరుగరు. ఆయన తత్వమెరిగిన పూజ్యులైన పూర్వాచార్యులు అట్టి జ్ఞానమును గోప్యముగానుంచిరి. భక్తితో, శ్రద్ధతో వారికి ప్రపత్తి చేసి, అట్టి పూర్వాచార్యుల అనుగ్రహముతో శ్రీవాసుదేవుని గురించి తెలిసికొననగును – అని శ్రీ భట్టులు వివరించారు. ఉపనిషత్తులు కూడా ఆయనను పూర్తిగా తెలుపలేవు. **అహం వేద్మి మహాత్మానం** – అన్న విశ్వామిత్రునివంటివారు శ్రీరాముని తత్వమునెఱుగుదురు. **ఇతరులకు నినునెఱుగ తరమా ఇందిరా రమణా!.**

మరొక విధముగా – అనంతుడు, విష్వక్సేనుడు, గరుత్మంతుడు వంటి శ్రీవారి సేవకులు అయనను సదా పరివేష్టించియుండగా శ్రీనివాసుని సన్నిధి లభించుట సులభము కాదు. కనుక ఆయన గుప్తముగా నున్నవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అవాఙ్మానస అగోచరత్వాత్ గుప్తః**. అంతా శ్రీమహావిష్ణువే అయినా ఆయన ఉనికి తెలియరాదు. **ఏష సర్వేషు భూతేషు గూఢః ఆత్మా న ప్రకాశతే** – అని కఠోపనిషత్తు (3.12)లో ఉంది. **యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ** – అని తైత్తరీయోపనిషత్తు బ్రహ్మవల్లి (4)లో ఉంది.

నాహం ప్రకాశ సర్వస్య యోగమాయా సమావృతః

మూఢోఽయం నాభిజానాతి లోకో మామజ మవ్యయమ్ – గీత

నా యోగమాయయందు దాగియున్న నేను అందరికిని గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు.

550. చక్రగదాధరః

చక్ర గదాది దివ్యాయుధములను ధరించినవాడు.

ఓం చక్రగదాధరాయ నమః

యశ్శక్తిమద్దీప్యహేతిః సస్యాః చక్రగదాధరః – సామర్ధ్యముగల చక్రము, గద మొదలగు దివ్యాయుధములను ధరించినవాడు చక్రగదాధరుడు. దివ్య భూషణములు ధరించినట్లే, దివ్యాయుధములను ధరించినవాడు

శంఖచక్రగదాధరుడు. ఈ నామము యుద్ధకాండము (114)లో చెప్పబడినది. **తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః**

మనస్తత్త్వాత్మకం చక్రం బుద్ధి తత్త్వాత్మకం గదాం
ధారయన్ లోకరక్షణార్ధముక్తశ్చక్రగదాధరః
మనస్సు తత్వముగల చక్రమును, బుద్ధి తత్వము గల గదను లోకరక్షణ కొఱకు ధరించినవాడు చక్రగదాధరుడు.

ఈ పుణ్యనామమునకు సామాన్యమైన అర్థము – చక్రమును, గదను ధరించినవాడు. అయితే పంచమహాయుధములను మరింత లోతుగా అర్థం చేసుకోవాలని శ్రీ ఎమ్.వి. రామానుజాచార్య వివరించారు. ఇవి సృష్టి, స్థితి, సంహారము, నిగ్రహము, అనుగ్రహము అనే ఐదు మహాశక్తుల మూర్తీభవించిన రూపములు. ఈ పంచాయుధములు పంచమహాకృత్యములను నిర్వహించే ఉపకరణములు. ఇంకా శ్రీ వి.వి. రామానుజన్ ఇల చెప్పారు – ఈ పంచ దివ్యాయుధములు నిత్యసూరులైన సుదర్శనాళ్వారు, పాంచజన్యాళ్వారు ఇత్యాదులే.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి విష్ణుపురాణం (1.22.69-74)నుండి ఉదాహరిస్తూ, పంచాయుధములు ఐదు తత్వములను సూచించునని వివరించారు. భగవంతుడు రాజస అహంకారమును, మానస అహంకారమును పంచభూతాలలోను, పంచేంద్రియ జ్ఞానాలలోను ఇమిడ్చాడు. ఇవి రెండును శంఖము (పాంచజన్యము) మరియు ధనుస్సు (శార్ఙ్గము) ద్వారా సూచితములు. మనసు తత్వమునకు చక్రము (సుదర్శనము) సూచిక. ఎందుకంటే మనసులోని ఆలోచనలు గాలికంటే వేగంగా పయనించే ఆయుధాలు. గద (కౌమోదకి) బుద్ధి తత్వము గలది. ఈ దివ్యనామములో ప్రస్తుతింపబడిన 'చక్రగదాధరుడు' ఒకచేత మనస్సును, మరొకచేత బుద్ధిని ధరించిన శ్రీమహావిష్ణువు. ఆయన ఖడ్గము (నందకము) విద్యాజ్ఞానములకు ప్రతీక.

శ్రీ విష్ణుపురాణములోని శ్లోకాలకు మరింత విశాలమయిన అర్థం చెప్పాలంటే – భగవంతుడు సమస్తమునకు నిలయము. ఆత్మ, ప్రకృతి, బుద్ధి, అహంకారము, భూతములు, ఇంద్రియములు, మనసు, మాయ, జ్ఞానము – అన్నీ ఆ పరమాత్మునియందే నెలకొన్నవి. జ్ఞానము, అజ్ఞానము, ఉన్నది, లేనిది, శాశ్వతము, క్షణికము ఆయనయందే ఆవహించియున్నవి. శ్రీమన్నారాయణుడే కాలము, భూమి, ఆకాశము, స్వర్గము – అంతాను. విష్ణుపురాణంలోని విశ్వరూపవర్ణనలో ఇది మరింత చక్కగా తెలుపబడింది.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

వేధాస్స్వాంగోఽజితః కృష్ణో దృఢస్సంకర్షణోఽచ్యుతః |
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః || (59)

551. వేధాః

- మహావైభవ కళ్యాణ మంగళములను ప్రసాదించువాడు.
- అమిత వైభవ శుభములను కలుగజేయువాడు.
- సృష్టిని చేయు విధాత.

ఓం వేధసే నమః

మహావిభవ కళ్యాణ సతతం విదధాతి యః
భక్తేభ్యః పరమం వేధాః షడర్ణో మంగళప్రదః
తన భక్తులకు ఎల్లప్పుడూ మహావైభవమైన మంగళములు సమకూర్చువాడు. ఈ నామము షడక్షరి. మంగళప్రదము. ఓం వేధసే నమః

విదధాతి ఇతి వేధాః. అనంత వివిధ వైభవములను ప్రసాదించువాడు – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **విదధాతి కామాన్ స్వజనానామ్ ఇతి వేధాః** – అని వివరిస్తూ, కఠోపనిషత్తు (2.2.13)నుండి ఉదాహరించినది – **ఏకో బహూనామ్ విదధాతి కామాన్**.

శ్రీ పి.బి.అణ్ణాంగారాచార్య స్వామి రెండవ భావమును (చేసేవాడు అని) చెప్పారు. వైభవ మంగళములను చేయువాడు 'వేధాః'.

శ్రీ శంకరుల భాష్యము – **విదధాతి సృజతి ఇతి వేధాః** – అని శ్రీ శంకరులు చెప్పారు. **స్రష్టా ప్రజాపతిః వేధా విధాతా విశ్వసృష్విధిః** (అమరకోశం 1,17). అనగా సృజించేవాడు 'వేధాః'.

552. స్వాంగః

- ఛత్ర చామరాది సార్వభౌమ లక్షణములు స్వయంగా (స్వతహాగా) కలిగినవాడు. జగదీశ్వరుడు గనుక.
- సృష్టికి ఉపాదాన కారణము మరియు నిమిత్తకారణము కూడ ఆయనే.
- సుందరములైన అవయవములతో శోభిల్లువాడు.
- తానే విశ్వరూపుడై విశ్వమును స్వయముగా చలింపజేయువాడు.

ఓం స్వాంగాయ నమః

స్వ సాధారణ మంగం హి ఛత్రాది పరిబర్హణమ్
యస్యాస్తి నిత్యం స స్వాంగః షడర్ణః పరివారదః

ఛత్రచామరాదులు సార్వభౌమత్వానికి చిహ్నములు. శ్రీమహావిష్ణువు సకల జగములకు చక్రవర్తి గనుక అట్టి ఛత్రచామరాదులు ధరించి శోభిల్లుతున్నాడు. ఈ దివ్యనామము షడక్షరి. పరివారాన్నిస్తుంది. **ఓం స్వాంగాయ నమః**. భగవానుడు ధరించే ఛత్రచామరాదులు దివ్యమైనవి, అనితరములు, స్వసిద్ధములు (మరొకరు ఇచ్చినవి కావు). ఈ భావమును శ్రీకృష్ణదత్త భరద్వాజ ఇలా వివరించారు –

స్వాన్యతే శబ్ద్యంతే సుకృతిభిరితి స్వాని
తదృశాని అంగాని యస్య ఇతి స్వాంగః

శ్రీ శంకరుల భాష్యము – **స్వయమేవ కార్యస్య కరణే అంగం సహ కరోతి ఇతి స్వాంగః**. సృష్టి స్థితి లయాది కార్యములు చేయడానికి శ్రీమన్నారాయణునికి తానే సాధనము. ఏ పనైనా చేయడానికి ఉపాదానము (సాధనం), నిమిత్తం (చేసేవాడు) అనే రెండు కారణాలు ఉంటాయి. కాని శ్రీమన్నారాయణుడే తనంత తానే మరెట్టి ఇతర సాధనములు (అంగములు) అవుసరం లేకుండా సర్వకార్యనిర్వహణము సాగించును.

శ్రీ చిన్మయానంద – చక్కని అంగములతో శోభిల్లువాడు గనుక భగవానుడు 'స్వాంగః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అంగ్-చలించుట (అగి, గత్యర్థక ధాతు)నుండి – సృష్టిలో సకల చైతన్య చలనములు ఇతర శక్తి సహాయములతో జరుగుచున్నవి. కాని శ్రీహరికి ఆయనే సర్వశక్తి.

ధర్మచక్రము రచయిత – తనకు తానే సహాయము చేయువాడు 'స్వాంగః'. ఈ నామమును గుర్తుంచుకొని, ధ్యానము చేయునపుడు మరే సహాయము అవుసరము లేదని గ్రహింపవలెను.

ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై

పర మామ్నాయములెల్ల వంది గణమై బ్రహ్మాండమాగారమై

సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీ గంగ సత్పుత్రియై

వరుసన్నీ ఘన రాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా

533. అజితః

- ఎన్నడును అపజయము పొందనివాడు. జయింపరానివాడు.
- అజిత (వైకుంఠ) పురము గలవాడు.
- ఆరవ మన్వంతరములో 'అజితుడు' అనే అంశావతారము ధరించి క్షీరసాగరమథనంలో సహాయపడెను.
- తనను ఆశ్రయించినవారిని కాపాడుట అనే ధర్మమును నిర్వర్తించుటలో ఎన్నడూ విఫలం కానివాడు.

ఓం అజితాయ నమః

ప్రాకృతైర్నజితాయ సా యస్యాస్త్యజితాపురీ
అజితస్తేన విజ్ఞేయః సప్తార్ణో ముక్తిదో మనుః
ప్రాకృత పురుషులకు అజేయమైన 'అజిత' అనే పట్టణము (వైకుంఠము) కలవాడు. ఈ నామము సప్తాక్షరీ మహామంత్రము. మోక్షదాయకము. ఓం అజితాయ నమః. **పురం హిరణ్మయీం బ్రహ్మ వివేశాపరాజితా** – సువర్ణమయమైన అపరాజిత అనే పట్టణంలో పరబ్రహ్మమున్నది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – అజిత, అపరాజిత అనే పేర్లు కూడా వైకుంఠానికున్నాయి. శ్రీవైకుంఠనాథుడైనందున శ్రీనివాసుడు అజితు డనబడుచున్నాడు. భగవానుని స్థానమైన వైకుంఠము మరియు భగవానుడు సంపూర్ణ శుద్ధ సత్వమయములు గనుక జనన, పరిణామ, మరణాది భౌతికధర్మములు అక్కడ చెల్లవు.

శ్రీ వి.వి. రామానుజన్ రామాయణము యుద్ధకాండము (120.16) నుండి ఉదాహరించారు – **అజితః ఖడ్గధృగ్ విష్ణుః కృష్ణశ్చైవ బృహద్బలః**. ఇక్కడ, శరణాగత త్రాణ ధర్మ నిర్వహణమయందు శ్రీరాముడు ఎన్నడును జయింపబడడు – అని శ్రీ పి.ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ వివరణ.

శ్రీ శంకరుల వ్యాఖ్య - **న జితః ఇతి అజితః** – ఎన్నడును, ఇంతకు ముందు మరియు ఇంకముందు కూడ, జయింపబడనివాడు గనుక అజితుడు. **న జితః కేనాపి త్రిభువనే ఇతి అజితః** – అని శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరించారు.

ధర్మచక్రము రచయిత – శ్రీమన్నారాయణుడు సత్యస్వరూపుడు, ధర్మస్వరూపుడు. సత్య ధర్మములకు ఎన్నడును పరాజయము లేదు. అలాగే శ్రీమన్నారాయణుడు అజితుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భాగవతంలో క్షీరసాగర మధన కథా సందర్భంలో శ్రీకూర్మావతారము గురించి చెప్పబడింది. అప్పుడు శ్రీమహావిష్ణువే అజితునిగా వచ్చి దేవదానవులకు సహకరించాడు (8.5.9). **తత్రాపి దేవః సంభూత్యామ్ వైరాజస్య అభవత్ సుతః అజితో నామ భగవానంశేన జగతః పతిః.**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సమానుల మధ్యనే గెలవడం, ఓడడం అనే విషయాలుంటాయి. శ్రీమహావిష్ణువునకు పోలికైనవారు సకల జగత్తులోను లేరు. శ్రీమహావిష్ణువును జయించడం అనే ప్రశ్నే లేదు. అందువలన శ్రీమహావిష్ణువు అజితుడు.

554. కృష్ణః

- సచ్చిదానంద క్రీడామూర్తి.
- నల్లని వర్ణము గలవాడు.
- తన అనంత కళ్యాణ గుణములతో భక్తులను ఆకర్షించువాడు.
- నాగలిగా భూమిని దున్ని జీవసమృద్ధి కలిగించువాడు.
- కృష్ణద్వైపాయనుడైన వేదవ్యాసుడు.
- వ్యాసుడై వేదములను విభజించి భక్తుల మనోవ్యవసాయము సాగించి జ్ఞానోత్పత్తిని కలిగించినవాడు.
- కానరాని, తెలియరాని, తెలియజాలని, అందరానివాడు. సంపూర్ణ భక్తికి మాత్రమే లభ్యమైనవాడు.

ఓం కృష్ణాయ నమః

ఈ నామము 7వ, 59వ శ్లోకములలో స్తుతింపబడినది.

7వ శ్లోకము. 58వ నామము. కృష్ణః – **అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః**

59వ శ్లోకము. 554వ నామము. కృష్ణః – **వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః**

ఈ రెండు సందర్భాలలోను ప్రధాన భాష్యకారుల వివరణ ఇలా ఉంది.

58వ నామము. కృష్ణః

శ్రీ శంకరులు – నిరతిశయమైన ఆనందము, అప్రమేయమైన అస్తిత్వము – ఈ రెండింటి సమ్మేళనము కృష్ణుడు.

శ్రీ భట్టులు – శాశ్వతము, అవిచ్ఛిన్నము అయిన క్రీడావినోదముచే సదా ఆనందమునకు నెలవైనవాడు కృష్ణుడు.

554వ నామము. కృష్ణః

శ్రీ శంకరులు – కృష్ణద్వైపాయనుడైన వేదవ్యాసుడు కృష్ణుడు.

శ్రీ భట్టులు – నల్లని వర్ణము కలిగినవాడు కృష్ణుడు.

నల్లనివాడు కృష్ణుడు – అన్న శ్రీ భట్టుల వ్యాఖ్య గురించి – భగవంతుడు శుద్ధ సత్వ స్వరూపుడు (పాంచభౌతిక దేహి కాడు.). కనుక ఆయన రంగు నలుపుగా లేక నీలమేఘఛాయలో ప్రకాశించు అద్భుత వర్ణము. ఉనాది వ్యాకరణము సూత్రము (3.4) ప్రకారము 'కృష్' (దున్నుట) అనే ధాతువుకు 'నక్' అనే ధాతువును జోడించినపుడు అది, 'కృషర్ వర్ణే', రంగును సూచించును. కనుకనే ద్రాక్షకు, ఇనుముకు 'కృష్ణ' అనే నామాంతరాలున్నాయి. ఈ 'నల్లని రంగు' ఆధారంగా మహాభారతం శాంతిపర్వం (143.49)లోని ఈ శ్లోకంలో 'కృష్ణ' నామానికి అర్థం చెప్పబడింది.

కృషామి మేదినీం పార్థ భూత్వా కృష్ణాయ సో మహాన్
కృష్ణో వర్ణశ్చ మే యస్మాత్ తేన కృష్ణోऽహమర్జున
అర్జునా! నేను నల్లని కొయ్యగొడ్డలినై భూమిని చీల్చడం చేతను, నల్లని రంగు గలవాడనగుట చేతను నన్ను కృష్ణుడు అంటారు. (ఇంతకుముందు 58వ నామం వివరణలో ఉదాహరించిన ఇదే శ్లోకానికి, ఇప్పుడు ఉదాహరించిన శ్లోకానికి స్వల్పంగా పాఠ్యభేదం ఉంది. ఇది పాఠ్యాంతరం కావచ్చును).

'నల్లనివాడు' అన్న సందర్భంలో శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధములనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు –
కణ్ణన్ ఏనుమ్ కరుమ్ దైవమ్ – నాచ్చియర్ తిరుమొళి
కరియాన్ ఒరు కాళై – తిరుమొళి 3.7

శ్రీ కృష్ణదత్త భరద్వాజ వ్యాఖ్య – **కర్షతి భగవాన్ ఆత్మానం ప్రతి వయో వర్ణ రూప లావణ్య మధురీ రసోత్కర్షణేన ఇతి కృష్ణః.**

కృషతే ఆత్మానమ్ ప్రతి భక్తాన్ స సౌందర్యేణ ఇతి కృష్ణః – తన ప్రతి భక్తుని ఆత్మను తన సౌందర్యముచే ఆకర్షించువాడు కృష్ణుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య– వేదవ్యాసుడు భగవానుని అవతారము. ఆయనే కృష్ణుడు లేదా కృష్ణద్వైపాయనుడు.
కృష్ణ ద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణమ్ ప్రభుమ్
కోహ్యన్యః పుండరీకాక్షాన్మహాభారత కృద్భవేత్ – విష్ణుపురాణము 3.4.5

ధర్మచక్రము రచయిత 'నాగలి', 'వ్యాసుడు' అన్న భావాలను సమ్మ్వయపరుస్తూ ఇలా చెప్పారు – వేదములను అమర్చివిభజించి వేదవ్యాసుడు భక్తుల చిత్తములందు వ్యవసాయము చేయుటకు క్షేత్రమును దున్ని సిద్ధం చేశాడు. కనుక నారాయణుని స్వరూపుడైన వేదవ్యాసుడు కృష్ణద్వైపాయనుడు.

శ్రీ చిన్మయానంద 'నల్లని' అన్న స్వరూపాన్ని మరొక అద్భుతంగా వివరించారు. ఇక్కడ నలుపు రంగు మన బుద్ధికి, శక్తికి, ఇంద్రియాలకు తెలియని విషయాన్ని సూచిస్తుంది. ఆకాశాంతరాళం నల్లగా కనుపించినట్లు. భక్తి అనే దివ్వెతో మాత్రమే ఆయన గురించి తెలిసికోవడం జరుగవచ్చును.

555. దృఢః

- భక్త సంరక్షణ కొఱకు, బలమైన, శక్తివంతమైన వ్యూహ రూపములు దాల్చువాడు.
- తన సంకల్పము, మాట, చేతలలో చంచలత లేనివాడు.
- పరమాత్ముడు అన్న ఋజువునుండి ఎలాంటి వాదాలద్వారా అయినా తప్పింపబడజాలనివాడు. నిస్సంశయముగా దేవదేవుడే.
- మహోన్నతమైన, మహాద్భుతమైన మహాశక్తిమంతుడు.

ఓం దృఢాయ నమః

'దృఢ' అంటే బలమైన, నిశ్చలమైన, పెద్ద, స్థిరమైన అనే అర్థాలను చెప్పవచ్చును.

శ్రీ వి.ఎన్. వేదాంత దేశికుల వివరణ – పరవాసుదేవుని వ్యూహములు ఏమాత్రమూ ఊహాజనితములు కావు. ఏమాత్రమూ అస్పష్టములు కావు. అవి దృఢమైనవి. శక్తిని, బలమును స్పష్టముగా తెలియజేయునవి. ఆ రూపములను స్మరించి, ధ్యానించుట భక్తులకు కష్టము కాదు. శ్రీ నృసింహమూర్తి శక్తి, ప్రభావమును ఆరాధించుటవలన భక్తులకు ఆ దృఢత్వము సుస్థిరమైన భక్తినొసగును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు ప్రేమ, కరుణ, వాత్సల్యము వంటి దివ్యగుణములనుండి ఎన్నడును చలించడు. దృఢుడు.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు ధర్మసంస్థాపనయందు, పాపశిక్షణయందు దృఢుడు కాని శరణాగతులైన పాపులపట్ల మెత్తనివాడు.

శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య స్వామి – వేద ప్రమాణములు శ్రీమన్నారాయణుడే దేవదేవుడని నిస్సంశయముగా తెలుపుచున్నవి. బాహ్య కుదృష్టులు ఎందరైనా, ఎన్ని కువాదాలు చేసినా గాని ఈ సత్యము నిశ్చయమైనది. కనుక భగవానుడు దృఢుడు.

స్థూలత్వాత్ బలవత్వాచ్చ దృఢ ఇత్యభిధీయతే – దృఢౌ స్థూలౌ బలవాన్ వా – దృఢత్వము అనగా చాలా పెద్ద, చాలా బలమైన, చాలా శక్తివంతమైన గుణము. తన శత్రువులను రూపుమాపడానికి భగవానుడు దృఢమైన రూపములు ధరించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సముద్ర జలములను చెలియలికట్ట నిలిపివేయును. శరీరమును అస్థిపంజరము జీవితాంతము నిలిపియుంచును. భూమిపై గిరితరులు స్థిరముగానుండును. ఇవన్నీ సృష్టిలో భగవానుడు పొందుపరచిన దృఢత్వ లక్షణములు.

556. సంకర్షణః

557. అచ్యుతః

556,557. సంకర్షణోఽచ్యుతః

సంకర్షణః

సంసారంలో చేతనాచేతనములైన ఆత్మలన్నింటిని తనవైపు లాగుకొనేవాడు. (ఆకర్షించేవాడు).

సంకర్షణోఽచ్యుతః

ప్రళయకాలమున అన్నింటినీ తనవైపు ఆకర్షించి లీనం చేసుకొంటూ, తన దివ్యస్వరూపంనుండి ఎన్నడును చ్యుతిని (భ్రంశమును) పొందనివాడు.

అచ్యుతః

- తన పరబ్రహ్మ స్థానమునుండి ఎన్నడూ చలించనివాడు.
- తన భక్తులను ఎన్నడూ పతనము కానీయనివాడు.
- జననము, వయోవృద్ధివంటి పరిణామములకు లోనుగానివాడు.

ఓం సంకర్షణాయ అచ్యుతాయ నమః

ఓం సంకర్షణాయ నమః

ఓం అచ్యుతాయ నమః

శ్రీ శంరులు 'సంకర్షణోఽచ్యుతః' అని విశేషణముతో కూడిన ఒకే నామంగా పరిగణించారు. శ్రీ పరాశరభట్టులు 'సంకర్షణః', 'అచ్యుతః' అనే రెండు నామములుగా పరిగణించారు.

ఓం సంకర్షణాయ అచ్యుతాయ నమః

శ్రీ శంకరులు – **'సంకర్షణోఽచ్యుతః'** నామమునకు –

ప్రళయకాలమున సర్వజీవులను ఆకర్షించి, తనలో లయం చేసుకొనే భగవానుడు తానుమాత్రం చలించడు (చ్యుతిని పొందడు, పతనం కాడు). ఆకర్షించేవాడు సంకర్షణుడు. చ్యుతిని పొందనివాడు అచ్యుతుడు. వెరసి 'సంకర్షణోఽచ్యుతుడు'.

ఓం సంకర్షణాయ నమః

శ్రీ భట్టులు – **'సంకర్షణః'** నామమునకు –

సంసారే చిత్ అచితోః ఆత్మాని సమం కర్షణాత్ సమం కర్షమ్ నయతి – చిత్, అచిత్ లను సమంగా అన్నింటినీ తనవైపు ఆకర్షించేవాడు, వానిని ఏకం చేసేవాడు సంకర్షణుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సమ్యక్ కర్షతి ఇతి సంకర్షణః. శ్రీ భగవాన్ స్వజనాన్ ఆత్మానమ్ ప్రతి స్వకీయైః వాత్సల్య మాధుర్యాది గుణైః కర్షతి** – చక్కగా ఆకర్షించేవాడు సంకర్షణుడు. భగవానుడు తన దివ్య వాత్సల్య రూప గుణాదులచే తన భక్తులను తనవైపు ఆకర్షించును.

ఇక్కడ మూడు నామములు వరుసలో వచ్చినవి – **దృఢః, సంకర్షణః, అచ్యుతః** – వీటి క్రమం గురించి శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇలా చక్కగా వివరించారు.

దృఢః – బలము, స్థిరత్వము, స్థూలత్వము అనే లక్షణములున్నవాడు.

సంకర్షణః – సంసారంలో చిక్కుకున్నవారిని విముక్తులను చేయడానికై తనవైపు లాగేవాడు.

అచ్యుతః – అన్నింటినీ తనవైపు లాగుతున్నాగాని తాను మాత్రం చలించనివాడు.

ఇదే **దృఢః, సంకర్షణః, అచ్యుతః** క్రమాన్ని ధర్మచక్రము రచయిత ఇలా వివరించారు – నీటిలో కొట్టుకుపోతున్నవానిని రక్షించాలంటే ముందు లాగేవాడు బలంగా ఉండాలి (దృఢః). తనవైపుకు లాగాలి (సంకర్షణః). మునిగిపోయేవాడిని రక్షించే సంకల్పం స్థిరంగా ఉండాలి గాని తాను మాత్రం చలించరాదు (అచ్యుతః).

ఓం అచ్యుతాయ నమః

'అచ్యుతః' నామము మూడుమార్లు స్తుతింపబడినది.

11వ శ్లోకము. 101వ నామము. అచ్యుతః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః**

35వ శ్లోకము. 320వ నామము. అచ్యుతః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

59వ శ్లోకము. 557వ నామము. అచ్యుతః – **వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః**

'చ్యుతి' అనగా పడిపోవుట, విడనాడుట, జారిపోవుట, పతనమగుట. ఎన్నడును చ్యుతిని పొందనివాడు అచ్యుతుడు.

ఈ నామమునకు శ్రీ భట్టుల వివరణ – బ్రహ్మేంద్రాది దేవతలు కూడా కాలక్రమమున తమ తమ స్థానములను కోల్పోవుదురుగాని శ్రీమన్నారాయణుడు సదా శ్రీమన్నారాయణుడే గనుక అచ్యుతుడు. ఇందుకు శ్రీ భట్టులు ఉదాహరించిన శ్లోకము –

చ్యవనోత్పత్తి యుక్తేషు బ్రహ్మేంద్ర వరుణాదిషు
యస్మాన్ న చ్యవసే స్థానాత్ తస్మాత్ సంకీర్త్యసే అచ్యుతః

బ్రహ్మ, ఇంద్ర, వరుణాదులు కూడ జన్మము, అంతము, పదవీభ్రంశము వంటివి కలిగియున్నారు. కాని నీవు వానికతీతుడవు గనుక అచ్యుతుడవు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – కామాది గుణములకు అతీతుడైనందున శ్రీహరి అచ్యుతుడు.

యస్మాత్ న చ్యుత పూర్వోఽహమ్ అచ్యుతస్తే న కర్మణా (మహాభారతము. శాంతిపర్వము 12.330.16). దీనిని శంకరులు – **స్వరూప సామర్థ్యాత్ న చ్యుతో న చ్యవతే న చ్యవిష్యతి ఇతి అచ్యుతః** – అని వివరించారు. ఆయన స్వరూప సామర్థ్యములలో ఎన్నడును కొరవడలేదు (పతనము కాలేదు). ఇప్పుడు కొరత లేదు. ఇంకముదెన్నడును కొరత రాజాలదు. ఆయన వైభవము, శక్తి, సౌందర్యములు అపూర్వములు, అనంతములు, అవిచ్ఛిన్నములు. కనుక ఆయన అచ్యుతుడు.

జీవాత్మ కర్మఫలములను అనుభవించుచుండును. పరమాత్ముడు కేవలం సాక్షి. కర్మలకు అంటనివాడు. కనుక అచ్యుతుడు – అని ధర్మచక్రము రచయిత వివరించారు.

శ్రీ భట్టులు ఇచ్చిన మరొక వ్యాఖ్య – తన భక్తులను ఎన్నడూ విడనాడనివాడు అచ్యుతుడు. **తేభ్యః ప్రపన్నేభ్యః న అపగతః అచ్యుతః**. భగవానుని శరణుజొచ్చినవారికి ఆయన ఎన్నడూ దూరం కాడు. కనుకనే పార్థసారథియై అర్జునుని రథాన్ని నడిపాడు.

శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించినది – **మిత్రభావేన సంప్రాప్తమ్ న త్యజేయమ్ కదాచన దోషో యద్యాపి తస్య స్యాత్.** ఎటువంటి దోషములున్నవాడైనా మిత్రభావంతో నా దగ్గరకు వస్తే వానిని ఏ పరిస్థితులలోనూ త్యజించను – అని రామాయణంలో రాముడన్నాడు.

న మే భక్తాః ప్రణశ్యతి. నా భక్తుడెన్నడూ నశింపడు (గీత).

'చ్యుతము' అనగా మార్పు కూడాను. తైత్తరీయారణ్యము (10.11)లో భగవంతుడు – **శాశ్వతమ్ శివమ్ అచ్యుతమ్** – అని చెప్పారు. భగవానుడు మార్పులకు అతీతుడు గనుక అచ్యుతుడు.

558. వరుణః

- ఆవరించువాడు.

- సాయంకాల సూర్యుడు.

ఓం వరుణాయ నమః

వృణ్-వరణే – అనగా 'కప్పివేయుట' – అనే దాతువునుండి ఈ నామమును వివరించారు. (ఆవరణము, ఆవృతము వంటి పదాలను గమనించనగును.) **య స్థిర సర్వమావృత్య వరుణస్స్వతు కథ్యతే** – సమస్తాన్ని ఆవరించి ఉండేవాడు వరుణుడు. **వ్రియతే సర్వమనేనేతి వరుణః** – సకలమును ఆవరించియున్నవాడు వరుణుడు.

ఈ నామమును వివరిస్తూ శ్రీ భట్టులు తైత్తరీయోపనిత్తు (1.1) నుండి ఉదాహరించారు. **యేన ఆవృతం ఖం చ దివమ్ మహీం చ**. ఆకాశంతరాళము, స్వర్గము, భూమి కూడ అతనిచే ఆవరింపబడియున్నవి.

'వరుణ' అన్న పదమునకు 'సాయంకాల సూర్యుడు' అని కూడ అర్థమున్నది. సాయంకాలంలో సూర్యుడు తన కిరణాలను ఉపసంహరించుకొని తననే కప్పివేసుకొంటాడు. అలాగే పరమేశ్వరుడు తననుండి ఉద్భవించిన ద్వంద్వ ప్రవృత్తి కలిగిన జగమును తనయందే లీనము చేసుకొంటాడు. అక్షరమైన చిత్ స్వరూప సత్యము సూర్యునినుండి శక్తి మరియు కాంతి రూపంలో వ్యక్తమగుచున్నది. ఇదియే 'హిరణ్మయము' అని ఉపనిషత్తులు కీర్తించినవి. కనుక నారాయణుని వరుణుడని, సూర్యనారాయణుడని స్తుతించుట సముచితమని శ్రీ చిన్మయానంద అన్నారు.

ఈ మంత్రమునకు ధర్మచక్రము రచయిత చెప్పిన కొన్ని ఆసక్తికరమైన అనుభవములు – వరుణుడు జలములకు ప్రభువు. వరుణుడు సాయంకాలపు సూర్యుడు. వరుణుడు పశ్చిమ దిక్కునకు అధిపతి. సూర్యుడు అస్తమించినపుడు చీకటులు ఆవరించినట్లుగానే దైవచింతన లేనివాడు అంధకారములో చిక్కుకొనిపోవును. భగవంతుని తలచినవానికి జ్ఞానదీపము మార్గదర్శియగును.

559. వారుణః

- తనను ఆశ్రయించినవారి పట్ల ఆదరము గలవాడు.

- వరుణుని పుత్రులు – వసిష్ఠుడు, అగస్త్యుడు.

- తన భక్తుల కష్టములను తొలగించేవాడు.

ఓం వారుణాయ నమః

ఈ నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – **తం స్వామిత్వేన వృణుతే ఇతి వరుణః తత్ర భావో వారుణః**. భగవంతుని ప్రభువుగా నమ్ముకొన్నవాడు వరుణుడు. అట్టివారితో సదా తోడుండెడివాడు వారుణుడు, భగవానుడు.
శ్రీ భట్టుల వ్యాఖ్యానానికి నిరుక్తము రచయిత వివరణ – **స్వామిత్వేన వృణనేషు స్థితో వారుణ ఈరితః**. శ్రీ వి.వి. రామానుజన్ తిరుమొళి (1.10.9)నుండియు, పెరియాళ్వార్ తిరుమొళి (5.4.5)నుండియు ఉదాహరించారు.

శ్రీ శంకరుల భాష్యము – **వరుణస్య ఆపత్యమ్ వసిష్ఠః అగస్త్యో వా వారుణః**. వరుణుని పుత్రులనబడు వసిష్ఠుడు, అగస్త్యుడు వారుణులు. వీరిరువురును భగవంతుని అంశావతారములే.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరణ – **వారణయతి నివారయతి విపదమ్ స్వజనానామ్ ఇతి వారుణః**. స్వజనుల విపత్తులను నివారించువాడు వారుణుడు.

560. వృక్షః

- సత్పురుషులకు ఆశ్రయమునిచ్చువాడు (చెట్టునీడవలె).
- వృక్షమువలె స్థిరమైనవాడు.

ఓం వృక్షాయ నమః

వృఙ్ - వరణే -ఆశ్రయించుట – అన్న ధాతువునుండి శ్రీ భట్టులు ఈ నామమును వివరించారు. నీడనిచ్చే చెట్టులాగా భగవంతుడు భక్తుల సేద దీర్చి వారికి సౌలభ్యము కలిగించడానికి సదా సిద్ధంగా ఉంటాడు. భక్తుడు తనవద్దకు రావాలని వేచియుంటాడు (శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్యస్వామి వివరణ).

సాధూనామాశ్రయత్వాచ్చ సర్వేనస్సహనాదపి
సర్వసత్వాప జీవ్యత్వాత్ వృక్ష ఇత్యభిధీయతే

సత్పురుషులకు ఆధారమైనవాడు, తన భక్తుల సమస్త పాపములను సహించేవాడు, సమస్త ప్రాణులకు బ్రతుకు తెరువైనవాడు, అందరికీ ఆధారమైనవాడు కనుక శ్రీమన్నారాయణుడు ‘వృక్షము’ అని స్తుతింపబడుచున్నాడు.
శ్రీ భట్టులు చెప్పిన కొన్ని మూలములు –
నివాస వృక్షః సాధూనామ్ ఆపన్నానామ్ పరాగతిః – రామాయణము. కిష్కింధకాండ 151.9.
వృక్ష ఇవ స్తబ్దో దివి తిష్ఠతేభ్యః – నిశ్చలమైన వృక్షమువలె ఆకాశమునందు నిలిచియున్నది – మహానారాయణోపనిషత్తు 10.4

శ్వేతాశ్వరోపనిషత్తులో – ఏ బ్రహ్మముకన్న శ్రేష్ఠమైనదిగాని, వేరైనదిగాని, పెద్దదిగాని, చిన్నదిగాని ఏదీ లేదో, ఏది వృక్షములాగా ఆకాశమునందు నిలబడియున్నదో, అట్టి బ్రహ్మముచేత సమస్త ప్రపంచము పరిపూర్ణమై, వ్యాప్తమై యున్నది.

శ్రీ శంకరులు కూడా – **వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠతేభ్యః** – అనే వాక్యాన్నే ఉదాహరించారు. కాని అందులో 'దృఢమైన, నిశ్చలమైన, స్థిరమైన' అన్న భావాన్ని గ్రహించారు.

ఈ ప్రపంచమే ఒక మహావృక్షమనే భావాన్ని తీసికొని శ్రీ చిన్మయానంద ఈ నామాన్ని వివరించారు – **ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థమ్ ప్రాహురవ్యయమ్.** (గీత 15.1). ఈ సంసారము ఊర్ధ్వ (పైకి) మూలములు (వ్రేళ్ళు) కలిగి, క్రిందివైపుకు కొమ్మలు విస్తరించి, అవ్యయమై, వేదములే ఆకులుగా కలిగి త్రిగుణములతో వర్ధిల్లుచు, విషయములే చిగురుటాకులై, మానవలోకమందు కర్మసంబంధములగు వ్రేళ్ళతో గట్టిగా నాటబడియున్నది.

శృతులలో 'వృక్ష' అన్నపదమును వివిధ భావములలో ఉపయోగించారని శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఉదాహరించారు –

'వృక్ష' అనగా 'చెట్టు' అనే భావము –

ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థమ్ ప్రాహురవ్యయమ్ – గీత 15.1

ఊర్ధ్వమూల అవాక్ శాఖ ఏష అశ్వత్థ సనాతనః – కఠోపనిషత్ 2.6.1

వృక్షో న పక్వః – ఋగ్వేదము 4.20.5

'వృక్ష' అనగా 'సూర్యుడు' అనే భావము –

కః స్విద్ వృక్షో నిష్ఠితో మధ్యే అర్ణసః – ఋగ్వేదము 1.182.7

'వృక్ష' అనగా 'స్త్రీ' అనే భావము –

మర్యో న యోషామభి మన్యమానః – ఋగ్వేదము 4.20.5

'వృక్ష' అనగా 'ప్రకృతి' అనే భావము –

ద్వా సుపర్ణాః సయుజా సఖాయాః సమానమ్ వృక్షమ్ పరిషస్వజాతే – ఋగ్వేదము 1.164.20

'వృక్ష' అనగా 'పరమాత్మ' అనే భావము –

యస్మిన్ వృక్షే మాధ్వదః సుపర్ణాః నివిశంతే స్తువతే చాऽధి విశ్వేః – ఋగ్వేదము 1.164.22

ఇన్ని స్వరూపములలో వ్యక్తమయ్యే శ్రీనివాసుడు 'వృక్షః'.

ఈ నామమునకు శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరొక అనుభవమును కూడ చెప్పారు –

వ్రాశ్చ - ఛేదనే – అన్న ధాతువునుండి 'వృక్షః' పదాన్ని 'చీల్చివేయుట' అనే భావంలో కూడ అన్వయించుకొనవచ్చును. భగవానుడు జీవులను వేరువేరు శరీరములలో బంధిస్తాడు. గ్రహ నక్షత్రాదులను

దూరదూరంగా ఉంచుతాడు. సూర్యుడు చీకట్లను చీల్చుతాడు. ఒక చెట్టు తన ఫలాలను వేరువేరుగా అందించి అనేక వృక్షాలు ఉద్భవించడానికి దోహదమవుతుంది. ఇలా భగవానుడు వృక్షరూపుడై అనేక రూపాలలో వెలుగొందుతూ సృష్టిని నానావిధములుగా చేయుచున్నాడు. ఇలాంటి వృక్షతత్త్వాన్ని గ్రహించినవారు కామాదులను చీల్చి చెండాడి శ్రీహరియనెడి కల్పతరువును చేరగలరు.

ధర్మచక్రము రచయిత – ఈ నామమునుండి గ్రహించవలసినది. చెట్టునుండి చంచలమైన ఛాయనేగాక పుష్కలమైన ఫలాలను ఆశించాలి. కేవలం యాదవసైన్యాన్ని తీసుకొన్న దుర్యోధనుడు నీడతో సరిపెట్టుకొన్నాడు. శ్రీకృష్ణుని సారధ్యాన్ని కోరిన అర్జునుడు శాశ్వత సత్ఫలాలను పొందాడు.

561. పుష్కరాక్షః

- పోషించు (పుష్టి కలిగించు) కన్నులు కలవాడు.
- పద్మములవంటి కన్నులు కలవాడు.
- సమస్తాకాశమున వ్యాపించియున్నవాడు.
- సూర్యచంద్రులు కన్నులుగా గలవాడు.
- ధ్యానించినపుడు హృదయపద్మమును ప్రకాశింపజేయువాడు.

ఓం పుష్కరాక్షాయ నమః

ఈ ప్రియనామము రెండుమార్లు వస్తుంది.

5వ శ్లోకము. 40వ నామము. పుష్కరాక్షః – **స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః**

59వ శ్లోకము. 561వ నామము. పుష్కరాక్షః – **వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః**

40వ నామమునకు నిరుక్తి వివరణ –

అక్షిణీ పుండరీకేవ భక్తానుగ్రహ కారిణీ
యస్యాసౌ పుండరీకాక్షః స్వేష్టవర్ణస్తు పావకః

తన భక్తులను అనుగ్రహించడానికి తామరపూవులను బోలిన కన్నులు గలవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. పావనకరము. ఓం పుష్కరాక్షాయ నమః.

561వ నామమునకు నిరుక్తి వివరణ –

సతాం ప్రసాద వర్షేణ పోషకే యస్య చాక్షిణీ
పుష్కరాక్ష స్స విజ్ఞేయో హ్యష్టార్ణః ప్రీతివర్ధనః

సత్పురుషులమీద తన అనుగ్రహమును వర్షించి పోషించు నేత్రములు కలవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ప్రీతికరము. ఓం పుష్కరాక్షాయ నమః.

శ్రీ భట్టులు 'పుష్ - పుష్టౌ - పుష్టి కలిగించునది' అన్న ధాతువు ఆధారంగా ఈ నామమును వ్యాఖ్యానించారు. శ్రీ స్వామిదేశికన్ తమ 'శ్రీ భగవధ్యాన సోపానము'లో **'స్వాగత ఉదార నేత్రమ్'** అని స్తుతించారు. శ్రీరంగనాధుని కన్నులు సదా భక్తులవైపు చూస్తూ కరుణను వర్షిస్తాయి. శ్రీ దశావతార స్తోత్రము 2వ శ్లోకములో ఇలా వ్రాశారు – **అరవింద గహనాని తన్వాన్ ఇవ దత్త క్షణైర్వీక్షణైః**. ఆ కన్నులు తామరపూల అడవిలా కరుణను వర్షిస్తాయి.

పుష్కరములు అనగా తామరపూలు. కనుక తామరపూలవంటి కన్నులు కలిగినవాడు పుష్కరాక్షుడు. ఛాందోగ్యోపనిషత్తు (1.6.7)నుండి శ్రీ రామానుజులు ఉదాహరించిన భాగాన్నే శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఉదాహరించారు – **తస్య యథాకప్యాసం పుండరీకమేవ అక్షిణీ**.

పుష్కరమనగా 'విశ్వాంతరాళము' అని కూడ. 'అక్షు' అనగా వ్యాపించుట. కనుక ఆకాశమంతా వ్యాపించినవాడు పుష్కరాక్షుడు – అని శ్రీ శంకరులు చెప్పిన అర్థాన్నే శ్రీ చిన్మయానంద కూడా అనుసరించారు.

పై అర్థాన్నే శ్రీ సత్యదేవో వాసిష్ఠ కొంత మార్చారు. పుష్కర - విశ్వాంతరాళాకాశము. అక్ష - కన్నులు. సూర్యచంద్రులు కన్నులుగానుండి ఆకాశమంతటిని చూచుచున్నవాడు పుష్కరాక్షుడు. **యస్య సూర్యశ్చక్షు శ్చంద్రమాంశ్చ పునర్ణవః** (అధర్వణ వేదము 10.7.33)

పుష్కరము అనగా హృదయపద్మము అనికూడ చెప్పవచ్చును. ధ్యానము చేసినపుడు హృదయపద్మమును ప్రకాశింపజేయువాడు పుష్కరాక్షుడు అనికూడ శ్రీ శంకరులు చెప్పారు. ధ్యానమును సాధన చేయు ఆరంభదశలో భ్రూమధ్యంకంటె హృదయంపై కేంద్రీకరించడం సులభమని ధర్మచక్రము రచయిత వ్రాశారు.

562. మహామనాః

- ఉదారమైన, విస్తారమైన మనసు కలవాడు.
- అనితర శక్తిమంతమైన మనసు కలవాడు.
- అనంతమైన బుద్ధి, జ్ఞానము కలిగినవాడు.

ఓం మహామనసే నమః

శ్రీ భట్టులు – భగవానుడు విశాల హృదయుడు. లోతైన, విస్తారమైన మనసు కలవాడు. భక్తులను మన్నించువాడు. శరణాగతులైన పాపులను కాచువాడు. ద్రౌపదికి తగినంత సహాయము చేయలేదని చింతించినవాడు.

శ్రీ శంకరులు – **మనసైవ జగత్ సృష్టిం సంహారం చ కరోతి యః.** అని విష్ణుపురాణము(5.22.15)లో ఉన్నది. ఆయన సంకల్పమాత్రముననే, కర్మేంద్రియములతో పని లేకుండా, సృష్టి స్థితి లయాది కార్యములను నిర్వహించును. కనుక శ్రీహరి మనసు మహాశక్తిమంతమైనది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యం మేధాం దేవగణాః పితరశ్చ ఉపాసతే, తయా మామ్ అద్య మేధయా అగ్నే మేధావినం కురు.** అని యజుర్వేదము (32.14)లో ఉన్నది. అంతటా అంతర్యామి అయిన ఆయనకు తెలియనిది లేదు. అందరూ జ్ఞానము కొరకు ఆయనను ఆరాధిస్తారు.

ధర్మచక్రము రచయిత – శరీరము, ఇంద్రియములు, మనసు - వీనిలో శరీరము స్థూలమైనది. మనస్సు అన్నింటికంటె సూక్ష్మమైనది. మనసు వలననే ఇంద్రియులు, తద్వారా శరీరము వర్తించును. భగవానుడు అన్నింటికంటె సూక్ష్మతరుడు. అన్ని కార్యములకు మూలము.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

భగవాన్ భగహాఽనందీ వనమాలీ హలాయుధః |

ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుర్గతిసత్తమః || (60)

563. భగవాన్

- పూజనీయుడు. పూజ్యులందరిలోను పూజ్యతముడు.
- సమగ్రమైన షడ్గుణములు సంపూర్ణముగా కలిగినవాడు.
- ఉత్పత్తి ప్రళయములను, గతాగతములను, విద్య అవిద్యలను తెలిసినవాడు.

ఓం భగవతే నమః

సర్వహేయ ప్రత్యనీక కళ్యాణగుణవత్తయా

పూజ్యాత్ పూజ్యతమో యోऽసౌ భగవానితి శబ్ద్యతే.

లోకంలో ఉన్న ప్రతిదుర్గుణానికి అనేకానేక సద్గుణాలు కలవాడు. అందుచేత పూజ్యులందరిలోను పూజ్యుడు భగవానుడు అని పిలువబడుచున్నాడు.

సకల కళ్యాణగుణ పరిపూర్ణుడు, దోషరహితుడు అయినందున శ్రీమన్నారాయణుడు భగవానుడు, పూజ్యనీయుడు అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. 'భగ' అన్న పదానికి షడ్గుణైశ్వర్యములు అని అర్థం ఉంది కాని శ్రీభట్టులు ఈ నామవ్యాఖ్యానానికి ఆ అర్థం తీసుకోలేదు (తరువాతి నామమైన 'భగహా' వ్యాఖ్యానానికి శ్రీభట్టులు ఆ అర్థాన్ని ఉపయోగించారు.) అయితే ఇతర వ్యాఖ్యానకర్తలు 'భగవాన్' నామ వివరణకు ఆ అర్థం తీసుకొన్నారు. పూజింపదగినవాడు గనుక భగవాన్ అని శ్రీ భట్టుల వ్యాఖ్య. అమరకోశ వ్యాఖ్యానంలో **'భజయత ఇతి భగః'** అని ఉంది. అది శ్రీ భట్టుల వివరణకు సరిపోతుంది.

శ్రీ శంకరులు 'భగ' అనగా షడ్గుణైశ్వర్యములు అన్న అర్థంలో 'భగవాన్' నామమును వ్యాఖ్యానించారు. ఇందుకు విష్ణుపురాణము (6.5.74)నుండి ప్రమాణం చెప్పారు.

ఐశ్వర్యశ్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః

జ్ఞాన వైరాగ్య యోశ్చైవ షణ్ణాం భగ ఇతీరిణా

ఐశ్వర్యము (ప్రభుత), వీర్యము, యశస్సు, సిరి, జ్ఞానము, వైరాగ్యము – అనే ఆరు గుణాలు సంపూర్ణముగా కలిగియున్నవాడు భగవాన్. ఈ శ్లోకానికి పాఠాంతరాలున్నాయి. 'వీర్యస్య' బదులుగా 'ధర్మస్య' అనీ, 'జ్ఞాన వైరాగ్యయోऽశ్చైవ' బదులుగా 'వైరాగ్యస్య అథ మోక్షస్య' అనీ కూడా ఉన్నాయి..

శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరణ – **భగో జ్ఞానాది షట్కమ్ విద్యతే నిరతిశయమ్ యస్మిన్నితి భగవాన్.** నిరతిశయమైన జ్ఞానాది షడ్గుణములు కలిగినవాడు భగవానుడు.

ఈ షడ్గుణముల గురించి శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన వివరణ –

(1) ఐశ్వర్యము – అన్నింటిపై ఆధిపత్యము (ఈశ్వరత). భగవంతుడు అన్నింటికి, అన్ని కాలములందును ప్రభువు. ఆయనకు వేరు ప్రభువు లేడు. ఆయన పరమేశ్వరుడు. **న తస్య ఈశే కశ్చన** (తైత్తరీయారణ్య 10.10).

(2) వీర్యము – ఎంతటివాడినైన జయించువాడు. అనంతశక్తిమంతుడు. **ఉగ్రమ్ వీరమ్ మహావిష్ణుమ్.**

(3) యశము – కీర్తి. అందరును ఆయననే స్తుతింతురు. **తస్య నామ మహద్యశః** (తైత్తరీయారణ్యకము 10.1).

(4) శ్రీ – సంపద. శ్రీమహాలక్ష్మిని వక్షస్థలమున దాల్చినవాడు శ్రీనివాసుడు. **శ్రియం లక్ష్మీం ఔపలామ్ అంబికాంగం.** ఆమె భగవంతునికి నితరానపాయిని. క్షాంతిసంవర్ధిని.

(5) జ్ఞానము – భూత భవిష్యద్వర్తమానములన్నీ ఆయనకెరుకయే. ఆయన భూతభవ్యభవత్ప్రభువు. **యః సర్వజ్ఞ సర్వవిత్ యస్య జ్ఞానమయం తపః** (ముండకోపనిషత్తు 1.1.9).

(6) వైరాగ్యము – భగవంతునికి ఎటువంటి బంధములు, కర్మఫలాదులు, వికారములు వర్తించవు. **స వా అయమాత్మా బ్రహ్మ అకామ మయః** (బృహదారణ్యకము 4.4.5)

శ్రీ శంకరులు మరొక వ్యాఖ్యానము కూడా విష్ణుపురాణములోని శ్లోకము (6.5.78) ఆధారంగా చెప్పారు.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానాం ఆగతిం గతిం

వేత్తి విద్యామవిద్యాంచ స వాచ్యో భగవానితి.

ఉత్పత్తి, ప్రళయము, గతాగతములు (సృష్టి సంహారములు), విద్య, అవిద్య – వీనిని సంపూర్ణముగా నెరిగినవాడే భగవానుడని చెప్పబడును.

564. భగహా

- షాడ్గుణ్య పరిపూరితుడు. కళ్యాణగుణములు సంపూర్ణముగానున్నవాడు.
- ప్రళయకాలమున సకల సంపదలను హరించి తనయందే లీనము చేసికొనువాడు.

ఓం భగఘ్నే నమః

భగైస్తు కళ్యాణగుణైః సర్వం సర్వత్ర గచ్ఛతి

యశ్చాసౌ భగహా ప్రోక్తః షడర్ణ సుఖదాయకః

భగము అంటే ఆరు గుణముల సముదాయము. వీటిని సర్వత్ర ధరించియుంటాడు కనుక ఆయన 'భగహా'. ఈ నామము షడక్షరీమంత్రము. సుఖప్రదము. ఓం భగఘ్నే నమః.

విష్ణుపురాణములోని శ్లోకము (6.5.74) –

ఐశ్వర్యశ్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః

జ్ఞాన వైరాగ్య యోశ్చైవ షణ్ణాం వర్గో భగస్మృతః

అనే శ్లోకాన్ని శ్రీ శంకరులు ఇంతకుముందటి నామమైన 'భగవాన్' వ్యాఖ్యానంలో ఉదాహరించగా, శ్రీ భట్టులు అదే విష్ణుపురాణశ్లోకాన్ని ఈ 'భగహా' నామ వ్యాఖ్యానంలో ఉదాహరించారు. శ్రీ భట్టులు చెప్పిన భాష్యము – **భగ శబ్దయాన్ స కళ్యాణ గుణాన్ హన్తి తు గచ్ఛతి.** 'భగ' శబ్దము ద్వారా తెలుపబడిన ఆరు కళ్యాణ గుణములను కలిగియున్నవాడు. (హన్తి - గచ్ఛతి - వెళ్ళువాడు). 'హా' శబ్దమునకు 'నాశనము చేయుట' అనే అర్థమున్నది. ఉదాహరణకు 'వీరహా'. కాని శ్రీ భట్టులు 'హా'ను 'హన్తి' అని అన్వయించారు. శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదేవిధంగా – **భగం మాహాత్మ్యం జిహీతె గచ్ఛతి ప్రాప్నోతి ఇతి భగహా** – అని వ్రాశారు.

శ్రీ శంకరులు 'హా' అనగా 'సంహరించుట, హరించుట' అన్న అర్థంలో ఈ నామమును వ్యాఖ్యానించారు. **ఐశ్వర్యాదికమ్ సంహార సమయే హన్తి ఇతి భగహా.** ప్రళయ సమయమున సకలైశ్వర్యములను రూపుమాపువాడు 'భగహా'. ఈ అర్థాన్ని శ్రీ సత్యదేవో వాసిష్ఠ కొంచెం తేడాగా విశదీకరించారు. అంతనూ తనలో లీనం చేసుకోవడమే ఇక్కడ సంహారం. కనుక ఇది నాశనం కాదు, ఉత్పత్తి స్థానానికి చేర్చడం అని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

ధనము, కీర్తి వంటివి శాశ్వతం కాదని, వాటిపట్ల మోహము పెంచుకొనవద్దని ఈ నామము మనకు ఉద్బోధించునని ధర్మచక్రము రచయిత వివరించారు.

565. నందీ

ఆనందీ

- నందగోపుని కుమారుడు.
- షడ్గుణైశ్వర్య పరిపూర్ణుడగుటచేత ఆనందమే స్వరూప స్వభావములుగా కలిగినవాడు.
- తన భక్తుల సాంగత్యమువలన సదా సంతోషించువాడు.

- తన భక్తులకు ఆనందము కలిగించువాడు.

ఓం నందినే నమః

ఓం ఆనందినే నమః

శ్రీ భట్టులు 'నందీ', 'ఆనందీ' అనే రెండు నామములను చెప్పారు. శ్రీ శంకరులు 'ఆనందీ' అనే నామమునే చెప్పారు. శ్రీ భట్టులు రెండు నామముల వివరణను సంకర్షణవ్యూహామూర్తియైన బలరామావతారము పరముగా అన్వయించారు. శ్రీ శంకరులు శ్రీకృష్ణావతారమును 'ఆనందీ' నామమునకు అన్వయించారు.

నందగోపుని కుమారుడు బలరాముడు. ఈయన సంకర్షణవ్యూహ విభవావతారము. కనుక 'నందీ'. ఇదే నామమునకు శ్రీ చిన్మయానంద – **నందగోప కుమరన్ నారాయణన్** – అని చెప్పారు.

శ్రీ శంకరులు 'ఆనందీ' అనగా సచ్చిదానంద స్వరూపుడని వివరించారు. ఎందుకంటే సకలైశ్వర్యములు భగవానునికి పరిపూర్ణముగా ఉన్నాయి. **సుఖస్వరూపత్వాత్ ఆనందీ – సర్వాభిః సంపద్భిః సమృద్ధత్వాత్ ఆనందీ.**

శ్రీ భట్టులు 'ఆనందీ' అనగా గోపకులంలో సర్వులకూ ఆనందము కలుగజేసిన బలరాముడు అని వ్రాశారు. ధర్మచక్రము రచయిత ఇదే 'ఆనందీ' నామమునకు – గోపకులంలో అందరికీ ఆనందం కలిగించిన శ్రీకృష్ణుడు – అని వ్రాశారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ వివరణ – **నందతి సమృద్ధయతి ఇతి నందీ.** తన భక్తులకు సమృద్ధిని, ఆనందమును కలుగజేయువాడు 'నందీ'. శ్రీ చిన్మయానంద వివరణ – భగవానునికి శరణాగతులైనవారు ఆయన ఆనందమును అందుకొందురు. ఈ రెండు భావములను 'ఆనందీ' నామమునకు కూడ అన్వయింపవచ్చును.

ధర్మచక్రము రచయిత – మన స్వభావము స్వతఃసిద్ధముగా ఆనందమయము. కాని కనులు మూసుకొని చీకటిని అనుభవించినట్లుగా మనము జ్ఞానమును వదులుకొని దుఃఖములను అనుభవిస్తున్నాము. కనుక భగవంతుని, మరియు మన ఆనంద స్వభావమును తెలిసికొని ఈ దుఃఖములనుండి విముక్తులము కావచ్చును. భగవంతుని భక్తితో అర్చించుటయే ఇందుకు సాధనము. భగవంతునిపట్ల ధ్యానముతో సంపూర్ణముగా పరవశులైన కారణంగానే గోపికలు సచ్చిదానందమును అనుభవించారు. **ఓం నందినే నమః. ఓం ఆనందినే నమః.**

566. వనమాలీ

వనమాలను ధరించినవాడు.

ఓం వనమాలినే నమః

స్వసృజత్యభూత సూక్ష్మాణాం మాలయా నిత్యయోగతః
వనమాలీ సమఖ్యాతో హ్యష్టార్ణో భూషణప్రదః

తన చేత సృష్టింపబడిన పంచభూతములను, తన్మాత్రలను మాలగా ధరించినవాడు వనమాలి. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ఆభరణప్రదము. ఓం వనమాలినే నమః.

సదా వైజయంతీమాలను ధరించువాడు వనమాలి. శబ్ద, స్పర్శ, రస, రూప, గంధములనెడు ఐదు తన్మాత్రలకు అధిష్టానదేవత వైజయంతీమాల. ఈ పంచతన్మాత్రలను మనము పంచేంద్రియములద్వారా గ్రహిస్తున్నాము. ఇవి పంచభూతములకు సంబంధితములు.

వనమాల అంటే అడవిపూల మాల. సాధరణంగా ఐదు రంగుల పూలను వనమాలలో కూరుస్తారు. పంచభూతమయమైన సకల జగత్తును తన కంఠమునందు ధరించువాడు వనమాలి అని ఇక్కడ గ్రహింపవలెను.

మన సకలేంద్రియములను భగవానునిపట్ల లీనము చేసి. నిశ్చలమైన భక్తితో భగవానుని అర్చించవలెనని ధర్మచక్రము రచయిత వ్రాశారు.

తన నాగలితో నదిని మళ్ళిస్తున్న బలరాముడు. 1650 కాలపు చిత్రం. వికీపీడియానుండి

567. హలాయుధః

హలము, అనగా నాగలిని, ఆయుధముగా ధరించినవాడు.

ఓం హలాయుధాయ నమః

హలం చ సతతం సీరం ధత్తే యోऽసౌ హలాయుధః

సీరకార్య సమృద్ధ్యర్థో వస్వర్ణో మంత్రనాయకః

ఎల్ల వేళల నాగలిని ధరించి ఉండేవాడు హలాయుధుడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. వ్యవసాయం ఫలిస్తుంది. ఓం హలాయుధాయ నమః.

శ్రీ శంకరుల వివరణ – **హలం ఆయుధం అస్య ఇతి హలాయుధః** – నాగలిని ఆయుధముగా గలవాడు హలాయుధుడు. ఈ నామము శ్రీ బలరామావతారమును స్తుతించునది.

శ్రీ భట్టుల వివరణ – పంచభూతముల సమృద్ధికై శ్రీమన్నారాయణుడు తన చేత నాగలి ధరించి రైతువలె పని చేయును గనుక హలాయుధుడు.

568. ఆదిత్యః

- దేవకీ నందనుడు. పూర్వజన్మములో దేవకియే అదితి.
- అదితి, కశ్యపులకు జన్మించిన శ్రీవామనమూర్తి.
- 'ఆ' అను బీజాక్షరముచే ప్రసన్నుడగు సంకర్షణుడు.
- మోక్షమును ప్రసాదించువాడు.

ఓం ఆదిత్యాయ నమః

ఈ దివ్య నామము 5వ, 60వ శ్లోకములలో స్తుతింపబడినది.

5వ శ్లోకము. 39వ నామము. ఆదిత్యః – **స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః**

60వ శ్లోకము. 568వ నామము. ఆదిత్యః – **ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుః గతిసత్తమః**

39వ నామమునకు వ్రాసిన అర్థములు –

- సూర్యమండల మధ్యవర్తియై బంగారువర్ణముతో ప్రకాశించు పురుషుడు.
- ద్వాదశాదిత్యులలో విష్ణువు.
- సమస్తమును ప్రకాశింపజేసి పోషించువాడు.
- అదితియొక్క కుమారుడైన వామనుడు.

ఇక 568వ నామమునకు తెలుపబడిన అర్థములు –

అవర్ణాదేవ ప్రాప్యో యః ఆదిత్యః పరికీర్తితః

అదితిర్దేవకీ తస్యాః ఆదిత్యోవా హ్యపత్యతః

తనకు బీజాక్షరమైన 'అ'కారముచే పొందదగినవాడు. గత జన్మలో అదితిగా ఉన్న దేవకి గర్భాన జన్మించినవాడు. ఆదిత్యుడు. శ్రీ భట్టులు 'దేవకీనందనుడు' అనే అర్థాన్ని తెలుపుతూ విష్ణుధర్మము (93.44)నుండి ప్రమాణం చూపారు –

దాక్షాయణి త్వం అదితిః సంభూతా వసుధాతలే
నిత్యైవ త్వం జగద్ధాత్రీ ప్రసాదం తే కరోమ్యహమ్

దాక్షాయణీ! నీవు భూమిపై జన్మించిన అదితివి. నీవు జగన్మాతవు. నీకు ప్రమాణములు.

శ్రీ శంకరుల వివరణ – **అదిత్యాం కశ్యపాత్ వామన రూపేణ జాత ఆదిత్యః** – కశ్యపునికి అదితియందు వామనరూపమున అవతరించివాడు ఆదిత్యుడు.

శ్రీ కృష్ణదత్తభరద్వాజ చెప్పిన ప్రమాణము –

భాద్రమాసే సితేపక్షే ద్వాదశ్యాం శుభవాసరే
కశ్యపాత్ అదితేర్మాతుః భగవాన్ వామనః అభవాత్

శ్రీ భట్టులు చెప్పిన మరొక వివరణ – **'ఆ'వర్ణాత్ ఆతః ఇత్యః ప్రాప్యః ఇతి ఆదిత్యః** – సంకర్షణుని బీజమంత్రము 'ఆ'. ఆ బీజమంత్రముచేత ప్రాప్తించువాడు ఆదిత్యుడు.

శ్రీ చిన్మయానంద వివరణ – **ఆత్** - విష్ణువునుండి, **ఇత్య**-లభించునది. **ఆదిత్య**- విష్ణువు ద్వారా ప్రసాదింపబడు మోక్షము. అట్టి మోక్షమును ప్రసాదించువాడు ఆదిత్యుడు.

తరువాతి నామములను శ్రీ భట్టులు 'నారాయణావతారము' పరముగా వ్యాఖ్యానించారు. 'నారాయణ' నామము అత్యంత గోప్యము. అయినను 'నారాయణ' నామము నారాయణావతారమునుకూడ తెలుపును అని శ్రీ వి.వి.రామానుజన్ చెప్పారు. శ్రీమహావిష్ణువు బదరికాశ్రమములో నరనారాయణ అవతారములను దాల్చెను.

569. జ్యోతిరాదిత్యః

- దివ్యప్రకాశముతో విరాజిల్లుచున్న సూర్యుడు. జ్యోతిష రూపుడైన ఆదిత్యుడు.
- సూర్యమండలాంతర్గతమైన జ్యోతియందున్న పరమాత్మ.
- సూర్యునివలె (కంటె చాల) ప్రకాశించువాడు.

ఓం జ్యోతిరాదిత్యాయ నమః

సమస్త తేజోహరణ జ్యోతిషా దీప్యతే చ యః
స వై స్యాత్ జ్యోతిరాదిత్యః నవార్ణో జ్ఞానదాయకః

అన్ని తేజస్సులను తనలో ఏకీభవింపచేసుకొనగల తేజస్సుతో ప్రకాశించేవాడు. ఈ నామము నవాక్షరీ మంత్రము. జ్ఞానదాయకము. ఓం జ్యోతిరాదిత్యాయ నమః.

ఇతని తేజస్సుముందు సూర్యుని తేజస్సు వెలవెలపోతున్నది. శ్రీభట్టులు చెప్పిన వ్యాఖ్యానము – **దివ్యాశ్చర్య జ్యోతిర్మయత్వాత్ అపూర్వః జ్యోతిరాదిత్యః**. ఇందుకు శ్రీ భట్టులు మహాభారతము శాంతిపర్వము (344.90) నుండి ఉదాహరించారు – **నిష్ప్రభాని చ తేజాంసి బ్రహ్మాచైవ ఆసనాత్ చ్యుతః** – నరనారాయణులు భవునితో (రుద్రునితో) యుద్ధము చేసినపుడు సకల తేజస్సులు కాంతిహీనములయ్యెను. బ్రహ్మాకూడ తన ఆసనమునుండి చలించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **జ్యోతిషి సవితృమండలే స్థితః జ్యోతిరాదిత్యః** – అనగా సూర్యమండల మధ్యమున ఉన్న తేజోమయమూర్తి.
ధ్యేయః సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణః సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ
హారీ హిరణ్మయ వపుర్ధృతశంఖచక్రః
పద్మాసనాసీనుడై, కేయూర మకర కుండల కిరీటధారియై, శంఖచక్రములను ధరించి ప్రకాశించుచున్న హిరణ్మయమూర్తియగు శ్రీమహావిష్ణువును ధ్యానించుచున్నాను.

శ్రీకృష్ణదత్తభరద్వాజ వివరణ – **ద్యోతతే దీప్యతి ఇతి జ్యోతిః, జ్యోతిః ఆదిత్య ఇవ ఇతి జ్యోతిరాదిత్యః** – సూర్యునివలె ప్రకాశించువాడు జ్యోతిరాదిత్యుడు. ఇందుకు ఆయన చెప్పిన ప్రమాణములు –
వేదాహమేతమ్ పురుషమ్ మహాంతమ్ ఆదిత్యవర్ణమ్ తమసా పరస్తాత్ – శ్వేతాశ్వరోపనిషత్తు 3.8
సర్వస్య ధాతారమ్ అచింత్యరూపమ్ ఆదిత్యవర్ణమ్ తమసా పరస్తాత్ – భగవద్గీత 8.9

ఈశావాస్యోపనిషత్తులోని శ్లోకము (డా. క్రోవి పార్థసారథి ఉదాహరించినది) –
హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం
తత్ త్వం పూషన్న పావృణు సత్యధర్మాయ దృష్టయే
ఓ పరమేశ్వరా! సువర్ణకాంతితో ప్రకాశించే నీ బింబం బ్రహ్మలోకద్వారాన్ని మూతలా కప్పియున్నది. ఓ సూర్యభగవానుడా! వ్రతనిష్ఠుడనైన నేను, సత్యాన్ని దర్శించడానికి వీలుగా బ్రహ్మలోకద్వారానికి మూతలా ఉన్న నీ కాంతిని ఒక్కసారి ఉపసంహరించుకో. అప్పుడు నేను సత్యమార్గాన్ని చూడగలుగుతాను.
ఓం జ్యోతిరాదిత్యాయ నమః.

570. సహిష్ణుః

- అపారమైన సహనము కలవాడు.

- క్షమించువాడు.

- మనకొరకు అమితమైన కష్టములను భరించువాడు. (తాను కర్మరహితుడై కూడాను).

- శత్రువులను జయించువాడు.

- భక్తులు సమర్పించినవానిని ప్రీతితో గ్రహించువాడు.

- ద్వంద్వములను సహించువాడు.

ఓం సహిష్ణవే నమః

ఈ పుణ్యనామము 16వ శ్లోకములోను, 60వ శ్లోకములోను కీర్తింపబడినది.

16వ శ్లోకము. 146వ నామము. సహిష్ణుః – **భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః**

60వ శ్లోకము. 570వ నామము. సహిష్ణుః – **ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుః గతిసత్తమః**

(1) అపారమైన సహనము కలవాడు సహిష్ణువు.

అనేక అపరాధములను సహించువాడు **(అపరాధ సహనాత్ సహిష్ణుః)** అని వ్యాఖ్యానిస్తూ శ్రీభట్టులు నారాయణునికి, రుద్రునికి జరిగిన పోరాటాన్ని ప్రస్తావించారు. పరాజితుడైన శివుని అపరాధమును భగవానుడు మన్నించాడట. ఇది బహుశా బాణాసురుని కాపాడడానికి శివుడు విష్ణువుతో చేసిన యుద్ధం గురించి కావచ్చును. శ్రీ వి.వి. రామానుజన్ శిశుపాలుని తప్పిదాలను శ్రీకృష్ణుడు మన్నించిన వైనాన్ని ఉదాహరించారు. శ్రీ రాధాకృష్ణశాస్త్రి రామాయణంనుండి శ్రీరాముని వర్ణన – **క్షమయా పృథ్వీ సమః** – ను ఉదాహరించారు. అంతే కాకుండా భగవానుడు దేవకి, అదితి, కౌసల్య వంటి క్షమామూర్తులకు జన్మించి వారి క్షమాగుణములను పుణికిపుచ్చుకొన్నాడట.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – 'సహనము' అనేది భగవంతుని తత్వముగా అనిపిస్తున్నది. ఆయన స్వభావము, ధర్మము, నడవడిక – అన్నీ 'సహించుట'తో నిండియున్నవి. **సహతే తద్ధర్మః తత్శీలః తత్సాధుః.** సృష్టిలో ఆయన సహనతత్వము అణువణువునా ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు శరీరం బరువును, ధర్మాలను, కార్యాలను నిలిపియుంచే అస్థిపంజరము.

డా. క్రోవి పార్థసారథి శ్రీకైవల్యసారథిలో వ్రాసినది – **బ్రహ్మాదిమంతు సహనాత్ సహిష్ణురితి కథ్యతే.** బ్రహ్మాదుల అపరాధములను సహించువాడు సహిష్ణువు. **సహతే ఇతి సహిష్ణుః.** దేవతలయొక్క అపరాధములను సహించినవాడు సహిష్ణువు.

ప్రసాదయామాస భవః దేవం నారాయణం ప్రభుం

శరణం జగతామాద్యం వరేణ్యం వరదం హరిం

తద్దైవ వరదో దేవః జితక్రోధః జితేంద్రియః

ప్రీతిమాన భవత్తత్ర రుద్రేణ సహసంజ్ఞుతః

జగములకు ఆదియైనవాడు, సర్వశ్రేష్టుడు, అభీష్టములను ఇచ్చువాడు, సకలపాపరహితుడు, సర్వవ్యాపకుడు అయిన శ్రీమన్నారాయణుని రుద్రుడు ప్రార్థించాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు కోపము పోయి, ప్రీతితో రుద్రునితో కలిసిపోయాడు. ఓం సహిష్ణవే నమః.

(2) క్షమించువాడు సహిష్ణువు.

146వ నామం వ్యాఖ్యానంలో శ్రీభట్టులు భగవంతుని క్షమాగుణాన్ని విస్తారంగా కీర్తించారు. ఆయనకు శరణాగతులైన భక్తుల అపచారములను శ్రీనివాసుడు తప్పక మన్నించును. **ప్రాక్, ఊర్ధ్వంచ, సంచితానామ్, బుధ్యా, అబుధ్యా, సకల కారణైః, సర్వదా, సర్వథా చ, ప్రచీయ మానానామ్, విధి నిషేధ శాసన అతిలంఘనాత్మానామ్, సాధారణానామ్, అతి సాధారణానాం చ, స్వావజ్ఞా నిందానీనామ్, సర్వం సహేన స్వేనాపి దుస్సహానామ్, స్వభక్త విషయాణాంచ, అనవధికానామ్, అపరాధానామ్, సహిష్ణుః.** పూర్వజన్మలో చేసినవి, ఈ జన్మలో చేసినవి, సంచితములు, తెలిసి చేసినవి, తెలియక చేసినవి, అన్ని అంగములతోను, అన్ని ఇంద్రియములతోను అన్ని విధములుగ చేసినవి, శాస్త్రముల విధిని అతిక్రమించి చేసినవి, శాస్త్రములను పాటించకుండ చేసినవి, భగవానుని నిందించి దూషించినవి, భాగవతులను నిందించి దూషించినవి – అన్ని విధములైన పాఫములను క్షమించువాడు సహిష్ణువు. ఓం సహిష్ణవే నమః.

శరణాగతి గద్యములో శ్రీభగవద్రామానుజులు మనమొనరించే కొన్ని దారుణాపచారములను చెప్పి మన పక్షాన శ్రీరంగనాధుని క్షమను అర్థించారు – **మనోవాక్కాయైః అనాదికాల ప్రవృత్త అనంత అకృత్య కరణ అకరణ భగవదపచార భాగవతాపచార అసహ్య అపచార రూప నానావిధ అసహ్య అపచారాన్ ఆరబ్ధ కార్యాన్ అనారబ్ధ కార్యాన్ కృతాన్ క్రియమాణాన్ కరిష్యమాణాన్ శ్చ సర్వాన్ అశేషతః క్షమస్వ.** మనసుచేత గాని మాటలచేతగాని చేతలచేతగాని చేసిన అపచారములను; లెక్కలేనన్ని జన్మలందు చేసిన పాపములను; చేయకూడని పనులు చేయుటవలన గాని, చేయవలసిన పనులు చేయకుండుట వలన గాని ప్రోగుపడిన అనంత పాపములను; భగవంతుని పట్లను, భాగవతుల (భగవద్భక్తుల) పట్లను చేసిన అపచారములను; సహింపరానివి, క్షమింపరానివి అయిన నానావిధ అపచారములను; ఇప్పటికే పండినవి మరియు ఇంకా పండనివి అయిన పాపములను; ఇదివరకు చేసినవి, ఇప్పుడు చేస్తున్నవి, మరియు ఇంకముందు చేయబోవునవి అయిన పాపములను – అంతులేని అన్ని పాపములను మన్నించు ప్రభూ. అన్ని పాపములను భగవంతుడు నిశ్శేషంగా క్షమిస్తాడు. అందుకు ఆయనకు శరణాగతులము కావలెను. ఇదియే ప్రపత్తి.

(3) కర్మరహితుడైకూడా మనకొరకు అమిత కష్టములను సహించువాడు సహిష్ణువు.

గోవర్ధనగిరిని తన వ్రేలిపై ఎత్తినట్లుగా జగన్నాథుడు ఎన్ని అపరాధములు జరిగినాగాని మన్నించి సకల భువనములను భరించియుండును.

(4) శత్రువులను జయించువాడు సహిష్ణువు (సహతే - జయించును).
హిరణ్యాక్షాది దుష్ట రాక్షసులను సంహరించిన శ్రీవరాహమూర్తియే సహిష్ణువు.

(5) భక్తులు సమర్పించినదానిని ప్రీతితో గ్రహించువాడు సహిష్ణువు.
భక్తులు సమర్పించిన పత్రముగాని, పుష్పముగాని, ఫలముగాని, తోయము(జలము)గాని ప్రీతితో గ్రహించువాడు, గ్రహించి తృప్తినొందువాడు సహిష్ణువు. ఇది ఆయన గుణము అని శ్రీ కృష్ణదత్తభరద్వాజ ఈ నామమును వ్యాఖ్యానించారు. **సహితుమ్ తృప్తిమ్ అనుభవితుమ్ భక్త ఉపహృతైః ఫలాదిభిః శీలమ్ యస్య ఇతి సహిష్ణుః – సోఢుమ్ తృప్తిమ్ అనుభవితుమ్ స్వజన సేవయా శీలమ్ అస్య ఇతి సహిష్ణుః**.

(6) ద్వంద్వములను సహించువాడు సహిష్ణువు.
ఈ నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య – **ద్వంద్వాని శీతోష్ణాదీని సహత ఇతి సహిష్ణుః** – భగవంతుడు శీతోష్ణములు, సుఖ దుఃఖములు వంటి ద్వంద్వములకు అతీతుడు. బదరికాశ్రమములో నరనారాయణులుగా శ్రీదేవుడు చేసిన తపస్సు ఈ విషయమును తెలుపుచున్నదని శ్రీ అనంతకృష్ణశాస్త్రి వ్రాశారు.
ఓం సహిష్ణవే నమః.

571. గతిసత్తమః

- ధర్మమార్గమును బోధించువారిలో ఉత్తముడు.
- శరణాగతులకు ఉత్తమ గమ్యము.
- పరమోత్కృష్టమైన ఆలంబనము మరియు అందరికంటె గొప్పవాడు.

ఓం గతిసత్తమాయ నమః

ఈ నామమును **సద్గతిః తమః, గతిః సత్తమశ్చ, సత్ తమః గతైః** – ఇలా అనేక విధాలుగా వివరించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స ఏవ పరమ ధర్మాధ్వదేశికత్వేన గతిః సత్తమః - గతౌ ప్రత్యయిత తమః** – భగవానుడు గీత, వేదములవంటి ధర్మశాస్త్రములను ప్రసాదించాడు. ధర్మములనుపదేశించు గురువులలో ఆయన ఉత్తముడు. జగద్గురువు. గతిసత్తముడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ఈ నామము భగవానుని 'గతి', 'సత్తమ' అనే రెండు గుణాలను సూచిస్తుంది. **గతిశ్చ అసౌ సత్తమశ్చ ఇతి గతిసత్తమః**. ఆయనే అందరికి గతి (ఆశ్రయము) మరియు అందరికంటెను గొప్పవాడు (సత్-తమః). కనుక గతిసత్తముడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వ్యాఖ్య – కోరవలసినవానిలో సర్వోత్తముడైనందున భగవానుడు గతిసత్తముడు. ఎందుకంటే ఆ శ్రీమన్నారాయణుడు సహనము కలవాడు మరియు క్షమించువాడు (సహిష్ణువు). పాపులను కూడా క్షమించి ఆశ్రయమిస్తాడు కనుక ఆయనను ఆశ్రయించడమే తగిన కర్తవ్యము.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **గంతవ్య స్థానే గతి ప్రయోగః**. వెళ్ళవలసిన చోటును 'గతి' అన్న పదం సూచిస్తుంది. అలా చేరవలసిన సర్వోత్తమస్థానం హరిచరణ సన్నిధియే. **శ్రీమన్నారాయణ చరణ సాన్నిధ్యమేవ సర్వోత్తమమ్ గంతవ్యమ్.**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ కూడా ఇదే భావాన్ని చెప్పారు –

గతి శబ్దేన ఇహ గతిరాశ్రయః గృహ్యతే

తేన గతిరాశ్రితానామ్ శ్రేష్ఠతమో గతిసత్తమః

ఓం గతిసత్తమాయ నమః

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.